

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 250

గురువారం 1-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



జాతీయ క్రీడా పురస్కారాలు ప్రదానం

రాష్ట్రపతి ముర్ము నుంచి 'అర్జున' అవార్డు అందుకున్న నిఖత్ జరీన్ (బాక్సింగ్), ఆకుల శ్రీజ (టేబుల్ టెన్నిస్)

- వివరాలు 12లో



గుజరాత్ తొలి దశ పోలింగ్ నేడే

గుజరాత్ అసెంబ్లీ తొలి దశ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం 19 జిల్లాల్లో 89 స్థానాలకు పోలింగ్ జరగనుంది.

వివరాలు 6లో



నాకు స్వర్గం గ్యారెంటీ!

శ్రద్ధా వాకర్‌ను చంపినందుకు తనకు పశ్చాత్తాపం లేదని.. తనకు స్వర్గం గ్యారెంటీ అని అఫ్తాబ్ పాలిగ్రాఫ్ టెస్టులో వెల్లడించాడు.


వివరాలు 6లో



అత్యుత్తమ నగరాలివే..

ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల్లో వెలెన్సియా (స్పెయిన్) అగ్రస్థానం సాధించగా.. తర్వాతి స్థానాల్లో దుబాయ్, మెక్సికో సిటీ ఉన్నాయి.

వివరాలు 6లో



విజయ్‌కి 'లైగర్' సెగ!

'లైగర్' చిత్రంలో పెట్టుబడులకు సంబంధించి ఆ చిత్ర హీరో విజయ్ దేవరకొండను బుధవారం ఈడీ అధికారులు ప్రశ్నించారు.

వివరాలు 10లో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ప్రముఖులు

అమిత్ అరోరా రిమాండ్ రిపోర్టులో ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణంలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారి పేర్లను ఈడీ వెల్లడించింది. బుధవారం ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా సహచరుడు అమిత్ అరోరాను రౌజ్ అవెన్యూ కోర్టులో హాజరుపరుస్తూ రిమాండ్ రిపోర్టును ధర్మాసనానికి అందజేసింది. ఈ రిపోర్టు ద్వారా తొలిసారిగా ఎమ్మెల్సీ కె.కవిత పేరు బయటకొచ్చింది. దక్షిణాది గ్రూప్ నుంచి విజయ్‌నాయర్‌కు రూ.100 కోట్లు లంచాలు అందాయని

మిగతా 10వ పేజీలో ▶

విదేశాల్లో MBBS తోపాటు అమెరికాలో PG మరియు స్కాలర్‌షిప్ అవకాశాలు

వివరాలు 5వ పేజీలో



అన్నమయ్య జిల్లా మదనపల్లెలో సభకు హాజరైన భారీ జన సందోహంలో ఓ భాగం

జన సునామీ

కనుచూపు మేర జనంతో సభా ప్రాంగణం, రోడ్లన్నీ కిటకిట

- 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలతో హోరెత్తిన మదనపల్లెలోని జగనన్న విద్యాదీవెన సభా ప్రాంగణం
- ముఖ్యమంత్రి తిరిగి వెళ్లే వరకు 'జై జగన్' నినాదాలు
- సభాస్థలి సరిపోక జనంతో నిండిపోయిన కదిరి రోడ్డు
- పట్టణ చరిత్రలో ఇంతటి జన ప్రవాహం ఇదే ప్రథమం

మదనపల్లి నుంచి సాక్షి ప్రతినిధి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాకతో మదనపల్లె కిక్కిరిసింది. సభా ప్రాంగణం, రోడ్లన్నీ కిటకిటలాడాయి. ఇంత వరకు ఏ రాజకీయ నేతకు, ముఖ్యమంత్రికి దక్కని ఘన స్వాగతం, జన నీరాజనం ఆయనకు లభించింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బుధవారం జగనన్న విద్యా దీవెన పథకం కింద నిధుల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రజలు కనీవినీ ఎరుగని రీతిలో పోటెత్తారు. ఇసుక వేస్తే రాలనంతంగా కనుచూపు మేర తరలివచ్చారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల ఊహకందని రీతిలో సభకు జనం హాజరు కావటం

మిగతా 2వ పేజీలో ▶

నాడు మోసగించి, నేడు లెక్చర్లా?

- ఇదేమి ఖర్మరా బాబూ.. అంటున్నారు జనం
- విద్యా దీవెన నిధులు విడుదల చేస్తూ సీఎం జగన్ విమర్శ
- 11.02 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.694 కోట్లు జమ

2లో



ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణపై కసరత్తు

- త్వరలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధుల కమిటీ పర్యటన

14లో

'ఇనాం' రైతులకు పట్టాలిచ్చేలా..

- కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు సర్క్యులర్ జారీ చేసిన ప్రభుత్వం
- ఇనాం గ్రామాల సర్వే, సెటిల్మెంట్‌కు మార్గదర్శకాలు

14లో

ప్రాధాన్యత బిల్లులకు రూ.499.99 కోట్లు

- గ్రామీణ ప్రాంతాలకు రూ.348.14 కోట్లు, పట్టణాలకు రూ.151.85 కోట్లు
- నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు
- 3,663 సచివాలయాల్లో రూ.732.60 కోట్ల పనులు మంజూరు

10లో

లాస్ట్ చాన్స్.. ప్లీజ్!

- ఆఖరి అవకాశం నాకు కాదు.. రాష్ట్రానికి
- 40 ఏళ్లుగా రాజకీయాల్లోనే.. ఎమ్మెల్యే పదవితో పనిలేదు
- నన్ను, లోకేశ్‌ను చంపేస్తారట
- 'ఏలూరు' పర్యటనలో చంద్రబాబు

14లో

క్లుప్తంగా

రేపటి నుంచి వైఎస్సార్ జిల్లాలో సీఎం జగన్ పర్యటన

- రెండురోజులు పర్యటించనున్న ముఖ్యమంత్రి
- పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్న సీఎం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్ర, శనివారాల్లో (డిసెంబర్ 2, 3 తేదీల్లో) వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది.

డిసెంబర్ 2 షెడ్యూల్

ముఖ్యమంత్రి ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 11.50 గంటలకు లింగాల మండలంలోని పార్నపల్లి వద్ద సీబీఆర్ రిజర్వాయర్ వద్దకు చేరుకుంటారు. 12 గంటల నుంచి 12.30 వరకు బోటింగ్ జెట్టీని ప్రారంభిస్తారు. 2.40 గంటలకు డాక్టర్ వైఎస్సార్ లేక్ వ్యూ పాయింట్‌కు చేరుకుని వైఎస్సార్ లేక్ వ్యూ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి ఇడుపులపాయలోని గెస్ట్ హౌస్ చేరుకుని రాత్రికి అక్కడ బసచేస్తారు.

డిసెంబర్ 3 షెడ్యూల్

ఉదయం 8.30 గంటలకు ఇడుపులపాయ వైఎస్సార్ ఎస్టేట్ నుంచి బయలుదేరి 8.55 గంటలకు పులివెందుల భాకరాపురం చేరుకుంటారు. 9.15 నుంచి 9.30 మధ్య కదిరి రోడ్డులోని ఎస్‌సీఎస్ఆర్ గార్డెన్స్‌కు చేరుకుని సీఎం వ్యక్తిగత సహాయకుడు (పీఏ) డి.రవిశేఖర్ కుమార్తె వివాహవేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదిస్తారు. 9.45 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.30 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి

- పీలేరు కాంగ్రెస్ ఇన్‌చార్జి అఫూ మొహిద్దీన్ కూడా..




నరేష్‌కుమార్‌రెడ్డి, మొహిద్దీన్‌లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గ టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అఫూ మొహిద్దీన్ వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం మదనపల్లెలో హెలిప్యాడ్ వద్ద వారు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిల ఆధ్వర్యంలో సీఎం జగన్ వద్దకు వెళ్లారు. వారికి ముఖ్యమంత్రి.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేష్‌కుమార్‌రెడ్డి.. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనుచరుడిగా కాంగ్రెస్ పార్టీ మదనపల్లె మున్సిపల్ చైర్మన్‌గా పని చేశారు.

గ్రూప్-1 స్పోర్ట్సు కోటా పోస్టులకు ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: గ్రూప్-1.. 2018 నోటిఫికేషన్‌కి సంబంధించి మిగిలి ఉన్న స్పోర్ట్సు కోటా పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ఏపీపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. ఈమేరకు కమిషన్ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచారు. డిప్యూటీ సూపరింటెండెంటు ఆఫ్ పోలీసు (సివిల్), డిప్యూటీ సూపరింటెండెంటు ఆఫ్ పోలీసు జైల్స్ (పురుష), అసిస్టెంటు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంటు పోస్టులకు ఒక్కొక్కరు చొప్పున ఎంపికయ్యారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- 62.31 లక్షల మందికి రూ.1,584.87 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి/దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా): రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లను పంపిణీ చేయనుంది. ఇందుకోసం రూ.1,584.87 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ఆ ప్రాంతంలోని లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా పింఛన్ డబ్బును ప్రభుత్వం.. ఆయా సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ నెలకు సంబంధించి 62.31 లక్షల మందికి లబ్ధిదారులకు పింఛన్ అందజేయనున్నట్లు తెలిపారు. అమరావతిలోని 17,173 మంది భూమి లేని నిరుపేదల పింఛన్లను నవంబర్ నుంచి వైఎస్సార్ పింఛన్ కానుకతో ఏకీకృతం చేసినట్టు వివరించారు. గురువారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులు అందజేస్తారని మంత్రి తెలిపారు. సాంకేతిక కారణాలతో ఏ ఒక్కరికీ పింఛన్ అందలేదనే ఫిర్యాదులు రాకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుందని చెప్పారు. పింఛన్ల పంపిణీని ఐదు రోజుల్లోగా నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

నాడు మోసగించి, నేడు లెక్చర్లా?

దుష్టచతుష్టయం.. గజ దొంగల ముఠా మాటలు నమ్మొద్దు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఫలానా ప్రాంతంలో.. ఫలానా పొలాలను.. ఫలానా రేటుకు అమ్ముకునేందుకు మాత్రమే ఒక రాజధాని కట్టాలన్నది వారి ఆలోచన. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద వర్గాలకు రాజధానిలో ఇళ్ల స్థలాలు ఇస్తామంటే సామాజిక సమతుల్యం దెబ్బతింటుందని వారు వాదిస్తున్నారు. ఇలాంటి వారి మెదళ్లను మార్చగల చదువులు ఎంతైనా అవసరం. వారికి మంచి జ్ఞానం, మంచి బుద్ధిని ప్రసాదించాలని ఆ దేవుడిని కోరాల్సిన పరిస్థితి నెలకొంది.

"పిల్లల చదువుల కొరకు ప్రభుత్వం పెట్టే ఏ ఖర్చైనా సరే.. దానిని నేను ఖర్చుగా భావించను. అది నేను నా పిల్లలకిచ్చే ఆస్తిగా భావిస్తాను. 'మీరు గొప్పగా చదవండి.. మీ చదువులకి పూచీ నాది..' అని ప్రతి చిట్టి చెల్లెమ్మకు, తమ్ముడికీ చెబుతున్నా. 'మీ ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా పరవాలేదు.. అంతమందినీ చదివించండి.. మీ అన్న, తమ్ముడు చదివిస్తాడు' అని ప్రతి అక్కకూ, చెల్లెమ్మకూ చెబుతున్నా. నేరుగా మీ ఖాతాల్లో పడుతున్న డబ్బును వారం పది రోజుల్లో కాలేజీలకు వెళ్లి చెల్లించండి. పిల్లలు ఎలా చదువుతున్నారో కూడా విచారించండని విజ్ఞప్తి చేస్తున్నా.

"మీ అన్న, మీ తమ్ముడు, మీ బిడ్డ.. మనందరి ప్రభుత్వం.. అధికారం చేపట్టి ఈ రోజుకు సరిగ్గా మూడున్నరేళ్లు. ఈ సందర్భంగా మీలో ఒకడిగా, మీ వాడిగా నాతో సమయం పంచుకునేందుకు ఇక్కడికి వచ్చిన ప్రతి అక్కాచెల్లెమ్మకూ, ప్రతి అవ్వాతాతకు, సోదరుడికి, స్నేహితుడికీ, ప్రతి ఒక్కరికీ చేతులు జోడించి హృదయపూర్వక కృతజ్ఞతలు.

– ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ప్రతిపక్షాలకు మంచి బుద్ధిని ప్రసాదించాలని దేవుడిని కోరుకుంటున్నా
- మానవతావాదంతో కూడిన జ్ఞానం రావాలని ఆకాంక్షిస్తున్నా
- ఉన్నత చదువులకు పేదరికం అవరోధం కాకూడదు
- పోటీ ప్రపంచంలో గెలవాలనే విద్యా వ్యవస్థలో సంస్కరణలు
- విప్లవాత్మక కార్యక్రమాలతో ఉన్నత విద్యలో సమూల మార్పులు
- ఒక్క విద్యా రంగంలోనే ఏకంగా రూ.55 వేల కోట్లు వెచ్చించాం
- దుష్టచతుష్టయం.. గజ దొంగల ముఠా మాటలు నమ్మొద్దు
- మీకు మంచి జరిగిందా లేదా అన్నదే ప్రామాణికంగా తీసుకోండి



విద్యా దీవెన పథకం లబ్ధిదారులైన విద్యార్థులు, తల్లిదండ్రులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



విద్యా దీవెన పథకం చెక్కుతో సీఎం జగన్

మదనపల్లె నుంచి సాక్షి ప్రతినిధి: 'రైతులను మోసం చేసిన చంద్రబాబునాయుడు వ్యవసాయం గురించి మాట్లాడుతుండటం విడ్డూరం. పిల్లలకు అన్యాయం చేసి, ఎడ్యుకేషన్ గురించి.. అక్కచెల్లెమ్మలకు ద్రోహం చేసి, మహిళా సాధికారత గురించి.. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలను అవమానించి, అన్యాయం చేసి.. సామాజిక న్యాయం గురించి ఈరోజు లెక్చర్లు దంచుతుంటే.. రాష్ట్ర ప్రజలంతా ఇదేమి ఖర్మరా బాబూ!' అని అనుకుంటున్నారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇలాంటి కుళ్లిపోయిన పెత్తందారీ మనస్తత్వం ఉన్న చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5లు సాగిస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బుధవారం ఆయన జగనన్న విద్యా దీవెన పథకం (పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్) కింద 11.02 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ నాలుగో ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికం నిధులు రూ.694 కోట్లు వారి తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్షరాలు రాయడం, చదవడం మాత్రమే విద్యకు పరమార్థం కాదని.. ప్రతి ఒక్కరూ తమకు తాముగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోగలిగే శక్తిని ఇవ్వగలగడమే విద్యకు పరమార్థం అని ప్రపంచ ప్రఖ్యాత ఫిజిసిస్ట్ ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చక్కగా చెప్పారన్నారు. ఈ రోజు అటువంటి ఆలోచనా శక్తి కొరవడిన ప్రతిపక్షాలకు ఎప్పటికైనా అది రావాలని ఆ దేవుడిని కోరుకుంటున్నానని చెప్పారు. పేదల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదవడానికి వీల్లేదని వాదించే వారి సంస్కారాలు మారాలని, నా వారు మాత్రమే బాగుపడాలని కోరుకునే మనస్తత్వం నుంచి.. మనుషులంతా ఒక్కటే అన్న మానవతావాదంతో కూడిన జ్ఞానం వారందరికీ రావాలని కూడా ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

పిల్లలకు మనమివ్వగలిగే ఆస్తి చదువులే

- పిల్లలకు మనమివ్వగలిగిన ఆస్తి ఏదైనా ఉందంటే అది చదువులే. ఏ ఒక్క పాప, బాబు.. చదువులకు పేదరికం అవరోధం కాకూడదని మంచి మనస్సుతో అప్పట్లో ఆ ప్రియతమ నేత, దివంగత నాయకుడు రాజశేఖరరెడ్డి దేశంలో ఎక్కడా కనీవినీ ఎరుగని విధంగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారు. ఆ గొప్ప పథకాన్ని ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలన్నీ నీరుగార్చుతూ వచ్చాయి.
- చదువుల కోసం ఎంతగా ఇబ్బంది పడుతున్నారో నా 3,648 కిలోమీటర్ల పాదయాత్రలో కళ్లారా చూశాను. వారి కష్టాలు విన్నాను. నేను ఉన్నాను అని చెప్పాను. అందుకే అధికారంలోకి రాగానే ఆ పరిస్థితులను మారుస్తూ విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చాం.
- జగనన్న విద్యా దీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మీ ప్రభుత్వం భుజ స్కంధాలపై మోస్తోంది. హాస్టల్ ఖర్చుల కోసం ఏటా రూ.20 వేల వరకు సాయం చేసేలా జగనన్న వసతి దీవెన పథకాన్ని అమలు చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలోని 2017-18, 2018-19కు సంబంధించి రూ.1,778 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెడితే మనందరి ప్రభుత్వం చిరునవ్వుతో వాటిని చెల్లించింది.
- ఈ మూడున్నరేళ్లలో జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా రూ.9,052 కోట్లు, జగనన్న వసతి దీవెన పథకం ద్వారా రూ.3,349 కోట్లు.. మొత్తంగా ఈ రెండు పథకాల ద్వారా రూ.12,401 కోట్లు ఖర్చుపెట్టాం.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

- ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ తీసుకొచ్చాం. మీ పిల్లలను బడులకు పంపిస్తూ ప్రోత్సహిస్తున్నందుకు 'జగనన్న అమ్మఒడి' ద్వారా మీకు తోడుగా ఉన్నాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, మన బడి నాడు-నేడు, బైలింగ్వల్ టెక్స్ట్‌బుక్స్, బైజూస్‌తో ఒప్పందం, 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు, డిజిటల్ క్లాస్ రూములు.. ఇలా ఎన్నో పథకాలు, కార్యక్రమాల ద్వారా స్కూళ్ల రూపురేఖలు మారుస్తున్నాం.
- ఉన్నత విద్యలో కరిక్యులమ్ అంతా కూడా జాబ్ ఓరియంటెడ్‌గా మార్పులు చేస్తూ వచ్చాం. డిగ్రీలు చదివేటప్పుడే ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశాం. ఆన్‌లైన్ వర్టికల్స్ విత్ క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ తీసుకొచ్చాం. ఆన్‌లైన్‌లో కూడా మంచి కోర్సులు ఎక్కడున్నాయా అని వెదికి పట్టుకుంటున్నాం. వాటిని కూడా మన పిల్లలకు నేర్పిస్తూ.. వాటికి కూడా క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ కింద అనుమతులు ఇస్తున్నాం.
- ప్రఖ్యాత సంస్థలన్నింటితో మాట్లాడి సర్టిఫైడ్ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను మన పిల్లలకు అందుబాటులోకి తెస్తున్నాం. విద్యా రంగాన్ని ఉపాధికి చేరువగా తీసుకుపోతున్నాం.

మూడున్నరేళ్లలో రూ.55 వేల కోట్లు

- జగనన్న అమ్మఒడి ద్వారా రూ.19,617 కోట్లు, జగనన్న విద్యా దీవెన ద్వారా రూ.9,051 కోట్లు, జగనన్న వసతి దీవెన ద్వారా మూడున్నరేళ్లలో రూ.3,349 కోట్లు, జగనన్న విద్యా కానుక ద్వారా మరో రూ.2,368 కోట్లు ఖర్చు చేశాం. ఎనిమిదో తరగతి పిల్లలు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు ఇచ్చేందుకు మరో రూ.685 కోట్లు ఈ డిసెంబర్‌లో ఖర్చు చేయబోతున్నాం.
- జగనన్న గోరుముద్ద ద్వారా రూ.3,239 కోట్లు, పాఠశాలల్లో నాడు-నేడు కార్యక్రమం ద్వారా మొదటి ఫేజ్‌లో రూ.3,669 కోట్లు ఇప్పటికే ఖర్చు చేశాం. ఈ ఏడాది నాడు-నేడు ఫేజ్ 2 కింద మరో రూ.8 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నాం. వైఎస్సార్ సంపూర్ణపోషణ కోసం రూ.4,895 కోట్లు, శానిటరీ నేప్‌కిన్స్ అందించే 'స్వేచ్ఛ' అనే కార్యక్రమం కోసం రూ.32 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మొత్తంగా ఈ మూడున్నరేళ్లలోనే విద్య కోసం మీ జగనన్న ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.55 వేల కోట్లు.
- మనందరి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి ఏటా మూడు లక్షల మంది పిల్లలు డిగ్రీ పట్టాలు అందుకుంటే.. వారిలో 37 వేల మందికే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలొచ్చేవి. 2021-22లో క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా 85 వేల మంది పిల్లలకు ఉద్యోగాలొచ్చాయి.

పెత్తందార్ల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

- నవరత్నాల పాలనతో పేదలకు మనందరి ప్రభుత్వం మంచి చేస్తుంటే.. దానిని జీర్ణించుకోలేక, పేదలు బాగుపడటం తట్టుకోలేక, తమకు పుట్టగతులుండవనే భయంతో ఈ పెత్తందార్లు అంతా కలిసి దుష్ప్రచారం చేస్తున్నారు. జగన్ బటన్ నొక్కడం వల్ల రాష్ట్రం శ్రీలంక అయిపోతుందట! ఇదే రాష్ట్రం వీళ్ల అధికారంలో ఉన్నప్పుడు అమెరికా అట!
- ఈ గజదొంగల ముఠాకు దుష్టచతుష్టయం అని పేరు. అందులో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబు. వీరికి తోడు దత్తపుత్రుడు. ఈ గజదొంగల ముఠా రాష్ట్రాన్ని దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) అనే పద్ధతిలో పాలించింది. అందుకే ఆ రోజు బటన్లు లేవు. నొక్కే వారూ లేరు. ప్రజలకు నేరుగా మంచి జరగాలనే ఆలోచనలే లేవు.
- ఈ ముఠా చేస్తున్న దౌర్భాగ్యపు రాజకీయాలను ఎవరూ రాయరు. ఎవరూ చూపరు. ప్రశ్నించే వారు కూడా లేరు. అటువంటి వారితో ఈరోజు మనం యుద్ధం చేస్తున్నాం. ఇవాళ మీ బిడ్డ ఇటువంటి పత్రికలను, టీవీ చానళ్లను నమ్ముకోలేదు. దత్తపుత్రుడినీ అంత కన్నా నమ్ముకోలేదు.
- మీ ఇంట్లో మంచి జరిగిందా లేదా అన్నది ఒక్కటే కొలమానంగా తీసుకోండి. మీ ఇంట్లో మంచి జరిగితే జగనన్నకు తోడుగా ఉండండి. ఇవాళ మనం రాక్షసులతో, మారీచులతో యుద్ధం చేస్తున్నాం. ఈ రోజు చెడిపోయి ఉన్న రాజకీయ వ్యవస్థతో యుద్ధం చేస్తున్నాం. ఇంతకు ముందు కూడా రాష్ట్రానికి ఇదే బడ్జెట్ ఉండేది. మరి అప్పుడు పాలకులు ఎందుకు జగన్ మాదిరిగా నేరుగా బటన్ నొక్కి.. మా బ్యాంకు ఖాతాల్లోకి ఎందుకు డబ్బులు వచ్చేటట్లు చేయలేకపోయారని ఆలోచించండి. గత ప్రభుత్వానికి, మనందరి ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను గమనించండి.
- మీ బిడ్డ నమ్ముకున్నది దేవుడిని, మిమ్మల్ని మాత్రమే. మీతోనే నా పొత్తు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి 98 శాతం హామీలను అమలు చేశాం. మీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మీ ఇంటి గడప వద్దకు వచ్చి మీకు జరిగిన మేలు గురించి అడుగుతున్నారు. మీ బిడ్డ ప్రభుత్వాన్ని దీవించమని మీ ఆశీస్సులు తీసుకుంటున్నారు.

మదనపల్లెకు వరాల జల్లు

నా సోదరుడు, ఎమ్మెల్యే నవాజ్ మదనపల్లి అభివృద్ధి కోసం కొన్ని కార్యక్రమాలు అడిగారు. మెడికల్ కాలేజీ ఇప్పటికే మంజూరు చేశాం. శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు.. ఈ నెలలోనే పనులు మొదలవ్వనున్నాయి. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో 2 వేల అడుగుల లోతుకు బోరు వేస్తే తప్ప తాగడానికి నీళ్లు లేని పరిస్థితి. ఈ పరిస్థితిని మార్చాలన్న తపనతో వాటర్ గ్రిడ్ కోసం రూ.1,800 కోట్లు మంజూరు చేశాం. ఇందులో మదనపల్లెకే రూ.400 కోట్లు వస్తుంది. మున్సిపాల్టీ అభివృద్ధి కోసం రూ.38 కోట్లు ఇచ్చాం. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మొలకలచెరువు నుంచి మదనపల్లె ఎన్‌హెచ్ రోడ్డుకు రూ.400 కోట్లతో, మదనపల్లె- తిరుపతి ఎన్‌హెచ్ రోడ్డుకు మరో రూ.1,600 కోట్లతో మంజూరు ఇప్పించాం. మీ అందరి కోరిక మేరకు మదనపల్లె బీటీ కాలేజీని ప్రభుత్వంలో విలీనం చేశాం. మదనపల్లె టిప్పుసుల్తాన్ మసీదు కోసం రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నాం. మదనపల్లె నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం రూ.30 కోట్ల ప్రతిపాదనలు ఇచ్చారు. వాటిని కూడా ఆమోదిస్తున్నాను. మదనపల్లె టౌన్ పరిధిలో 3 బ్రిడ్జిలు నిర్మాణంలో ఉన్నాయి. వాటిని పూర్తి చేయడం కోసం మరో రూ.14 కోట్లు అడిగారు. అదీ మంజూరు చేస్తున్నాం. బహుదా నదిపై బ్రిడ్జి కోసం అవసరమైన మరో రూ.7 కోట్లు కూడా ఇస్తున్నాం. వీటిన్నింటి ద్వారా మదనపల్లెకు మంచి జరగాలని కోరుకుంటున్నాను.



సభా ప్రాంగణం నిండిపోవడంతో బయట నుంచే సీఎం జగన్ ప్రసంగాన్ని ఆలకిస్తున్న అశేష జనవాహినిలో ఓ భాగం

జన సునామీ

▶ మొదటి పేజీ తరువాయి

మదనపల్లె చరిత్రలో ఇదే ప్రథమం అని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

అంచనాలకు మించి..

మదనపల్లెలో రాజకీయ నాయకుల సభలు మామూలుగా మిషన్ కాంపౌండ్‌లో జరుగుతుంటాయి. అయితే సీఎం సభకు భారీగా జనం తరలివస్తారని భావించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, కలెక్టర్ గిరీషాలు కదిరి రోడ్డులోని టిప్పు సుల్తాన్ మైదానంలో సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సభలో 35 వేల మంది కూర్చునేలా.. ఇంకా జనం ఎక్కువైతే దాని చుట్టూ కూడా కూర్చొనేలా మరో పది వేల మందికి ఏర్పాట్లు చేశారు. అయితే అధికారులు, ప్రజా ప్రతినిధులు ఊహించని విధంగా ఉదయం 7 గంటల నుంచే ప్రజలు సభా వేదిక వద్దకు తరలిరావటం మొదలైంది. తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాల నుంచి ప్రజలు ప్రత్యేక వాహనాల్లో మదనపల్లెకు చేరుకున్నారు. విద్యార్థులు, మహిళల కోసం రిజర్వు చేసిన గ్యాలరీలు నిండిపోయాయి. ఉదయం 10 గంటలకల్లా సభ ప్రాంగణం నిండిపోయింది. ప్రాంగణం చుట్టూ.. పెద్ద సంఖ్యలో జనం ఉండిపోయారు. అప్పటికే పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి ఉండటంతో కదిరి రోడ్డు మొత్తం జనంతో కిటకిటలాడింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలిప్యాడ్ చేరుకోగానే కదిరి రోడ్డు ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. అంటే సభలో కూర్చున్న వారికంటే.. రెండు మూడింతల జనం కదిరి రోడ్డు, సభ ప్రాంగణం చుట్టూ నిలుచుండిపోవాల్సి వచ్చింది. సీఎం జగన్ ప్రసంగాన్ని అలానే తిలకించారు. అధికారులు ముందు జాగ్రత్తగా ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేయటం ప్రజలకు ఊరటనిచ్చింది.



సభా ప్రాంగణానికి మరోవైపు నిలిచిపోయిన జన సందోహంలో ఓ భాగం

హోరెత్తిన నినాదాలు

మదనపల్లె పట్టణం 'జై జగన్' నినాదాలతో హోరెత్తింది. సీఎం వైఎస్ జగన్ రేణిగుంట నుంచి ఉదయం 10.45 గంటల ప్రాంతంలో మదనపల్లె హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి 11.33 గంటలకు సభ వేదిక వద్దకు వచ్చారు. బీటీ కళాశాల మైదానం నుంచి బెంగళూరు రోడ్డు మీదుగా బీసెంట్ కూడలి, పటేల్ రోడ్డు, ఎన్టీఆర్ కూడలి, కదిరి రోడ్డు మీదుగా టిప్పు సుల్తాన్ మైదానం చేరుకున్నారు. రహదారికి ఇరువైపులా ప్రజలు వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతూ.. జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. సభా వేదిక వరకు జనం రోడ్లపై కిక్కిరిసిపోయారు. మధ్యాహ్నం 1.11 గంటలకు సభ ముగించి వైఎస్ జగన్ తిరుగు పయనమయ్యారు. ఈ రెండు సమయాల్లోనూ సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. నినాదాలతో నీరాజనం పలికారు. సభ జరిగినంత సేపు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు వైఎస్ జగన్‌కు మద్దతుగా సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేయడంతో మైదానం దద్దరిల్లింది. జగనన్న విద్యాదీవెన ద్వారా లబ్ధి పొందిన మదనపల్లెకు చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని షేక్ మహీర్, బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న ములకలచెరువు మండలానికి చెందిన సౌజన్య సభలో ప్రసంగించారు.

చిన్నారి వైద్యానికి సీఎం హామీ



మదనపల్లెలో బుధవారం సీఎం వస్తున్న దారిలో మహమీదా అనే మహిళ తన ఏడాదిన్నర వయసున్న చిన్నారిని చేతులపైకి ఎత్తుకుని 'జగనన్నా.. నా బిడ్డను కాపాడన్నా' అని వేడుకుంది. బస్సులో నుంచి ఆ దృశ్యం గమనించిన సీఎం.. ఆమెను సభాస్థలి వద్దకు పిలిపించారు. 'అన్నా.. నా కుమారుడు షేక్ మహమ్మద్ అలీ తల రోజు రోజుకూ పెరిగిపోతోంది. వేలూరులోని సీఎంసీ ఆస్పత్రిలో చూపించాం. తలకు ఆపరేషన్ చేయాలని, చాలా డబ్బు ఖర్చవుతుందని చెప్పారు. మేం పేదోళ్లం. ఎలాగైనా మీరే ఆదుకోవాలి' అని కన్నీటిపర్యంతమైంది. చిన్నారి ఆపరేషన్‌కు అయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. తక్షణ వైద్య ఖర్చులకు రూ.లక్ష, చిన్నారికి రూ.3 వేల పింఛన్ మంజూరు చేయాలని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ గిరీషా హమీదాకు రూ.లక్ష సాయం అందజేశారు. స్విమ్స్‌లో చికిత్సకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. – మదనపల్లె

కాన్వాయ్ ఆపి.. అంబులెన్స్‌కు దారి



అంబులెన్స్‌కు దారి ఇస్తున్న సీఎం బస్సు

సాక్షి, రాయచోటి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి పెద్ద మనసు చాటారు. ఆపదలో ఉన్న వారిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న అంబులెన్స్‌కు దారి ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని కదిరి రోడ్డులో ముఖ్యమంత్రి వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. తన పర్యటనలో భాగంగా బహిరంగ సభా ప్రాంగణానికి వెళ్లేందుకు సీఎం కాన్వాయ్ బయలుదేరింది. జనం మధ్య రోడ్‌షో తరహాలో ముందుకు సాగుతున్న తరుణంలో అంబులెన్స్ ఎదురుగా వచ్చింది. అప్పటికే ఇరువైపులా ప్రజలు, అభిమానులు, బందోబస్తుకు వచ్చిన పోలీసులతో రోడ్డు కిక్కిరిసిపోయింది. అంత హడావుడిలో అంబులెన్స్ రాకను గమనించిన సీఎం.. దారి ఇవ్వాలంటూ అధికారులకు సూచించారు. సీఎం కాన్వాయ్ బస్సును పక్కన ఆపించి, అంబులెన్స్‌కు దారి ఇచ్చారు. అందులో మదనపల్లె మండలంలోని కాట్లాటిపల్లెకు చెందిన పూర్ణ శాంతమ్మను ఆస్పత్రికి తరలిస్తున్నారు. అంబులెన్స్ నుంచి పేషెంట్ బంధువులు సీఎంకు చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న అంటే నమ్మకం.. ధైర్యం



అన్నా.. మాది ములకలచెరువు. నేను డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాను. నాడు వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నేడు సీఎం జగన్ అద్భుతంగా పూర్తి స్థాయిలో కొనసాగిస్తూ నాలాంటి మధ్య తరగతికి విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం కల్పిస్తున్నారు. విద్యా దీవెన పథకం కింద ఇప్పటి వరకు మా అమ్మ ఖాతాలో రూ.27,600 జమ అయింది. మహిళలకు బంగారు బాటలు వేస్తున్న డైనమిక్ సీఎం మీరు. అందుకే జగనన్న అంటే మా నమ్మకం.. మా ధైర్యం.

– సౌజన్య, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల

మా జీవితాల్లో మార్పు ఖాయం



జగనన్న లాంటి సీఎం మాకు దొరకడం అదృష్టం. నేను మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంఈసీఎస్ చదువుతున్నాను. సీఎం తీసుకొచ్చిన సంస్కరణలు మా జీవితాల్లో మార్పులు తెస్తాయనడంలో సందేహం లేదు. హయ్యర్ ఎడ్యుకేషన్‌లో కరికులం మార్పుతో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశారు. ప్రస్తుతం నేను కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నా. మా సీనియర్స్ మైక్రోసాఫ్ట్, ఒరాకిల్ సంస్థల్లో ఇంటర్న్‌షిప్, ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకుంటున్నారు.

– షేక్ మహీర్, మదనపల్లె



బాపట్ల జిల్లా కట్టావాదపాలెంలో సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



నంద్యాల జిల్లా బుగ్గానిపల్లెలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన





విజయనగరం జిల్లా సంతపేటలో లబ్ధి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



తూర్పుగోదావరి జిల్లా రాజంపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

క్లుప్తంగా

14న అనకాపల్లి 'రెస్కో'పై బహిరంగ విచారణ



అనకాపల్లి రెస్కో కార్యాలయం

సాక్షి, అమరావతి: అనకాపల్లి రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ సొసైటీ (రెస్కో) దరఖాస్తుపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఈ నెల 14న బహిరంగ విచారణ చేపట్టనుంది. విద్యుత్ పంపిణీ, సరఫరా కార్యకలాపాలను 2022–23 సంవత్సరానికి యథావిధిగా నిర్వహించుకోవడం కోసం లైసెన్స్ పొందడం నుంచి మినహాయింపునివ్వాల్సిందిగా ఏపీఈఆర్సీకు కొంతకాలం కిందట రెస్కో దరఖాస్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ మేరకు సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని మండలి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించాలని ప్రజలు, వివిధ సంస్థలను ఏపీఈఆర్సీ కోరింది.

'ఎయిడెడ్', లైబ్రరీ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు

62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం గెజిట్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో.. ఎయిడెడ్ స్కూళ్ల బోధన, బోధనేతర సిబ్బంది, రాష్ట్ర గ్రంథాలయ సంస్థల ఉద్యోగులకు కూడా దాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం బుధవారం గెజిట్ జారీ చేసింది. ఈ నిర్ణయంపై ఎమ్మెల్సీ కల్పలతతో పాటు గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.మధుసూదనరాజు, ప్రధాన కార్యదర్శి పి.ఉగ్రసేను హర్షం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. పలు ఎయిడెడ్ పాఠశాలల్లో సిబ్బంది సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గెజిట్‌కు అనుగుణంగా పాఠశాల విద్యా శాఖ వెంటనే ప్రొసీడింగ్స్ విడుదల చేయాలని టీచర్స్ గిల్డ్ కోరింది.

సచివాలయాల్లో ఆధార్ సేవలకు తాత్కాలికంగా బ్రేక్

- సాఫ్ట్‌వేర్ సమస్యతో సేవలకు అంతరాయం
- ఐదు రోజుల్లో పరిష్కారమయ్యే అవకాశం

సాక్షి, అమరావతి: గ్రామ వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలను సాంకేతిక కారణాల నేపథ్యంలో గురువారం నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు గ్రామ వార్డు సచివాలయాల శాఖ అధికార వర్గాలు తెలిపాయి. సాఫ్ట్‌వేర్ సంబంధిత సాంకేతిక పరమైన అంశాలను సరిదిద్దాక తిరిగి ఆయా సచివాలయాల్లో ఈ ఆధార్ సేవలు ప్రారంభమయ్యేందుకు కనీసం ఐదు రోజులు పట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి దాకా ప్రత్యేకంగా ఆధార్ సేవలు అందుబాటులో లేని ప్రాంతాలను ఎంపిక చేసుకుని ప్రభుత్వం మొదటి దశలో దాదాపు 1400 గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఆయా సచివాలయాల ఆధ్వర్యంలో ప్రతి నెలా ఆయా ప్రాంత ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు కూడా నిర్వహిస్తోంది. కాగా, ప్రస్తుతం ఆయా గ్రామ సచివాలయాలకు సరఫరా చేసిన ఆధార్ కిట్ల అప్‌డేట్‌కు సంబంధించి ఆధార్ జారీ సంస్థ నుంచి తగిన సూచనలు వచ్చాక.. సచివాలయాల్లో ఆధార్ సర్వీసులను తిరిగి ప్రారంభించాలంటూ సంబంధిత గ్రామ సచివాలయ సిబ్బందికి బుధవారం రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయ శాఖ ఆదేశాలిచ్చింది.

జేసీ బ్రదర్స్‌కు ఈడీ షాక్

రూ.22.10 కోట్ల విలువైన ఆస్తుల జప్తు

- బీఎస్ 3 వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్, అమ్మకాల కేసు దర్యాప్తులో ఈడీ దూకుడు
- అశోక్ లేలాండ్ నుంచి తుక్కు కింద 154 బీఎస్ 3 వాహనాలు కొనుగోలు
- ఫోర్జరీ పత్రాలతో బీఎస్ 4 వాహనాలుగా అక్రమ రిజిస్ట్రేషన్
- పోలీసు అధికారుల సంతకాలూ ఫోర్జరీ చేసి ఎన్‌వోసీలు
- బీమా పత్రాలూ నకిలీవే
- ఫోర్జరీ పత్రాలతో కొన్ని వాహనాల విక్రయం
- బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు
- 2020లో జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డితో పాటు 23 మందిపై 35 కేసులు నమోదు
- రాష్ట్ర రవాణా శాఖ అధికారుల వినతి మేరకు రంగంలోకి ఈడీ
- జేసీ బ్రదర్స్, భాగస్వాముల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు

సాక్షి, అమరావతి: టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్‌రెడ్డి కుటుంబానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. బీఎస్ 3 వాహనాలను బీఎస్4 వాహనాలుగా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన కేసులో జేసీ బ్రదర్స్‌కు చెందిన రూ.22.10 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. జేసీ దివాకర్‌రెడ్డి సోదరుడు జేసీ ప్రభాకర్‌రెడ్డికి చెందిన దివాకర్ రోడ్ లైన్స్, జటాధర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఆయన వ్యాపార భాగస్వామి సి.గోపాల్‌రెడ్డి కుటుంబానికి చెందిన సి.గోపాల్‌రెడ్డి అండ్ కంపెనీ ఆస్తులను జప్తు చేసినట్టు ఈడీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. రూ.6.31 కోట్ల నగదు, బ్యాంకులో మరికొంత నగదు, బంగారు ఆభరణాలతోపాటు రూ.15.79 కోట్ల విలువైన స్థిరాస్తులను జప్తు చేసింది.


ఈడీ తెలిపిన వివరాల ప్రకారం.. టీడీపీ సీనియర్ నేతలు జేసీ దివాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి కుటుంబాలు సుప్రీం కోర్టు తీర్పును కూడా పట్టించుకోకుండా దర్జాగా అక్రమ దందాకు పాల్పడ్డాయి. బీఎస్ 3 వాహనాలను సుప్రీం కోర్టు నిషేధించింది. అయినా జేసీ కుటుంబం అశోక్ లేలాండ్ కంపెనీకి చెందిన 154 బీఎస్ 3 మోడల్ బస్సులు, లారీలను తుక్కు పేరుతో కొన్నది. జటాధర ఇండస్ట్రీస్ పేరున 50 వాహనాలు, సి.గోపాల్ రెడ్డి అండ్ కో పేరున 104 వాహనాలను కొన్నారు. నిబంధనల ప్రకారం బీఎస్ 3 వాహనాలను రిజిస్ట్రేషన్ చేయరు. దాంతో ఫోర్జరీ పత్రాలు సృష్టించి, వాటిని బీఎస్ 4 వాహనాలుగా ఆ పత్రాల్లో పేర్కొన్నారు. అనంతరం ఫోర్జరీ పత్రాలతో నాగాలాండ్ రాజధాని కోహిమాలో రిజిస్ట్రేషన్ చేయించి, ఎన్‌వోసీ పొందారు. ఆ తర్వాత 15 రోజుల్లోనే ఆ బస్సులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్‌లలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆంధ్రప్రదేశ్‌లో 101 వాహనాలు, తెలంగాణలో 33, కర్ణాటకలో 15, తమిళనాడులో ఒకటి, ఛత్తీస్‌గఢ్‌లో ఒక బస్సు సర్వీసులు నిర్వహిస్తున్నారు. మరో మూడు వాహనాలు ఎక్కడ ఉన్నాయన్నది తెలియలేదు. ఆ వాహనాల లైసెన్సులకు కూడా ఫోర్జరీ పత్రాలు సమర్పించారు. అంతేకాదు ఆ వాహనాల్లో కొన్నింటిని అక్రమంగా ఇతర రాష్ట్రాల్లోని వారికి విక్రయించారు. అలా విక్రయించాలంటే పోలీసుల నుంచి ఎన్‌వోసీ పొందాలి. కానీ స్థానిక పోలీసు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి ఎన్‌వోసీలు సృష్టించి మరీ అమ్మేశారు. వాటిని కొన్న వారు తాము మోసపోయామని గుర్తించి అనంతపురంలోని రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారించిన అనంతపురం డిప్యూటీ రవాణా శాఖ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు 2020 జూన్‌లో జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్ రెడ్డితో పాటు 23 మందిపై వివిధ సెక్షన్ల కింద 35 కేసులు నమోదు చేశారు. ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డిలను అరెస్టు చేశారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదల అయ్యారు. వాహనాల బీమాలోనూ ఫోర్జరీకి పాల్పడ్డట్టు దర్యాప్తులో వెల్లడైంది. సమగ్ర సమాచారం కోసం పోలీసులు 'నేషనల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎన్‌ఐసీ)' రికార్డులను పరిశీలించగా, బీమా పత్రాలన్నీ నకిలీవని వెల్లడైంది. జేసీ కుటుంబం అక్రమాలపై ప్రత్యేకంగా దర్యాప్తు జరపాలని సూచిస్తూ రాష్ట్ర రవాణా శాఖ కేంద్రానికి లేఖ రాసింది. కేంద్రం కూడా ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించింది. సమగ్ర దర్యాప్తు కోసం ఈడీని రంగంలోకి దింపింది. కొన్ని నెలల క్రితం ఈడీ అధికారులు అనంతపురం రవాణా శాఖ అధికారుల నుంచి ఆధారాలు, కీలక పత్రాలను తీసుకున్నారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్ రెడ్డి, సి.గోపాల్ రెడ్డి నివాసాలు, కార్యాలయాల్లో, అనంతపురం జిల్లా తాడిపత్రితోపాటు హైదరాబాద్, బెంగళూరు తదితర చోట్ల దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మరిన్ని కీలక ఆధారాలు సేకరించినట్టు సమాచారం. ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్ రెడ్డి ఫోన్‌లను కూడా జప్తు చేశారు. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు, ఫోర్జరీ ఎన్‌వోసీలతో వాహనాల కొనుగోలు, అమ్మకాల వెనుక భారీగా నల్లధనం చేతులు మారినట్టు ఈడీ అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. మనీ లాండరింగ్ చట్టాలను ఉల్లంఘించిన కేసులో జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్ రెడ్డిలను ఈడీ అధికారులు హైదరాబాద్‌లో ఇటీవల విచారించారు. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేసిన ఈడీ అధికారులు జేసీ బ్రదర్స్ కుటుంబానికి చెందిన రూ.22.10కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

అశోక్ లేలాండ్‌లో కొందరి పాత్రపైనా ఈడీ ఆరా

బీఎస్ 3 వాహనాలను బీఎస్ 4 వాహనాలుగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేయడం వెనుక అశోక్ లేలాండ్ కంపెనీ పాత్ర ఉండొచ్చని ఈడీ భావిస్తోంది. ఆ కంపెనీకి చెందిన కొందరి సహకారంతోనే ఈ దందా సాగించినట్టు ప్రాథమికంగా గుర్తించింది. దాంతో అశోక్ లేలాండ్ కంపెనీ ప్రతినిధులను కూడా విచారించాలని ఈడీ నిర్ణయించింది.

సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన జవహర్‌రెడ్డి

- డాక్టర్ సమీర్ శర్మ నుంచి బాధ్యతల స్వీకారం
- ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం చివరి వ్యక్తి వరకు చేరేలా కృషి
- సీఎస్‌గా అవకాశం కల్పించిన సీఎంకు ధన్యవాదాలు



బాధ్యతలు స్వీకరిస్తున్న జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన డా. సమీర్ శర్మ పదవీ కాలం బుధవారం ముగిసింది. ఆయన స్థానంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా డా. జవహర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. బుధవారం సచివాలయం మొదటి బ్లాకు సీఎస్ చాంబర్‌లో పదవీ విరమణ చేస్తున్న సమీర్ శర్మ నుంచి జవహర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తనకు సీఎస్‌గా పనిచేసే అవకాశం కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్థాయి వరకు తీసుకువెళ్లి చివరి వ్యక్తి వరకూ అందేలా అధికార యంత్రాంగాన్ని ముందుకు నడిపిస్తానని ఆయన చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింత పటిష్టంగా అమలయ్యేలా కృషి చేస్తానన్నారు. అంతకు ముందు విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఈవో ఆధ్వర్యంలో వేదపండితుల ఆశీర్వచనాల మధ్య జవహర్ రెడ్డి సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. భద్రాచలం రామాలయం వేద పండితులు కూడా వేద ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె.ప్రవీణ్ కుమార్, కరికల వలవన్, బి.రాజశేఖర్, ఎస్.ఎస్.రావత్, జి.సాయిప్రసాద్, ముఖ్య కార్యదర్శులు ఎం.టి.కృష్ణబాబు, సీఈవో ముఖేష్ కుమార్ మీనా, ముత్యాలరాజు, ఎం.రవిచంద్రతో పాటు పలువురు కార్యదర్శులు, ఉన్నతాధికారుల పాల్గొన్నారు. నూతన సీఎస్ జవహర్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సబ్ కలెక్టర్ నుంచి సీఎస్‌గా

1990 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో పట్టభద్రులు. గ్రాడ్యుయేషన్‌స్థాయిలో వర్సిటీ టాపర్‌గా నిలిచారు. ఆరు బంగారు పతకాలను సాధించారు. అనంతరం ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. 1992–94 మధ్య నరసాపురం సబ్ కలెక్టర్‌గా, 1994–96 మధ్య భద్రాచలం ఐటీడీఏ పీవోగా, 1996–98 మధ్య నల్గొండ జేసీగా పనిచేశారు. 1998–99 మధ్య హైదరాబాద్‌లో ప్రాథమిక విద్య స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, 1999–2002 మధ్య శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా, 2002–05 మధ్య తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా, 2005–2008 మధ్య హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సరఫరా, సీవరేజ్ బోర్డు ఎండిగా పనిచేశారు. 2008–09 మధ్య హైదరాబాద్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా, 2009–2014 మధ్య సీఎంవో కార్యదర్శిగా పనిచేశారు. 2014–2019 మధ్య పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, 2019–20లో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. 2020–21 మధ్య టీటీడీ ఎగ్జిక్యూటివ్ అధికారిగా పనిచేశారు. ఆ తరువాత ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.

సీఎస్‌గా సమీర్‌శర్మ సేవలు అభినందనీయం



సమీర్‌శర్మకు వీడ్కోలు, జవహర్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు నిర్వహించిన సమావేశంలో అధికారులు

- ఉద్యోగులందరికీ ఆదర్శనీయం
- సమీర్ శర్మకు వీడ్కోలు, నూతన సీఎస్‌కు స్వాగత సమావేశంలో పలువురి ప్రశంసలు

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా డా.సమీర్‌శర్మ సేవలు అభినందనీయమని నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డితో సహా పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు కొనియాడారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన డా.సమీర్‌శర్మ పదవీ విరమణ, జవహర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ సందర్భంగా బుధవారం సచివాలయం మొదటి బ్లాకు సీఎం సమావేశ మందిరంలో సాధారణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో వీడ్కోలు, స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఎస్ డా.కేఎస్ జవహర్‌రెడ్డితో పాటు పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ సమీర్‌శర్మ వివిధ హోదాల్లో పనిచేసి రాష్ట్రానికి మెరుగైన సేవలందించారని కొనియాడారు. ఆయన ఎక్కువ కాలం పట్టణాభివృద్ధి శాఖలో పనిచేశారని, ఆయనతో పనిచేసే అవకాశం కలిగినందుకు తనకు ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులందరికీ ఆయన మార్గదర్శకునిగా నిలిచారని ప్రశంసించారు.

నా సేవలు నాకు సంతృప్తినిచ్చాయి: సమీర్‌శర్మ

సీఎస్‌గా పదవీ విరమణ చేసిన డా.సమీర్‌శర్మ మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ల పాటు ప్రభుత్వంలో వివిధ హోదాల్లో అందించిన సేవలు తనకు పూర్తి సంతృప్తినిచ్చాయని చెప్పారు. ఇందుకు తనకు సహకరించిన ముఖ్యమంత్రి , తన సహచర ఉన్నతాధికారులు సహా ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత పటిష్టవంతంగా అమలు చేసేందుకు, అధికార యంత్రాంగాన్ని సమర్థంగా ముందుకు తీసుకెళ్లేందుకు డా.జవహర్‌రెడ్డి కృషి చేస్తారని ఆకాంక్షిస్తున్నట్టు డా.సమీర్‌శర్మ చెప్పారు. కార్యక్రమంలో సీసీఎల్ఏ జి.సాయిప్రసాద్, రహదారులు–భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, సెర్ప్ సీఈవో ఇంతియాజ్, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయ కుమార్‌తో పాటు సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఏపీ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు ప్రసంగించారు. అనంతరం డా.సమీర్‌శర్మను సీఎస్ డా.కేఎస్ జవహర్‌రెడ్డి సత్కరించగా, నూతన సీఎస్ జవహర్‌రెడ్డిని సమీర్‌శర్మ సన్మానించారు.

మళ్లీ అదే పాలన అందిస్తానని చెప్పే దమ్ము లేదు

- చంద్రబాబుపై అంబటి ధ్వజం
- సీఎం జగన్ పథకాలను కొనసాగిస్తానని అంటున్నావు
- దానర్థం జగన్ పథకాలన్నీ అద్భుతమైనవి, ప్రజలు మెచ్చినవనేగా?
- జగన్‌లానే పరిపాలిస్తానని చెప్పినా జనం నిన్ను నమ్మరు
- ఇదేమి ఖర్మ బాబూ నీకు?



సాక్షి, అమరావతి: 'చంద్రబాబూ రాష్ట్రాన్ని 14 ఏళ్లు పరిపాలించావు. మళ్లీ అధికారంలోకి వస్తే అదే తరహా పాలన అందిస్తానని చెప్పే దమ్ము నీకు లేదు. ఇదేం ఖర్మ నీకు' అంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు నిప్పులు చెరిగారు. 'అధికారంలోకి వస్తే వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రద్దు చేస్తానని ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని అంటున్నావు. ఆ పథకాలను కొనసాగిస్తానని అంటున్నావు. దానర్థం సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టినవన్నీ అద్భుతమైన, ప్రజలు మెచ్చిన పథకాలనేగా' అంటూ బాబును ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తరహాలోనే పరిపాలిస్తానని చెప్పినా ప్రజలు బాబుని విశ్వసించరని చెప్పారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సీఎం వైఎస్ జగన్‌ను ఎన్ని కుయుక్తులు పన్నినా ఓడించలేరని స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి అంబటి మీడియాతో మాట్లాడారు. సీఎంగా ఉండగా అనేక మోసాలు చేసిన చంద్రబాబుకు ఏలూరు జిల్లాలో ప్రజలు మరోమారు చుక్కలు చూపించారని చెప్పారు. ప్రజాస్పందన కనిపించకపోయినా, ఎన్నడూ లేని రీతిలో ప్రజలు వచ్చినట్లుగా చెప్పుకునే స్థాయికి దిగజారిపోయారని అన్నారు. టీడీపీ హయాంలో దారుణ హత్యకు గురైన వైఎస్ వివేకా కేసులోనూ భవిష్యత్‌ను వెతుక్కునే నీచానికి బాబు ఒడిగట్టారన్నారు. కేసు విచారణలో నిజాలన్నీ బయటకు వస్తాయని చెప్పారు.

అవన్నీ చెబితే ఉరేసుకుని చస్తావు

'నీ జీవితమంతా నాకు తెలుసు. సంజయ్ గాంధీ వద్ద ఎన్ని బ్రోకర్ పనులు చేశావో తెలుసు. అంజయ్య మంత్రివర్గంలో వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు నువ్వూ ఉన్నావు. రెండెకరాల పేదవైన నువ్వు వైఎస్ వద్ద ఐదు, పది వేలు అప్పు తీసుకున్నదీ తెలుసు. నీ పెళ్లి, కుటుంబం, నీ తమ్ముడు రామ్మూర్తినాయుడు, నీ కొడుకు సంగతి అన్నీ నాకు తెలుసు. నా సంస్కారాన్ని పక్కన పెట్టి ఆ సంగతులు చెబితే ఉరేసుకుని చస్తావు' అంటూ చంద్రబాబుపై మంత్రి అంబటి మండిపడ్డారు.

మొన్న కలెక్టర్.. ఇప్పుడు మునిసిపల్ కమిషనర్

అధికారులపై యూజ్‌లెస్ ఫెలోస్ అంటూ నోరుపారేసుకున్న జేసీ ప్రభాకర్

తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రవర్తన శ్రుతి మించుతోంది. తరచూ అధికారులపై నోరుపారేసుకుంటున్నారు. మొన్న 'స్పందన' కార్యక్రమంలో కలెక్టర్ ఎదుట చిందులు తొక్కిన జేసీ.. తాజాగా తాడిపత్రి మునిసిపల్ కమిషనర్, ఇంజినీర్లను దుర్భాషలాడారు. నవంబరు 25న ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రికి తాగు నీటిని అందించేందుకు పెన్నా నదిలో ఉన్న బోర్లకు మోటార్ల బిగింపు, పైపులైన్ల మరమ్మతులు వంటి పనులు సొంత ఖర్చుతో చేపడుతున్నానంటూ నానా హంగామా చేశారు. ఈ క్రమంలోనే మునిసిపల్ కమిషనర్, ఇంజినీర్లు 'యూజ్‌లెస్ ఫెలోస్' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను వాడు, వీడు అని సంబోధిస్తూ వీరికి బిల్లులు చేయడం చేతకాదంటూ నిందించారు. నిత్యం ఎమ్మెల్యే ఇంట్లో పడి వుంటారంటూ కించపరిచారు. దీనికితోడు మూడు రోజుల క్రితం టీడీపీ కౌన్సిలర్లతో మునిసిపల్ అధికారులపై అసత్య ఆరోపణలు చేయించారు. ప్రభాకర్ రెడ్డి ప్రవర్తనపై పలువురు మండిపడుతున్నారు.

ఇళ్లు లేని పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

- ఇళ్ల మంజూరు ప్రజాసంక్షేమ కార్యక్రమమే
- రాజధాని రైతులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చట్టంలో ఎక్కడా లేదు
- రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటే అభ్యంతరం చెబుతున్నారు
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ, సీఆర్‌డీఏ న్యాయవాది
- తదుపరి విచారణ 5కి వాయిదా

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ పేదలకు సరైన ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు దృష్టికి తెచ్చింది. అటువంటి వారిని ఆదుకోవాలన్నదే తమ కృతనిశ్చయమని నివేదించింది. నిరుపేదలకు, ఇల్లు లేనివారికి ఓ గూడు కల్పించాలన్న ఉద్దేశంతోనే రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపింది. అందులో భాగంగానే చట్ట సవరణ ద్వారా ఆర్–5 జోన్‌ను సృష్టించామని వివరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి బుధవారం న్యాయస్థానానికి నివేదించారు. పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు ప్రజా సంక్షేమ కార్యక్రమమే తప్ప లాభాపేక్షతో చేస్తున్నది కాదన్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకే మొదటి ప్రాధాన్యతనివ్వాలని సీఆర్‌డీఏ చట్టంలో ఎక్కడా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. అలాగే రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు అన్ని వసతులతో అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చాకే ఇతరులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న నిబంధన ఏదీ చట్టంలో లేదన్నారు. సీఆర్‌డీఏ చట్టం తెచ్చినప్పుడే పేదలకు 5 శాతం భూమిని కేటాయించాల్సిందని తెలిపారు. ఇప్పటికే ఆలస్యంకావడంతో.. మరింత జాప్యానికి తావు లేకుండా కొత్తచట్టాన్ని తెచ్చామన్నారు. రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాలకు చెందిన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం పాపమన్నట్లు రాజధాని రైతులు వ్యవహరిస్తున్నారని, కొత్తచట్టాన్ని అడ్డుకునేందుకు ఈ వ్యాజ్యాలు దాఖలు చేశారని వివరించారు.

రాజధాని ప్రాంత రైతులు ప్రభుత్వాన్ని శాసించలేరు..

సీఆర్‌డీఏ తరఫు న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చట్టంలో పలు అవసరాల కోసం నిర్దిష్ట శాతం భూమిని రిజర్వ్ చేశారన్నారు. ఇలా ఇతర అవసరాలకు భూమిని రిజర్వ్ చేయడంపై అభ్యంతరం చెప్పని రైతులు.. ఇతర ప్రాంతాల పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే మాత్రం అభ్యంతరం చెబుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. భూములిచ్చిన రైతులను ప్రత్యేకంగా చూడాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. భూములిచ్చినంత మాత్రాన రాజధాని విషయంలో ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని సవాల్ చేస్తామంటే కుదరదన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో రైతులకు ప్లాట్లు కేటాయించామని, అందులో పలువురు అమ్ముకోవడం కూడా జరిగిందన్నారు. అలాంటప్పుడు తమకు ప్లాట్లు కేటాయించలేదని వారెలా చెబుతారని ప్రశ్నించారు. రైతులు ప్రభుత్వాన్ని శాసించలేరని తెలిపారు. సీఆర్‌డీఏ చట్టం కేవలం రాజధాని ప్రాంతానికే పరిమితం కాదన్నారు. ప్రభుత్వం, సీఆర్‌డీఏ వాదనలు విన్న హైకోర్టు పిటిషనర్ల తరఫు న్యాయవాదుల సమాధానం కోసం తదుపరి విచారణను డిసెంబర్ 5కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావుల ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని రైతులకు కేటాయించిన ప్లాట్ల వివరాలను తమ ముందుంచితే వాటిని పరిశీలించి ఈ వ్యవహారాన్ని తేల్చేస్తామని ధర్మాసనం పేర్కొంది.

ఇళ్ల స్థలాల కేటాయింపుపై అమరావతి రైతుల పిటిషన్లు..

రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేసే నిమిత్తం సీఆర్‌డీఏ చట్టానికి సవరణలు చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని, గెజిట్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో అమరావతి రైతు సంఘాలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఇళ్ల స్థలాలను కేటాయించకుండా అధికారులను నియంత్రించడంతోపాటు భూముల విషయంలో యథాతథ స్థితి కొనసాగించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని అనుబంధ పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ అనుబంధ వ్యాజ్యాలపై ధర్మాసనం మరోసారి విచారించింది.

మాస్టర్ ప్లాన్‌తో రైతులకు సంబంధం లేదు..

కేంద్రం.. పీఎంఏవై కింద ఇళ్ల నిర్మాణం కోసం రాజధాని ప్రాంతాన్ని ఎంపికచేసిందని సుధాకర్‌రెడ్డి చెప్పారు. కేంద్రం ఇచ్చే నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని నిధులను చేర్చి పేదలకు ఇళ్లు నిర్మిస్తుందన్నారు. సీఆర్‌డీఏ తరఫున కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సీఆర్‌డీఏ చట్ట పరిధిలో ఏ ప్రాంతాన్నైనా చేర్చవచ్చు లేదా తొలగించవచ్చన్నారు. ఇది కేవలం అమరావతి రైతులకు మాత్రమే ఉద్దేశించిన చట్టం కాదన్నారు. రైతులకు మాస్టర్ ప్లాన్‌తో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. వారు ప్లాట్ల విషయంలో ఒప్పందానికి కట్టుబడి ఉండాలన్నారు.

త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ చేయండి..

విచారణ ప్రారంభం కాగానే ప్రభుత్వం తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని కోరుతున్నారన్నారు. ఇదే అంశంపై ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ముందు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అందువల్ల ఈ వ్యాజ్యాలను కూడా త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ చేయాలని కోరారు. దీనివల్ల త్రిసభ్య, ద్విసభ్య ధర్మాసనాలు ఒకే అంశంపై వేర్వేరు తీర్పులిచ్చే పరిస్థితిని నివారించినట్లవుతుందన్నారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా ఓ మెమో కూడా దాఖలు చేశామన్నారు. దీనిపై పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు స్పందిస్తూ.. త్రిసభ్య ధర్మాసనం ముందున్న వ్యాజ్యాలకు ఈ వ్యాజ్యాలకు సంబంధం లేదన్నారు. దీంతో సుధాకర్‌రెడ్డి రెండు వ్యాజ్యాల్లో అభ్యర్థనలను చదివి వినిపించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఈ విషయాన్ని తాము పరిగణనలోకి తీసుకుంటామని.. విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

ఆ కోర్సులకు అనుమతి ఉండాల్సిందే: యూజీసీ

సాక్షి, అమరావతి: విద్యార్థులకు ఆన్‌లైన్, దూరవిద్య ప్రోగ్రామ్‌లను అందించడం కోసం వర్సిటీలు ముందుగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) అనుమతి తీసుకోవలసిందేనని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. యూజీసీ అనుమతితో వర్సిటీలు ఆన్‌లైన్ కోర్సులను, దూరవిద్య విధానంలో ప్రోగ్రామ్‌లను అందించవచ్చని పేర్కొంది. ఆయా కోర్సులు, ప్రోగ్రామ్‌లను ఏ పేరుతో పిలిచినా యూజీసీ నిబంధనలను పాటించాలని స్పష్టం చేసింది. 'వర్సిటీలు కమిషన్ ఆమోదంతో, నిబంధనల ప్రకారం షరతులను పూర్తిచేస్తూ ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులను అందించవచ్చు. అవి యూజీసీ నోటిఫై చేసిన ఓపెన్, దూరవిద్య మోడ్ నిబంధనల మేరకు అమలు కావాలి' అని పేర్కొంది.



ఆధునిక జీవితం అసంతృప్తికరంగా మారుతోంది.
చాలా విషయాలు, చాలా కోరికలు ఉంటున్నాయి.
'అవసరాలు' అని పిలవబడే వీటి నుండి మిమ్మల్ని మీరు విడిపించుకోండి.
– పరమహంస యోగానంద

సాక్షి

గురువారం, డిసెంబర్, 1

చిత్రమా? ప్రచార విచిత్రమా?

ఉరుము లేని పిడుగు! గోవాలో 53వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ) ముగింపు వేడుకల వేదికపై అవార్డ్ జ్యూరీ ఛైర్మన్ – ఇజ్రాయిలీ దర్శకుడు నదవ్ లపిడ్ అందరి ముందూ చేసిన వ్యాఖ్య అలాంటిదే! ఇఫీలోని అంతర్జాతీయ పోటీ విభాగంలో ఇతర దేశాల చిత్రాలతో పాటు భారత్ నుంచి ఒక ఎంట్రీ అయిన 'ది కశ్మీర్ ఫైల్స్' చూసిన ఆయన దాన్ని 'అసభ్య ప్రచార చిత్రం. ఈ ఉత్సవంలో ప్రదర్శనకు తగదు' అన్నారు. ఈ హఠాత్ వ్యాఖ్యలు ఒక వర్గాన్ని హతాశులను చేస్తే, మరో వర్గంలో హర్షం నింపాయి. అతిథిగా పిలిచి, అవార్డుల జ్యూరీ పెత్తనమిస్తే ఇంత మాట అంటారా? కశ్మీర్‌లోని మైనారిటీ హిందువుల బాధల్ని తొలిసారి ఇంతగా తెరపై చూపిస్తే, సినిమా బాలేదనడమేమిటి? ఆస్కార్లు వచ్చిన స్పీల్‌బర్గ్ 'షిండ్లర్స్ లిస్ట్' మాటేమిటి? ఇలా ఎన్నో ప్రశ్నలు చర్చ రేపుతున్నాయి.

1990ల నుంచి ఇప్పటికీ ఆగని కశ్మీరీ పండిట్ల విషాదగాథ కట్టెదుటి నిజం. ఎవరూ కాదనలేని సత్యం. అయితే, ఆ సత్యాన్ని ఏ రకంగా తెరపై చూపారన్నదే వివాదం. ఈ ఏడాది మార్చిలో రిలీజైన ఈ 170 నిమిషాల చిత్రం వాణిజ్య విజయం అందుకుంది. అంతే వివాదాస్పదమూ అయింది. 1990ల కాలఘట్టాన్ని మనసును కదిలించేలా తెరపై చూపారనే ప్రశంసతో పాటు పలు వాస్తవాలను తమకు అనుకూలమైన మేరకే చూపి, మతోద్వేగాన్ని రెచ్చగొట్టారనే విమర్శలూ వెల్లువెత్తాయి. మోదీ, అమిత్ షా తదితర పాలకవర్గ అగ్రనేతలు స్వయంగా ఈ చిత్రాన్ని ప్రశంసించారు. ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ సహా బీజేపీ పాలిత రాష్ట్రాలు, నేతాగణం వినోదపు పన్ను మినహాయింపు నుంచి ఉచితంగా టికెట్ల పంపిణీ దాకా ఈ చిత్రాన్ని పూర్తిగా భుజానికెత్తుకున్నాయి. అలా సహజంగానే ఈ సినిమాకు రాజకీయ రంగు, విభజన – విద్వేషవాదమనే పొంగు వచ్చాయి.

'సెకనుకు 24 ఫ్రేముల చొప్పున చెప్పే సత్యం సినిమా' అన్నారు దర్శక దిగ్గజం గొడార్డ్. కానీ, ఇవాళ విప్లవ వీరుడు అల్లూరి సైతం బ్రిటీషు వారి దగ్గర పనిచేసినట్టు సినిమాటిక్ కల్పనతో ఆస్కార్ గురిగా మన చిత్రాలు బరిలోకి దిగుతున్నప్పుడు సినిమా ఎంత సత్యమనే సందేహం కలుగుతుంది. స్వప్నలోక విహారంగా మారిన నేటి సినిమాలో సైతం కళ్ళెదుటి జీవితానికి కల్పన చేర్చి కదిలించేలా చెబితే చాలు. విలువలెలా ఉన్నా వసూళ్ళవర్షం కురుస్తుంది. అది బాక్సాఫీస్ నిరూపిత సత్యం. వ్యాపారంలో అది ఓకేనేమో కానీ, కళాత్మక విలువలెన్నో చూసి కిరీటం పెట్టాల్సిన అవార్డ్స్‌కు అది పనికొస్తుందా? ఇఫీలో అంతర్జాతీయ చిత్రాలతో పోటీకి మనోళ్ళు దింపిన 'కశ్మీర్ ఫైల్స్'తో సమస్య ఇదే. కశ్మీర్‌పై కన్నీరుపెట్టేవారూ కథనంలో నిజాయతీపై భిన్నాభిప్రాయంతో ఉంటే తప్పు పట్టలేం.

కరోనా తర్వాత రూ. 330 కోట్లు సంపాదించి, ఈ ఏటి మేటి బాలీవుడ్ హిట్‌గా నిలిచిన 'కశ్మీర్ ఫైల్స్' ఇప్పటికీ ప్రకంపనలు సృష్టిస్తోంది. లాల్‌బహదూర్ మరణం మిస్టరీపై 'తాష్కెంట్ ఫైల్స్' తీసి, పెద్దగా ఆకర్షించలేని దర్శక– రచయిత వివేక్ అగ్నిహోత్రి దీనికి మాత్రం సీక్వెల్ తీస్తానని ప్రకటించారు. 'కశ్మీర్ ఫైల్స్' ప్రేరణగా అదే తరహాలో అనేకులు రకరకాల 'ఫైల్స్'తో వెండితెర వ్యాపారం మొదలెట్టారు. ఈ పరిస్థితుల్లో 'ఇఫీ' జ్యూరీ ఛైర్మన్ వ్యాఖ్య దౌత్యపరంగానూ కలకలం రేపింది. ఇజ్రాయిల్ రాయబారి జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. తోటి ఇజ్రాయిలీ వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేశారు. భారత ఆతిథ్యాన్ని దుర్వినియోగం చేసినందుకు క్షమాపణ కోరాలంటూ బహిరంగ లేఖ రాశారు. 'భారత్‌కు వచ్చి వెళ్ళిపోతున్న నీకేం! ఇక్కడే ఉండాల్సినవాళ్ళ పరిస్థితి ఏమి'టంటూ మందలిస్తూనే, మనసులోని భయం బయటపెట్టారు.

నిజానికి, నదవ్‌కు ఇలాంటివి కొత్తేమీకాదు. కాన్, బెర్లిన్ లాంటి ప్రఖ్యాత చిత్రోత్సవాల్లో జ్యూరీ సభ్యుడిగా అనుభవం, ఘాటుగా మాట్లాడతాడనే ముద్ర ఆయనకున్నాయి. ఆ నిష్కర్ష వైఖరి వల్లే ఇఫీకి పిలిచి, జ్యూరీ బాధ్యతలిచ్చారనుకోవచ్చు. అయితే, ప్రపంచంలో అత్యధిక సినిమాలు తీసే దేశంలో, ప్రభుత్వం వారి ప్రతిష్ఠాత్మక చలనచిత్రోత్సవంలో, పాలకపక్ష అండదండలున్న కళాకృషిని విమర్శించడం జీర్ణించుకోవడం కష్టమే. అలాగే, గెల్చిన చిత్రాలను ప్రస్తావించే వేదికపై అవార్డ్ రాని ఎంట్రీపై వ్యాఖ్యలు చేయడమూ విచిత్రమే. అంత మాత్రానికే సినిమాను విమర్శించిన వారందరినీ అర్బన్ నక్సల్స్, దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్న తుకడే గ్యాంగ్ అనేయచ్చా?

నదవ్ పండిట్లకు మద్దతునిస్తూనే, 'హింసాద్వేషాల్ని ప్రేరేపించేలా మసిపూసి మారేడుకాయలా ఆ చిత్రం తీశారు. ఫాసిస్ట్ కోణం ఉంద'ని వివరణనిచ్చారు. ఇది తనొక్కరి అభిప్రాయం కాదనీ, బయట పెదవి విప్పకున్నా సినిమా చూడగానే జ్యూరీ మొత్తం ఇదే అభిప్రాయపడిందనీ తేల్చారు. సిన్మా సహా ఏ కళాకృషీ విమర్శకు అతీతం కాదు. ఆత్మాశ్రయమే అయినా అవార్డ్ నిర్ణేతల పని అదే!

విధాన నిర్ణయాలతో బాధితులకు సాంత్వన చేకూర్చాల్సినవారు అది గాలి కొదిలి, ప్రచార కళతో వెండితెర వెనక దాగుందామనుకుంటేనే దారుణం. గత ఎనిమిదేళ్ళలో పాలకులు ఎందరు పండిట్లకు కశ్మీర్‌లో పునరావాసం కల్పించగలిగారు? మిగిలిన కొద్ది కుటుంబాలు నేటికీ తూటాలకు బలవుతుంటే ఏ మేరకు రక్షణ కల్పించారు? వీటిని వదిలేసి, నిర్దిష్ట రాజకీయ లక్ష్యాలతో తీసిన వ్యాపారాత్మక చిత్రం బాగోగులపై ఎవరో, ఏదో అన్నారని విరుచుకుపడితే ఉపయోగమేంటి? బాధిత కశ్మీరీలకు కావాల్సింది పెదాల మీది ప్రేమ కాదు... పాలకుల చేతల్లో చేవ. సినిమాలు అందుకు ప్రేరేపిస్తే మంచిదే. వెనకుండి నడిపే రాజకీయుల కోసం విద్వేషాలకు ఆజ్యం పోసి, విభజన పెంచితేనే కష్టం. తాజా ఘటనతో 'ఇఫీ' జ్యూరీలను సజాతీయులతో నింపేస్తే మరీ నష్టం!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.అష్టమి ఉ.11.34 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** శతభిషం ఉ.10.50 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** సా.4.56 నుండి 6.27 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.43 వరకు, తదుపరి ప.2.22 నుండి 3.06 వరకు, **అమృత ఘడియలు:** రా.2.08 నుండి 3.34 వరకు.

సూర్యోదయం : 6.17
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

మానవీయ ప్రపంచీకరణ కోసం...

సందర్భం



నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి

జీ–20 దేశాల కూటమి అధ్యక్ష పదవిని నేడు భారత్ చేపడుతోంది. భారత అనుభవాలు అంతర్జాతీయ సమస్యలకు మార్గాలు చూపించగలవు. ఘర్షణ, పోటీ సర్వసాధారణమైన విషయాలుగా మారిపోయిన ప్రపంచంలో... సార్వజనీన మానవ ఏకత్వ భావనను ప్రోత్సహించడంపైనే అధ్యక్ష హోదాలో భారత్ దృష్టి పెడుతుందని నేను బలంగా చెబుతున్నాను. ఈరోజు, మన మనుగడ కోసం పోరాడాల్సిన అవసరం లేదు. నేటి మన యుగంలో యుద్ధం ఒక అవసరం కాదు. ప్రజాస్వామ్య మాతృమూర్తిగా మన ప్రాధాన్యతలు 'ఒకే భూమి' గాయాలు మాన్పేలా, 'ఒకే కుటుంబం'లో సామరస్యాన్ని పెంపొందించేలా, 'ఒకే భవిష్యత్తు'కు ఆశలు కల్పించేలా ఉంటాయి.

నేడు జీ–20 దేశాల కూటమి అధ్యక్ష పదవిని భారత్ చేపడుతోంది. ఇంతవరకు 17 పర్యాయాలు ఈ అధ్యక్ష పదవిని స్వీకరించిన సభ్యదేశాలు అద్భుతమైన ఫలితాలు అందించాయి. సూక్ష్మ ఆర్థిక సుస్థిరతను సాధించడం, అంతర్జాతీయ పన్నుల వ్యవస్థను హేతుబద్ధీకరించడం, దేశాలను రుణభారం నుంచి బయటపడేయడం ఇవి సాధించిన చక్కటి ఫలితాల్లో కొన్ని మాత్రమే. ఈ విజయాల నుంచి మనం ప్రయోజనాలు పొందటమే కాకుండా వాటి ఆధారంగా మరిన్ని విజయాలు సాధిస్తామనడంలో సందేహమే లేదు. భారత్ ఈ పెద్ద భారాన్ని స్వీకరిస్తున్నందున, జీ–20 కూటమిని మరింత ముందుకు తీసుకుని పోగలమా అని నాకు నేనే ప్రశ్నించుకున్నాను. మొత్తం మానవ జాతి ప్రయోజనం పొందడం కోసం మన ప్రాథమిక ఆలోచనా ధోరణిని మనం ఉత్ప్రేరకంగా మార్చుకోగలమా?

అలా మనం మార్చుకోగలమని నేను నమ్ముతున్నాను. మన ఆలోచనా ధోరణులు, మన మనస్తత్వాలు మన చుట్టూ ఉన్న పరిసరాల నుంచే రూపొందుతాయి. మానవ చరిత్ర పొడవునా మానవ జాతి కొరతల్లోనే జీవిస్తూ వచ్చింది. పరిమిత వనరుల కోసం మనం పోరాడాం. ఎందుకంటే ఇతరులకు వాటిని నిరాకరించడం ద్వారానే మన మనుగడ ఆధారపడింది మరి. ఆలోచనలు, సిద్ధాంతాలు, అస్తిత్వాల మధ్య ఘర్షణ, పోటీ సర్వసాధారణమైన విషయాలుగా మారిపోయాయి.

దురదృష్టవశాత్తూ, మనం అదేవిధమైన ప్రయోజన రహితమైన మనస్తత్వంలోనే ఈరోజుకూ కూరుకుపోయి ఉన్నాం. భూభాగాల కోసం లేదా వనరుల కోసం దేశాలు సాగిస్తున్న పోరాటంలో దీన్ని మనం చూస్తున్నాము. అత్యవసరమైన సరకుల సరఫరా కూడా ఆయుధంగా మారిపోతుండటంలో ఈ వ్యర్థ మనస్తత్వాన్ని మనం చూస్తున్నాము. ఈ ప్రపంచంలో కోట్లాదిమంది ప్రజలు వైరస్ దాడి ప్రమాదంలో ఉంటున్నప్పటికీ టీకాలు మాత్రం అతి కొద్ది దేశాలు పోగు చేసుకోవడంలోనూ దీన్ని మనం చూస్తున్నాము.

ఘర్షణ, దురాశ అనేవి మానవ సహజ స్వభావమని కొంతమంది వాదించవచ్చు. ఈ వాదనతో నేను ఏకీభవించను. మానవులు వారసత్వపరంగానే స్వార్థపరులుగా ఉంటున్నట్లయితే, మానవులందరూ ఒకటే అనే ఏకత్వ భావనను అనేక ఆధ్యాత్మిక సంప్రదాయాలు పూర్వం నుంచీ బోధిస్తూ రావడాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి? అలాంటి ఒక సంప్రదాయం భారతదేశంలో ఎంతో ప్రాచుర్యంలో ఉంది. అన్ని సజీవ ప్రాణులు, చివరకు నిర్జీవ వస్తువులు కూడా అయిదు ప్రాథమిక మూలకాలను కలిగి ఉంటున్నాయని ఈ సంప్రదాయం చెబుతోంది. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచతత్వాలే ఆ మూలకాలు. మానవుల శారీరకపరమైన, సామాజికపరమైన, పర్యావరణపరమైన క్షేమం, శ్రేయస్సుకు మనలో, మన మధ్య ఉంటున్న ఈ మూలకాలలోని సామరస్యం అత్యవసరమని ఆ సంప్రదాయం మనకు బోధిస్తోంది.

ఈ సార్వజనీన మానవ ఏకత్వ భావనను ప్రోత్సహించడంపైనే భారత్ చేపడుతున్న జీ–20 కూటమి అధ్యక్ష పదవి దృష్టి పెడుతుందని నేను బలంగా చెబుతున్నాను. కాబట్టి ఇకనుంచి మన నినాదం ఒకటే. 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు'. ఇది నినాదం మాత్రమే కాదు. మానవ పరిసరాలు, పరిస్థితుల్లో ఇటీవల చోటుచేసుకున్న మార్పులను ఇది పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ మార్పులను అభినందించడంలో మనం ఇంతవరకు సామూహికంగానే విఫలమయ్యామని చెప్పక తప్పదు.

ఈరోజు యావత్ ప్రపంచ ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడానికి సరిపోయే ఉత్పత్తులకోసం అవసరమైన సాధనాలను మనం కలిగి ఉన్నాము. ఈరోజు, మన మనుగడ కోసం పోరాడాల్సిన అవసరం లేదు. నేటి మన యుగంలో యుద్ధం ఒక అవసరం కాదు.



నిజంగానే యుద్ధం మన అవసరం కాదు.

ఈరోజు మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లు అయిన వాతావరణ మార్పు, ఉగ్రవాదం, సాంక్రమిక మహమ్మారులు వంటివాటిని మనం పరస్పరం పోరాడకుండానే పరిష్కరించుకోగలము. అయితే కలిసి పనిచేయడం ద్వారానే మనం దీన్ని సాధించగలం. అదృష్టవశాత్తూ, మానవజాతి మొత్తం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించగల సకల సాధనాలను ఈరోజు సాంకేతిక విజ్ఞానం మనకు అందిస్తోంది. నేడు మనం నివసిస్తున్న భారీ స్థాయి వర్చువల్ ప్రపంచాలు డిజిటల్ టెక్నాలజీల భారీ పరిణామాన్ని గొప్పగా ప్రదర్శిస్తున్నాయి.

మానవజాతిలో ఆరింట ఒకవంతు ప్రజలకు ఆశ్రయం ఇస్తున్న భారతదేశం– తన భాషలు, మతాలు, ఆచార సంప్రదాయాలు, విశ్వాసాలతో కూడిన అపారమైన వైవిధ్యంతో ఒక సూక్ష్మ ప్రపంచ రూపాన్ని కలిగి ఉంటోంది. సామూహికంగా నిర్ణయాలు తీసుకునే పురాతన సాంప్రదాయాలతో భారతదేశం నేడు ప్రజాస్వామ్య ప్రాథమిక డీఎన్ఏకి దోహదం చేస్తోంది. ప్రజాస్వామ్య మాతృమూర్తిగా భారత జాతీయ ఏకాభిప్రాయం ఎవరి ఆదేశాలతోనో రూపొందలేదు. కోట్లాది స్వేచ్ఛా వాణుల మేళనంతో ఇదొక సామరస్య శ్రావ్య గీతంగా రూపొందింది.

ఈరోజు, భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉంటోంది. మన పౌర కేంద్రిక పాలనా నమూనా అత్యంత వెనుకబడి ఉన్న పౌరుల సంక్షేమ బాధ్యతను కూడా చేపడుతోంది. అదే సమయంలో మన ప్రతిభా సంపన్నులైన యువత సృజనాత్మక మేధాతత్వాన్ని మరింతగా పెంచి పోషిస్తోంది.

జాతీయ అభివృద్ధిని ప్రభుత్వ పాలనకు సంబంధించిన ఒక ప్రదర్శనగా కాకుండా, పౌరుల నేతృత్వంలోని ప్రజా ఉద్యమంగా మార్చడానికి మనం ప్రయత్నిస్తున్నాం. పారదర్శకంగా, బహిరంగంగా, పరస్పర నిర్వహణీయంగా ఉండే డిజిటల్ పబ్లిక్ ఉత్పత్తులను రూపొందించే దిశగా మనం టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నాం. సామాజిక రక్షణ, ఆర్థిక సమగ్రత, ఎలక్ట్రానిక్ చెల్లింపుల వంటి వివిధ రంగాల్లో ఇవి విప్లవాత్మకమైన పురోగతిని సుసాధ్యం చేశాయి.

ఈ అన్ని కారణాల వల్ల, భారత అనుభవాలు అంతర్జాతీయ సమస్యలకు మార్గాలు చూపించగలవు. జీ–20 అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న కాలంలో భారత అనుభవాలు, నేర్చుకున్న పాఠాలు, నమూనాలను ఇతరులకు, ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న దేశాలకు మార్గదర్శకంగా చూపుతాము.

మన జీ–20 ప్రాధాన్యతలు జీ–20 సభ్య దేశాలతో చర్చలపైనే కాకుండా, దక్షిణార్ధ గోళంలో తమ వాణిని తరచుగా వినిపించ లేకుండా పోతున్న మన తోటి ప్రయాణికులతో సంప్రదింపులు జరిపిన తర్వాతే రూపుదిద్దుకుంటాయి. మన ప్రాధాన్యతలు 'ఒకే భూమి' గాయాలు మాన్పేలా, 'ఒకే కుటుంబం'లో సామరస్యాన్ని పెంపొందించేలా, 'ఒకే భవిష్యత్తు'కు ఆశలు కల్పించేలా ఉంటాయి. మన భూగ్రహ గాయాలను మాన్పడం కోసం, భారతీయ సంప్రదాయం, ధర్మకర్తృత్వం ప్రాతిపదికన నిలకడైన, పర్యావరణ అనుకూల జీవన శైలులను ప్రోత్సహిస్తాము.

మానవ కుటుంబంలో సామరస్యాన్ని ప్రోత్సహించడానికిగానూ, అంతర్జాతీయ ఆహార, ఎరువులు, వైద్య ఉత్పత్తుల సరఫరాను రాజకీయాల నుంచి వేరు చేయవలసి ఉంది. అప్పుడే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మానవీయ సంక్షోభానికి దారితీయకుండా ఉంటాయి. మన సొంత కుటుంబాలకు మల్లే, ఎవరి అవసరాలు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటాయో వాటినే మనం పట్టించుకుని తీరాల్సి ఉంటుంది.

మన భవిష్యత్ తరాల్లో ఆశాభావం నింపడానికి, భారీ ఎత్తున విధ్వంసానికి దారితీసే ఆయుధాల ద్వారా కలుగుతున్న ప్రమాదాలపై అంతర్జాతీయ భద్రతను విస్తరించడం గురించి అత్యత శక్తిమంతమైన దేశాల మధ్య నిజాయితీతో కూడిన సంభాషణను మనం ప్రోత్సహిస్తాము.

భారతదేశ జీ–20 ఎజెండా సమగ్రమైనది, ఆశావహమైనది, కార్యాచరణ స్వభావం కలిగినది, నిశ్చయమైనది. భారత్ జీ–20 అధ్యక్ష పదవిని... స్వస్థత చేకూర్చి, సామరస్యాన్ని, ఆశను రేకెత్తించే అధ్యక్షతగా మల్చడానికి కలిసి కృషి చేద్దాము. మానవులకు ప్రాధాన్యత ఉండే సరికొత్త ప్రపంచీకరణ నమూనాను రూపొందించడం కోసం కలిసి పని చేద్దాం.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎంత నియంత్రణ!



చైనాలోని నిరసన ప్రదర్శనలకు సంబంధించిన వీడియోలు తమ హువాయ్ ఫోన్లలోంచి ఆటోమేటిగ్గా డిలీట్ అవుతున్నాయని చైనా సోషల్ మీడియా యూజర్స్ ఫిర్యాదు చేస్తున్నారు. అది క్లౌడ్ నుంచా, డివైస్ స్థాయిలోనా అన్నది తెలీదు. కానీ మన సైన్స్ ఫిక్షన్ సినిమాలు కూడా ఇలాంటి ప్రపంచాన్ని ఊహించి ఉండవు.

– మెలిస్సా చెన్, సంపాదకురాలు

చావే స్వేచ్ఛా?



'స్వేచ్ఛ' కోసం అమెరికా చెల్లిస్తున్న మూల్యం: పది లక్షల కోవిడ్ మరణాలు+ ఏడాదికి 40,000 తుపాకీ కాల్పుల మరణాలు+ ఒక్క 2021లోనే 1,07,622 'ఫెంటానిల్' మరణాలు. అమెరికా జనం ఇంతకంటే మెరుగైనదానికి అర్హులు. మేము మా ప్రజల జీవితాలను కాపాడుతూ, వారికి మెరుగైన జీవితం ఇవ్వాలనుకుంటున్నాం.

– హువా చున్యింగ్,
చైనా విదేశాంగ ప్రతినిధి

ప్రమాదంలో ప్రాణాలు



తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ముగించి, దేశవ్యాప్త దాడులకు పిలుపునిచ్చింది. పాకిస్తాన్‌లో ఇంగ్లండ్ క్రికెట్ జట్టు దిగిన తర్వాతి రోజు ఇది వెలువడింది. ఇంగ్లండ్ క్రికెటర్లు, ఇతర అతిథులు బహుశా అత్యంత రిస్కులో ఉన్నారు.

– సాజిద్ యూసుఫ్‌షా,
కశ్మీర్ కామెంటేటర్

పరుగెత్తుకొచ్చే పతకాలు



ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ మొదటి మహిళాధ్యక్షురాలయ్యారు 'పయ్యోలీ ఎక్స్‌ప్రెస్' పీటీ ఉష. రానున్న ఒలింపిక్స్‌లో ఆమె విస్తృతానుభవం ఇండియాకు ఎన్నో స్వర్ణపతకాలు తేగలదు. అభినందనలు.

– కమల్ హాసన్, నటుడు

తప్పించుకోవడమే!



టీకా మరణాలకు తమ బాధ్యత లేదని సుప్రీంకోర్టులో చెప్పింది ప్రభుత్వం. 'థ్యాంక్యూ మోదీజీ, ప్రతి టీకా సర్టిఫికెట్ మీద ఫొటో మొదలు మా బాధ్యత ఏమీలేదు' దాకా ప్రయాణం మరీ వేగంగా సాగింది.

– సుప్రియా శ్రీనాతె, కాంగ్రెస్ ప్రతినిధి

ఇన్‌బాక్స్

జీవనశైలి వ్యాధుల నియంత్రణ

మారుతున్న జీవన శైలి అనేక రుగ్మతలకు దారి తీస్తోంది. బీపీ, హైపర్ టెన్షన్, డయాబెటిస్, కార్డియోవాస్క్యులర్ లాంటి అనేక రోగాల బారిన పడుతున్నారు. మితాహారం, కాలానుగుణ ఆహారం, వ్యాయామం ఆరోగ్యానికి కీలకం. ప్రకృతి వైద్యం ద్వారా చాలా ఆరోగ్య సమస్యలకు త్వరిత గతిన ఉపశమనం పొందవచ్చు.

ప్రకృతి వైద్యంలో మంచి నీరు ప్రాణాధారం. విరేచనాల వల్ల మన శరీరం ఎక్కువ నీరు కోల్పోయినప్పుడు ధారాళంగా నీటిని తాగాలి. ఎక్కువ ద్రవాన్ని తాగడం వల్ల జ్వరంతో ఉన్న జబ్బుల నుంచి త్వరిత గతిన ఉపశమనం లభిస్తుంది. విపరీతమైన జ్వరం లేదా వడదెబ్బ తగిలినప్పుడు చల్లటి నీటితో స్నానం చెయ్యడం లేదా తడిగుడ్డతో ఒళ్ళంతా శుభ్రపరచడం మంచిది. ఉప్పు వేసిన నీటిని రోజంతా ఎక్కువ సార్లు తాగాలి. స్త్రీలలో తరచుగా కనిపించే మూత్ర సంబంధమైన అంటు రోగాలు ఎక్కువగా ద్రవాలను తాగడం ద్వారా నయం అవుతాయి.

చీముపట్టిన గాయాలు, గడ్డలు, సెగ్గెడ్డలు వచ్చినపుడు వేడినీటితో కాపడం పెట్టడం మంచిది. దురద, మంట, రసికారే దద్దుర్లు ఉన్నప్పుడు చల్లటి నీటితో కాపడం పెట్టడం మంచిది. తీవ్రంగా కాలిన గాయాలు అయినప్పుడు నీళ్ళతో శుభ్రం చేయకూడదు. అల్పమైన కాలిన గాయాలు అయిన సందర్భాలలో చల్లని నీటిలో ఉంచడం ద్వారా ఉపశమనం లభిస్తుంది. గొంతునొప్పి, టాన్సిల్స్‌కు చీముపట్టడం వంటి సందర్భాలలో గోరువెచ్చటి ఉప్పునీటితో పుక్కిలించడం శ్రేయస్కరం.

మొలలు, ఆసనం లేదా మలద్వారం వద్ద పుండ్లు ఏర్పడినప్పుడు... ఒక తొట్టిలో గోరువెచ్చని నీరు పోసి, అందులో చిటికెడు పొటాషియం పరమాంగనేట్ వేసి అందులో ఆసనం అనేలా కూర్చోవడం వల్ల ఉపశమనం లభిస్తుంది. ఏది ఏమైనప్పటికీ వ్యాధి లక్షణాలనూ, వ్యాధి తీవ్రతనూ ఎప్పటికప్పుడు వైద్య నిపుణుల ద్వారా పరీక్షలు చేయించుకుంటూ వారి సలహా మేరకు చికిత్స పొందడం ఉత్తమం.

– డా।। ఎమ్. అఖిల మిత్ర,
ప్రకృతి వైద్యులు, బుద్ధా నేచర్ క్యూర్ సెంటర్

వెంటాడుతోన్న 'అద్దె' చావు భయం



మల్లెపల్లి లక్ష్మయ్య

భారతదేశంలో మరణానికి ముందు వెనుకల కూడా సనాతనమైన, అమానవీయమైన సాంప్రదాయాలు మనిషిని వెంటాడుతున్నాయి. ఆ సంప్రదాయాల్లో పడి గంజిలో పడ్డ ఈగల్లా బయటకు రాలేక, అందులో పడి చావలేకా... కొట్టుమిట్టాడుతున్నాం. అద్దె ఇంట్లో ఆత్మీయులు, కుటుంబ సభ్యులు మరణిస్తే కనీసం అక్కడ ఉండి కర్మకాండలు నిర్వహించుకోవడానికి వీలులేని దయనీయ సామాజిక వ్యవస్థలో మనం బతుకుతున్నాం. అందుకే అద్దె ఇంట్లో ఉండేవారు అంతిమ దశలో తమకంటూ సొంత గుడిసె అయినా ఉండాలని కోరుకుంటున్నారు. ఇటీవల హైదరా బాద్‌లో ఓ తల్లి తన కుమారుణ్ణి ఊరు చివర చిన్న గుడిసె అయినా పరవాలేదు, సొంత ఇల్లు కట్టమని వేడుకుంది. దీంతో ఆమె కుమారుడు లోన్ తీసుకుని సొంతిల్లు కట్టి తల్లి భయాన్ని పోగొట్టాడు.

కరీంనగర్ పట్టణంలో బస్వరాజు కనకయ్య, భారతమ్మ అనే రజక దంపతులు ఎన్నో ఏళ్ళుగా తమ చేతనైన పనిచేసుకొని బతుకుతున్నారు. వాళ్లకు ఇద్దరు కూతుళ్ళు. పెద్దమ్మాయి స్వప్న దివ్యాంగురాలు. ఒక కాలు పని చేయదు. రెండో అమ్మాయి సరితకు పెళ్ళయ్యింది. నిజానికి బసవయ్యకు పెళ్లయిన ఒక కుమారుడు ఉన్నా అతడు తొమ్మిదేళ్ల క్రితం గుండె పోటుతో చనిపోయాడు. అప్పుడు కూడా అప్పటి అద్దె ఇంటి యజమాని ఇంటికి రానివ్వలేదు. ఇపుడు బసవరాజు కనకయ్య కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడి మరణించాడు. ఆసుపత్రి యాజమాన్యం ఆయన బతికే అవకాశం లేదని, ఇంటికి తీసుకుపోతే బాగుంటుందని చెప్పింది. ఆ స్థితిలో ఉన్న కనకయ్యను ఇంటికి తీసుకుపోతే, ఇంటి యజమానులు రానీయలేదు. గత్యంతరం లేక కరీంనగర్ పట్టణంలోని శ్మశానంలోకి తీసుకెళ్ళారు. ప్రాణం ఉండగానే కనకయ్యను శ్మశానంలోకి తీసుకెళ్ళిన కుటుంబం ఆయన చావుకోసం ఎదురు చూసింది. ఒక రోజు తర్వాత కనకయ్య కన్ను మూశాడు. మరణానంతరం జరగాల్సిన కర్మకాండ అంతా ముగించుకొని మాత్రమే తిరిగిరావాలని ఇంటి యజమాని చెప్పడంతో ఇద్దరు ఆడపిల్లలతో మృతుని భార్య 14 రోజులు శ్మశానంలోనే గడిపింది.

హైదరాబాద్‌లోని అపార్ట్‌మెంట్‌లలో ఎవరైనా అద్దెకు ఉండి, అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే, ఆ కాంపౌండ్ నుంచి శవాన్ని తీసివేయాలి. ఒకవేళ ఆసుపత్రిలో మరణిస్తే అటునుంచి అటే సొంత ఊరికైనా తీసుకెళ్ళాలి. లేదా నేరుగా శ్మశానానికి తీసుకెళ్ళాలి. కొన్ని గ్రామాల్లో మరొక వింత సాంప్రదాయం ఉంది. ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్ళి, చికిత్స పొందుతూ మరణిస్తే, ఆ వ్యక్తి మృతదేహాన్ని రానివ్వని గ్రామాలు కూడా ఉన్నాయి. పది సంవత్సరాల క్రితం మంథని దగ్గర్లోని ఒక ఊరి ప్రజలు ఇట్లాగే ప్రవర్తిస్తే, పోలీసుల సహకారంతో ఆ మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్ళి అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది. దీనికి నేనే ప్రత్యక్ష సాక్షిని. అదేవిధంగా తిరుపతి పట్టణంలో, దాని చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఇటువంటి సంఘటనలు జరిగినట్టు, జరుగుతున్నట్టు పాత్రికేయ మిత్రుల ద్వారా తెలిసింది. విశాఖతో పాటు అనేక చోట్ల ఇంటి అద్దె కోసం వచ్చిన వాళ్ళను కుటుంబంలో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులు ఉంటే ఇంటి యజమానులు ఇల్లు అద్దెకు ఇవ్వడానికి నిరాకరిస్తున్న పరిస్థితి ఉంది.

మనిషికి మరణం తథ్యమనీ, అది ఎప్పుడైనా, ఎవరికైనా రావొచ్చనీ తెలిసి కూడా మనుషులు ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారనేది అర్థం కాని ప్రశ్న. దీనికి గాను నేను ఎవ్వరినీ నిందించడం లేదు. కానీ దీని గురించి ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాను.

ఇటువంటి పరిస్థితులు ఏర్పడడానికి కొందరు పుట్టించిన సాంప్రదాయాలు కారణమవుతున్నాయని భావించక తప్పదు. ఇంట్లో ఒక మరణం జరిగితే, కొందరు పురోహి

కొత్త కోణం



తుడిని సంప్రదిస్తుంటారు. ఇటీవల ఇటువంటి వారి సంఖ్య మరింత పెరిగింది. ఆ పురోహితుడు... వ్యక్తి ఏ ముహూర్తంలో చనిపోయాడో నిర్ణయించి దుర్ముహూర్తమైతే, దానికి శాంతి ఉపాయాలు సూచించి, కొన్నిసార్లు కొన్ని నెలల పాటు మరణించిన ఇంటిని విడిచి పెట్టాలని సూచిస్తున్నారు. దీనిని చూసి ఇంటి యజమానులలో... తమ ఇంట్లో వేరే వాళ్ళ మరణం జరగరాదని, మృత దేహాన్ని ఇక్కడపెట్టరాదనే ఛాందస భావనలు కూడా బాగా పెరుగుతున్నాయి. తమ ఇంట్లో పెళ్లి జరగబోతున్నవారు సొంత బంధువుల అంత్యక్రియలకూ హాజరు కావడానికి ఇష్టపడటం లేదు. ఇట్లా మరణం చుట్టూ అల్లుకున్న ఈ ప్రవర్తన మన సమాజం డొల్లతనాన్ని చూపెడుతున్నది.

నిజానికి మన రచనలలో, ప్రసంగాల్లో మృత దేహాన్ని పార్థివ దేహం అంటారు. అంటే పంచభూతాలతో నిండిన శరీరం జీవం పోవడం వల్ల... వాయువును, అగ్నిని, నీటిని, తన సహజ స్వభావాన్ని కోల్పోయి కేవలం మట్టిగా మిగిలిందని చెబుతారు. మట్టి మట్టిలో కలుస్తుంది. పంచభూతాలతో నిండిన శరీరంలో మట్టి మిగిలినందున ఎంతో పవిత్రమైందిగా చూడాలి. కానీ అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తుండడం వింత సాంప్రదాయంగా భావించొచ్చు. కానీ చావును ఒక భయంకరమైన ఘటనగా చూపించి, దాని చుట్టూ ఒక మూఢనమ్మకాన్ని సృష్టించి, ఆ అంధ విశ్వాసాన్ని సమాజం అంతటా వ్యాప్తి చేస్తున్నారు.

ఇటువంటి మూఢ నమ్మకాలను తొలగించకుండా, సమాజంలో మానవత్వాన్ని నింపలేం. ఈ మూఢ నమ్మకాలను ప్రేరేపిస్తున్న వారే ముందుకు వచ్చి, ఇవి సరైనవి కావని చెప్పాలి. లేదా అవి శాస్త్రీయమైనవైతే వాటిని ఆధారాలను, శాస్త్రాలను బయటపెట్టాలి. ఒకవేళ వాళ్ళు ఆ పని చేయలేకపోతే, మానవత్వమున్న ప్రతి ఒక్కరం దీని మీద ఒక కార్యాచరణకు పూనుకోవాలి. అదే విధంగా ప్రభుత్వం వైపు నుంచి రెంట్ కంట్రోల్ యాక్ట్‌లో కొన్ని మార్పులు చేయాలి. ఇంటి యజమానులు ఇటువంటి అమానవీయ చర్యలకు పాల్పడితే, శిక్షించడానికి వీలుగా ఆ చట్టంలో సవరణలు చేసి, వాళ్ళను శిక్షార్హులుగా చేయాలి. దీని గురించి న్యాయనిపుణులు, ప్రజా ప్రతినిధులు ఆలోచించాలి. మన దేశంలో రోజు రోజుకీ పెరుగుతున్న పట్టణీకరణ, అద్దె ఇండ్ల సమస్యలను పెంచుతున్నది. కావున ఇది కోట్ల మంది సమస్య. రాజకీయ పార్టీలు, సంఘాలు మానవత్వంతో తమ పాత్రను నిర్వ హించాల్సి ఉంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు
మొబైల్: 81063 22077

• ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఏపీ హెచ్‌ఏఏ) ప్రస్తుత కార్యవర్గ కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో ఎన్నిక నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియచేస్తూ ఓ నివేదికను తమ ముందుంచాలని బార్ కౌన్సిల్ కార్యదర్శిని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ అత్యవసరంగా అప్పీల్ దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని న్యాయవాది ఉగ్రనరసింహ చేసిన అభ్యర్థనను ప్రధాన న్యాయమూర్తి (సీజే) ధర్మాసనం తిరస్కరించింది.

ఆనంద నిలయానికి బంగారు తాపడం

• ఫిబ్రవరి 23న ప్రారంభం.. 6 నెలల్లో పూర్తి
• రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం
• పాలక మండలి సమావేశం వివరాలు వెల్లడించిన టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి


మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుమల: శ్రీవారి ఆలయంలోని ఆనంద నిలయం బంగారు తాపడం పనుల కోసం ఫిబ్రవరి 23న బాలాలయ నిర్మాణం ప్రారంభిస్తామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ సమయంలో శ్రీవారి దర్శనం కొనసాగుతుందని చెప్పారు. 1957–58 సంవత్సరంలో అనుసరించిన విధానంలోనే తాపడం జరుగుతుందని, భక్తులు సమర్పించిన బంగారాన్ని వినియోగిస్తామన్నారు. వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన బుధవారం టీటీడీ బోర్డు సమావేశం తిరుమల అన్నమయ్య భవనంలో జరిగింది. అనంతరం సమావేశం వివరాలను సుబ్బారెడ్డి వివరించారు. వాటిలో ముఖ్యమైన అంశాలు..

- హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార ప్రాంతాల్లో మొదటి విడతలో 502 ఆలయాలు నిర్మించాం. రెండో విడతలో శ్రీవాణి ట్రస్టు నిధులతో దశలవారీగా ఆలయాలు నిర్మిస్తాం.
- తిరుపతిలోని మాధవంలో శ్రీవాణి ట్రస్ట్ ఆఫ్‌లైన్ టికెట్లు, గదులు కేటాయిస్తాం.డిసెంబర్ 1 నుంచి శ్రీవారి ఆలయంలో ఉదయం 7.30 నుండి 8 గంటల మధ్య బ్రేక్ దర్శనం ప్రారంభిస్తాం. నెల పాటు ప్రయోగాత్మకంగా చేపట్టి, తగిన నిర్ణయం తీసుకుంటాం.
- జనవరి 2న వైకుంఠ ఏకాదశికి గతంలో అనుసరించిన విధానాన్ని కొనసాగిస్తాం. పది రోజులపాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తాం. ఇందుకోసం రోజుకు 25 వేలు చొప్పున 2.50 లక్షల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తాం. రోజుకు 50 వేల చొప్పున 5 లక్షల సర్వదర్శనం టైం స్లాట్ టోకెన్లు తిరుపతిలో కౌంటర్ల ద్వారా ఇస్తాం. దర్శనం టికెట్ ఉన్నవారినే ఆలయంలో దర్శనానికి అనుమతిస్తాం.
- అలిపిరి వద్ద స్పిరిచ్యువల్ సిటీ నిర్మాణానికి డిజైన్లు ఖరారు చేశాం. త్వరలో మొదటి దశ పనులకు టెండర్లు పిలుస్తాం.
- టీటీడీలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, కార్పొరేషన్ ఉద్యోగుల వేతనాల పెంపుపై అధ్యయనానికి ఈవో ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశాం. వచ్చే బోర్డు సమావేశంలో ప్రతిపాదనలు సమర్పిస్తారు.
- టీటీడీలో రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2022 శ్రీవారి బ్రహ్మోత్సవ బహుమానం చెల్లిస్తాం. 7,000 మంది రెగ్యులర్, 14,000 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 14,000 చొప్పున, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.6,850 చొప్పున చెల్లిస్తాం.
- ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన 12 రకాల ఉత్పత్తులను రాష్ట్ర రైతు సాధికార సంస్థ సహకారంతో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తాం.
- కాగా, 10 రోజుల్లో నూతన సిబ్బంది ద్వారా తిరుమలలో లడ్డూ కౌంటర్లు నిర్వహిస్తామని ఈవో ధర్మారెడ్డి తెలిపారు.

అర్చకుల బాగోగులు చూసే బాధ్యత శారదా పీఠానిదే

• ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి


పీఠపూజ నిర్వహిస్తున్న స్వాత్మానందేంద్ర స్వామీజీ

సింహాచలం/గుంతకల్లు రూరల్/గుత్తి రూరల్: ఆలయాల్లో త్రికరణ శుద్ధితో అర్చకత్వం చేయాలని విశాఖ శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అర్చకులకు సూచించారు. ప్రభుత్వంతో చర్చించి అర్చకుల బాగోగులు చూసుకునే బాధ్యతను శారదా పీఠం భుజాన వేసుకుంటుందని హామీ ఇచ్చారు. స్వధర్మ వాహిని ప్రచార యాత్ర బుధవారం అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి బయలుదేరి తొండపాడు మీదుగా కసాపురం చేరుకుంది. తొండపాడులో మాణిక్య రంగనాథస్వామివారి ఆలయాన్ని ఆయన సందర్శించారు. కసాపురంలో అర్చక ట్రైనింగ్ అకాడమీ నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జన హృదయాల్లో హైందవ చైతన్యాన్ని నింపేందుకే స్వధర్మ వాహిని ప్రచార యాత్ర చేపట్టినట్టు తెలిపారు. యాత్రకు రాయలసీమలో అపూర్వ స్పందన వచ్చిందని తెలిపారు. హైందవ ధర్మం పట్ల చైతన్యం కల్పించడంలో యాత్ర సత్ఫలితాలను ఇస్తోందని తెలియజేశారు. కాగా, నెట్టికంటి ఆంజనేయస్వామికి స్వాత్మానందేంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమంటపంలో చంద్రమౌళీశ్వర సమేత రాజశ్యామలా దేవతా పీఠమూర్తులకు (పీఠపూజ) పూజలు నిర్వహించి భక్తులకు అనుగ్రహ భాషణం గావించారు. అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి, దేవాలయ పరిపాలన సంస్థ డైరెక్టర్ రామచంద్రరావు, బ్రాహ్మణ సంఘం నాయకుడు జ్వాలాపురం శ్రీకాంత్ పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యంలో రూ.600 కోట్లతో మెడికల్ కాలేజీ

• పరిపాలన అనుమతి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
• టీచింగ్ ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ, హాస్టళ్లు, క్వార్టర్ల నిర్మాణం
• కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని వైద్యవిద్య డైరెక్టర్‌కు ఆదేశం

సాక్షి, అమరావతి: జిల్లాల పునర్విభజనలో భాగంగా గిరిజన ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లాను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ జిల్లాలో మెడికల్ కాలేజీ లేకపోవడంతో నూతనంగా ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో వైద్యవిద్య సంచాలకులు పార్వతీపురం మన్యం జిల్లాలో కొత్త మెడికల్ కాలేజీ ఏర్పాటుకు సవివరమైన ప్రాజెక్టు నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. దీంతో ఆ జిల్లాలో రూ.600 కోట్లతో కొత్త మెడికల్ కాలేజీ ఏర్పాటుకు పరిపాలనపరమైన అనుమతిని మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. టీచింగ్ ఆస్పత్రితోపాటు హస్టళ్లు, క్వార్టర్లు, నర్సింగ్ కాలేజీ, అనుబంధ భవనాలతో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. కొత్త మెడికల్ కాలేజీకి పరిపాలన అనుమతి మంజూరు చేసిన నేపథ్యంలో కేంద్రానికి ప్రతిపాదనలు పంపాల్సిందిగా వైద్యవిద్య సంచాలకులను ఆదేశించింది. కేంద్ర ప్రాయోజిత పథకం కింద పార్వతీపురం మన్యం జిల్లాల్లో కొత్త వైద్య కళాశాల నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించడంతో అవి ఆమోదం పొందేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. నాడు–నేడు కింద ప్రస్తుతం ఉన్న మెడికల్ కాలేజీల రూపురేఖలు మార్చడంతోపాటు ఆధునిక వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన వైద్యపరికరాలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాకో మెడికల్ కాలేజీ ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించిన విషయం తెలిసిందే.

ఇక తిరుపతిలోనే శ్రీవాణి దర్శనం టికెట్లు

• మాధవం అతిథిగృహంలో కౌంటర్లు ఏర్పాటు

తిరుపతి అలిపిరి/తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం శ్రీవాణి ట్రస్ట్ ఆఫ్‌లైన్ టికెట్లను బుధవారం నుంచి తిరుపతిలోనే మంజూరు చేస్తున్నారు. మాధవం అతిథిగృహంలో ఏర్పాటు చేసిన ఈ కౌంటర్లను జేఈవో వీరబ్రహ్మం ప్రారంభించారు. జేఈవో మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేలు విరాళం ఇచ్చి.. రూ.500 చెల్లించే భక్తులకు ఇప్పటివరకు తిరుమలలో ఆఫ్‌లైన్ టికెట్లు జారీ చేస్తూ వచ్చామన్నారు. దాతలు ముందు రోజు తిరుమలకు వెళ్లి అవసరమైన పత్రాలు సమర్పించి టికెట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. దాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గుర్తించిన టీటీడీ.. ఇకపై శ్రీవాణి ఆఫ్‌లైన్ టికెట్లను తిరుపతిలోనే జారీ చేసి ఇక్కడే వారికి వసతి గదులు కేటాయించేలా నిర్ణయం తీసుకుందని చెప్పారు. కౌంటర్ల నిర్వహణకు ముందుకొచ్చిన యూనియన్ బ్యాంకు యాజమాన్యానికి జేఈవో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ రాంప్రసాద్, చీఫ్ మేనేజర్లు బ్రహ్మయ్య, నగేష్, వీజీవో మనోహర్, డిప్యూటీ ఈవో పార్వతి, ఈఈ కృష్ణారెడ్డి, ఏఈవో ధనుంజయులు పాల్గొన్నారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 27 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. శ్రీవారి దర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 30 గంటల సమయం పడుతోంది. కాగా, బుధవారం శ్రీవారిని సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం ఏకే జైన్, సినీ గాయకుడు శ్రీరామచంద్ర దర్శించుకున్నారు.

ముత్యాలరాజు వ్యక్తిగత హాజరుకు హైకోర్టు ఆదేశం

• విచారణ డిసెంబర్ 29కి వాయిదా

సాక్షి, అమరావతి: కోర్టు ధిక్కార కేసులో పశ్చిమ గోదావరి జిల్లా అప్పటి కలెక్టర్, ప్రస్తుతం ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు వ్యక్తిగత హాజరుకు హైకోర్టు బుధవారం ఆదేశాలు జారీచేసింది. అప్పటి నిడదవోలు తహసీల్దార్ శాస్త్రి, పంచాయతీరాజ్ సబ్ డివిజనల్ ఆఫీసర్ గంగరాజు కూడా వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. వీరందరిదీ కోర్టు ధిక్కారమేనంటూ ప్రాథమిక అభిప్రాయం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కార కేసును విచారణకు స్వీకరిస్తూ వారికి ఫాం–1 నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెం పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని, స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారంటూ షేక్ సలార్ అనే వ్యక్తి 2020లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారించిన జస్టిస్ దేవానంద్. ఆక్రమణలను తొలగించి పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని అప్పటి జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు తదితరులను ఆదేశించారు. అయితే ఈ ఆదేశాలను అమలు చేయలేదంటూ సిలార్ కోర్టు ధిక్కార వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ బుధవారం మరోసారి విచారించారు. ప్రతివాదులు ముత్యాలరాజు, శాస్త్రి, గంగరాజులకు ఫాం–1 నోటీసులు జారీచేశారు. వ్యక్తిగతంగా కోర్టుముందు హాజరుకావాలని వారిని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

మరింత సమర్థంగా ఇంటింటికీ బియ్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు పౌర సరఫరాల శాఖ చర్యలు చేపడుతోంది. ఇంటింటికీ రేషన్ అందించే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్ (ఎండీయూ వాహనాలు) క్రమం తప్పకుండా లబ్ధిదారుల ప్రాంతాలకు వెళ్లేలా పక్కాగా పర్యవేక్షించనుంది. ఇందులో భాగంగా రూట్ మ్యాపింగ్, జీపీఎస్ ట్రాకింగ్ వంటి సాంకేతిక సేవలను వినియోగించనుంది. ఎండీయూ పరిధిలోని లబ్ధిదారులు తమ ఇళ్ల నుంచి ఎక్కువ దూరం వెళ్లకుండా సమీపంలోకే వాహనం వచ్చేలా అధికారులు ప్రత్యేక పాయింట్లను గుర్తిస్తున్నారు. ఈ కొత్త విధానం ద్వారా ఐదారు ఇళ్లకు ఒకచోట ప్రతి నెలా ఎండీయూలో రేషన్ అందించేలా సాంకేతిక వ్యవస్థతో అనుసంధానం చేస్తారు. వాహనాల్లో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తారు. వీటి ద్వారా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా బియ్యం లబ్ధిదారులకు అందుతుంది. తొలుత పైలెట్ ప్రాజెక్టు కింద ఈ నెలలో మండలానికి ఒక ఎండీయూ పరిధిలో దీనిని అమలు చేస్తారు. జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొనసాగించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రభుత్వ విప్లవాత్మక చర్యలతో పెరిగిన రేషన్ పంపిణీ శాతం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రతి నెలా రేషన్ తీసుకునేవారి శాతం గణనీయంగా పెరిగింది. లబ్ధిదారులకు నాణ్యమైన (సార్టెక్స్) బియ్యం ఇవ్వడంతో పాటు 9,260 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే తీసుకెళ్లి అందించడం మంచి ఫలితాలను ఇస్తోంది. ప్రతి నెలా 1.45 కోట్ల కార్డుదారులకు 2.30 లక్షల టన్నుల బియ్యం అవసరం అవుతుంది. గతంలో నెలకు 80 నుంచి 85 శాతం మాత్రమే రేషన్ పంపిణీ జరిగితే.. ఇప్పుడు 90 శాతానికి చేరుకొంది. మరోవైపు అనివార్య కారణాలతో ఎండీయూ వాహనదారులు ఎవరైనా తప్పుకుంటే వారి స్థానాన్ని భర్తీ చేసేంత వరకు గరిష్ఠంగా మూడు నెలల పాటు ఇన్‌చార్జి ఎండీయూకు (వేరే ఎండీయూ వాహనదారుడు పని చేస్తే) బాధ్యతలు అప్పగిస్తోంది. వీరికి నెలకు రూ.18,000 చొప్పున అదనంగా అందిస్తూ ఎక్కడా రేషన్ పంపిణీలో జాప్యం జరగకుండా చర్యలు చేపడుతోంది. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసిన వెంటనే పీడీఎస్‌లోకి తీసుకురావడంతో సమస్యలు వస్తున్నాయి. కొత్త బియ్యం వండితే అన్నం బాగోలేదని, ముద్దగా అవుతుందనే ఫిర్యాదులున్నాయి. దీనిని అధిగమించేందుకు కస్టమ్ మిల్లింగ్ అనంతరం 2 నుంచి 3 నెలలు బఫర్ గోడౌన్లలో నిల్వ ఉంచిన తర్వాతే పంపిణీ చేసేలా పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

గురజాడ ఆశీర్వచనం పూర్వజన్మసుకృతం

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వేంకట అప్పారావు ఆశీర్వచనం అందుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురజాడ 107వ వర్ధంతిని పురస్కరించుకుని రింగ్‌రోడ్డులోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో బుధవారం గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, కలెక్టర్ ఎ.సూర్యకుమారి చేతుల మీదుగా గురజాడ విశిష్ట పురస్కారం, సత్కారం అందుకున్నారు.

సుప్రీంలో బిల్కిస్ బానో రివ్యూ పిటిషన్

న్యూఢిల్లీ: 2002లో గుజరాత్ అల్లర్ల సమయం లో తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, తన కుటుంబ సభ్యులను హత్య చేసిన 11 మంది దోషుల ముందస్తు నుంచి విడుదలను సవాలు చేస్తూ బాధితురాలు బిల్కిస్ బానో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారు ఆగస్టు 15న విడుదలవడం తెలిసిందే. దీన్ని పునఃసమీక్షించాలని కోరుతూ బానో బుధవారం రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. వారి విడుదల సమాజపు అంతరాత్మను కుదిపివేసిందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుంటామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. దోషుల విడుదలపై గతంలో దాఖలైన పిటిషన్లతో కలిపి విచారించవచ్చా, లేదా పరిశీలిస్తామని పేర్కొంది. గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ చోటుచేసుకున్న ఈ పరిణామం చర్చనీయంగా మారింది.

క్లుప్తంగా...

2035 కల్లా చైనా చేతిలో... 1,500 అణు వార్‌హెడ్స్!

వాషింగ్టన్: అణు పాటవంలో అమెరికాకు దీటుగా నిలవడమే లక్ష్యంగా చైనా 2035కల్లా ఏకంగా 1,500 అణు వార్‌హెడ్లను సమకూర్చుకోనుందని పెంటగాన్ అంచనా వేసింది. ప్రస్తుతం చైనా వద్ద 400కు పైగా అణు వార్‌హెడ్లున్నాయని అభిప్రాయపడింది. అంతేగాక వచ్చే పదేళ్లలో అణ్వస్త్ర బలగాలను ఆధునీకరించి, విస్తృతం చేసుకోవడంపై డ్రాగన్ కంట్రీ దృష్టి పెట్టిందని అమెరికా కాంగ్రెస్‌కు తాజాగా సమర్పించిన వార్షిక నివేదికలో పేర్కొంది. ''ఇందుకోసం ఫ్లుటోనియం ఉత్పత్తిని విపరీతంగా పెంచుకునే ప్రయత్నాల్లో ఉంది. ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లను భారీగా నిర్మించుకుంటోంది. భూ, సముద్ర, గగనతల అణ్వస్త్ర ప్రయోగ వేదికలను వీలైనంతగా పెంచుకోవడంపై విపరీతంగా నిధులు వెచ్చిస్తోంది. 2035కల్లా సైనిక పాటవాన్ని పూర్తిగా ఆధునీకరించడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. దేశీయ, విదేశాంగ విధానాల ద్వారా ప్రపంచ వేదికపై తన బలాన్ని మరింతగా పెంచుకోవడమే చైనా లక్ష్యం. ఇండో పసిఫిక్ సముద్ర జలాల్లో చైనా దూకుడు వెనక కారణమిదే'' అని వివరించింది. పెంటగాన్ నివేదికను చైనా కొట్టిపారేసింది.

అఫ్గాన్ మదరసాలో పేలుళ్లు... 16 మంది దుర్మరణం

కాబుల్: అఫ్గానిస్తాన్‌లోని ఐబక్ నగరంలోని ఒక మదరసాలో బుధవారం సంభవించిన పేలుళ్లలో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 24 మంది గాయాల పాలయ్యారు. ఈ విషయాన్ని స్థానికంగా వైద్యుడు ఒకరు మీడియాకి వెల్లడించారు. తమ ఆస్పత్రికి చికిత్సకి వచ్చిన వారిలో యువతే అత్యధికంగా ఉన్నారని చెప్పారు. అల్ జిహాద్ మదరసాలో పేలుళ్లు జరిగినట్టుగా ప్రావిన్షియల్ అధికారి కూడా ధ్రువీకరించారు. గత ఏడాది ఆగస్టులో తాలిబన్లు అధికారాన్ని స్వాధీనం చేసుకున్నాక యువతీ యువకుల్ని లక్ష్యంగా చేసుకొని దాడులు విపరీతంగా జరుగుతున్నాయి. ఎక్కువ దాడులకు ఇస్లామిక్ స్టేట్ తనదే బాధ్యతని ప్రకటించుకుంది. ఈ సారి దాడుల పని ఎవరిదో ఇంకా తెలియలేదు.

చైనాలో పలుచోట్ల కోవిడ్ ఆంక్షలు ఎత్తివేత

బీజింగ్: చైనాలోని గాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని గాంగ్‌జౌ సిటీ సహా పలు జిల్లాల్లో కోవిడ్–19 ఆంక్షలను ఎత్తివేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆంక్షల పట్ల స్థానికులు కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లోకి వచ్చి పోలీసులతో ఘర్షణకు దిగుతున్నారు. పరిస్థితి నానాటికీ ఉద్రిక్తంగా మారుతుండడంతో దీంతో అధికారులు దిగివచ్చారు. ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. కరోనా వ్యాప్తి అధికంగా ఉన్న జిల్లాల్లో ఆంక్షలు కొనసాగుతాయని తెలిపారు. కరోనా అదుపులోకి వచ్చేదాకా ఆంక్షలు తప్పవని అన్నారు. వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో... విద్యుత్ సవరణ బిల్లు లేనట్లే!

సాక్షి, న్యూఢిల్లీ: విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేట్ సంస్థల ప్రవేశానికి వీలు కల్పించే విద్యుత్ సవరణ బిల్లు శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్ ముందుకు రాకపోవచ్చని తెలుస్తోంది. ఈ బిల్లును 3 నెలల క్రితం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపించారు. కమిటీ తొలి భేటీ గురువారం జరుగనుంది. మరో రెండు భేటీల తర్వాతే బిల్లు పార్లమెంట్ ముందుకు రావచ్చని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

భారత్‌లో అబ్బాయిలకే కేన్సర్ వ్యాధి ఎక్కువ

న్యూఢిల్లీ: భారత్‌లో అమ్మాయిల కంటే అబ్బాయిలే అధికంగా కేన్సర్ బారిన పడుతున్నారని లాన్సెట్ తాజా నివేదిక వెల్లడించింది. సమాజంలో లింగ వివక్షే దీనికి కారణమై ఉండవచ్చునని అభిప్రాయపడింది. దేశంలో జనవరి 1, 2005 నుంచి డిసెంబర్ 31, 2019 మధ్య మూడు కేన్సర్ ఆస్పత్రులతో పాటు ఢిల్లీలోని పాపులేషన్ బేస్డ్ కేన్సర్ రిజిస్ట్రీ (పీబీసీఆర్), మద్రాస్ మెట్రోపాలిటన్ ట్యూమర్ రిజిస్ట్రీల నుంచి రికార్డుల్ని సేకరించి ఈ నివేదిక రూపొందించారు. పీబీసీఆర్‌లో 11 వేలు, ఇతర ఆస్పత్రిల్లోని 22 వేల క్యాన్సర్ రోగుల్లో అబ్బాయిల సంఖ్యే అధికంగా ఉందని ఎయిమ్స్ ప్రొఫెసర్ సమీర్ బక్షీ చెప్పారు.

మళ్లీ తెరపైకి జాంబీ వైరస్!



మాస్కో: ప్రమాదకరమైన జాంబీ వైరస్. రష్యాలో అతి శీతల ప్రాంతమైన సైబీరియాలోని ఓ సరస్సులో 48,500 ఏళ్లుగా మంచు పలకల నడుమ గడ్డకట్టిన స్థితిలో నిద్రాణంగా పడి ఉంది. దాన్ని శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. ఒకరి నుంచి ఇంకొకరికి సోకే లక్షణమున్న ఈ వైరస్ కరోనాను మించిన పెను ఆరోగ్య విపత్తుకు దారి తీయొచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, ఇలాంటి దాదాపు రెండు డజన్ల పురాతన వైరస్‌లను శాస్త్రవేత్తలు ఇటీవలి కాలంలో గుర్తించారు. గ్లోబల్ వార్మింగ్ దెబ్బకు నిత్యం సున్నా కంటే తక్కువ ఉష్ణోగ్రతలుండే ప్రాంతాల్లో కూడా మంచు పలకలు వేగంగా కరిగిపోతుండటం తెలిసిందే. దాంతో ఇంతకాలంగా వాటి కింద నిద్రాణంగా ఉన్న ఇలాంటి ప్రమాదకర వైరస్‌లెన్నో ఒళ్లు విరుచుకుని మానవాళిపైకి వచ్చి పడతాయని వారు హెచ్చరిస్తున్నారు. ఈ శాస్త్రవేత్తల బృందమే 2013లో ఇలాగే 30 వేల ఏళ్ల నాటి వైరస్‌లను వెలుగులోకి తెచ్చింది. ఇప్పుడు తన రికార్డును తానే అధిగమిస్తూ పండోరా వైరస్ ఎడొమాగా పేర్కొనే జాంబీ వైరస్‌ను కనిపెట్టిందని బ్లూంబర్గ్ నివేదిక పేర్కొంది.

మతిమరుపు బాధితులకు 'లెసానెమాబ్'



లండన్: మనుషుల్లో వయసు పెరుగుతున్నకొద్దీ మతిమరుపు (అల్జీమర్స్) తలెత్తడం సహజం. ప్రపంచవ్యాప్తంగా 5 కోట్ల మందికి పైగా దీనితో బాధపడుతున్నారని అంచనా. బ్రిటన్లోని అల్జీమర్స్ రీసెర్చ్ సంస్థ లెసానెమాబ్ పేరుతో నూతన ఔషధాన్ని అభివృద్ధి చేసింది. దీనితో మతిమరుపు పెరుగుదల నెమ్మదిస్తుందని సైంటిస్టులు చెప్పారు. అల్జీమర్స్ చికిత్సలో ఇదొక కీలక మలుపన్నారు. క్లినికల్ ట్రయల్స్‌లో 1,795 మందిపై సంతృప్తికరమైన ఫలితాలు వచ్చినట్లు వెల్లడించారు. వారికి 18 నెలలపాటు చికిత్స అందిస్తే మతిమరుపు పెరుగుదల నాలుగింట మూడొంతులు తగ్గిపోతుందని చెప్పారు. అల్జీమర్స్‌కు ప్రధాన కారణమైన బీటా–అమైలాయిడ్ అనే ప్రొటీన్‌ను ఈ ఔషధం కరిగించేస్తుందని పేర్కొన్నారు. మెరుగైన అల్జీమర్స్ చికిత్సల కోసం ప్రపంచం ఎదురు చూస్తోందని, ఈ దిశగా లెసానెమాబ్ డ్రగ్ ఒక ఉత్తమమైన పరిష్కారం అవుతుందని పరిశోధకుడు ప్రొఫెసర్ జాన్ హార్డీ తెలియజేశారు.

మూడు ముక్కలాట

బీజేపీ, ఆప్, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోటీ ● గుజరాత్ తొలి దశ పోలింగ్ నేడే



అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న గుజరాత్ అసెంబ్లీ తొలి దశ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం జరగనున్న పోలింగ్‌కు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సౌరాష్ట్ర, కచ్, దక్షిణ గుజరాత్ ప్రాంతాల్లోని 19 జిల్లాల్లో 89 స్థానాలకు మొదటి దశలో ఎన్నికలు జరుగుతున్నాయి. త్రిముఖ పోటీ నెలకొన్న ఈ ఎన్నికల్లో అధికార బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ హోరాహోరీగా ప్రచారాన్ని నిర్వహించగా, కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్ద ప్రచారం అంటూ క్షేత్ర స్థాయిలో నాయకులు గడప గడపకు తిరుగుతూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు.

ఎవరి వ్యూహాలు వారివే

27 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవడానికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఎన్నికల్లో బీజేపీని మరోసారి గెలిపించే బాధ్యతను తానే స్వయంగా తీసుకున్నారు. మోదీ ఇమేజ్, అభివృద్ధి, గుజరాత్ ఆత్మగౌరవం అంశాలనే బీజేపీ నమ్ముకుంది. ఎన్నికలకు ముందు మోదీ రూ.29 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టుల్ని ప్రారంభించారు. మొత్తం 43 మంది సిట్టింగ్‌లకు టిక్కెట్‌లు నిరాకరించడంతో పాటు ఎన్నికలకు ముందు సీఎం సహా మొత్తం కేబినెట్‌ను మార్చేసి కొత్త రూపుతో అధికార వ్యతిరేకతను ఎదుర్కోవడానికి బీజేపీ వ్యూహాలు పన్నింది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఉండడంతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోట్‌లో ప్రచారాన్ని నడిపించారు. గత ఎన్నికల్లో సౌరాష్ట్ర, కచ్‌లలో పట్టు సాధించిన స్థానాలపై దృష్టి పెట్టారు. క్షత్రియులు, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం సామాజిక వర్గాల ఓట్లను కొల్లగొట్టడానికి రూపొందించిన ఖామ్ వ్యూహంపైనే ఆశలు పెట్టుకుంది. ఇక చాప కింద నీరులా విస్తరిస్తున్న ఆప్ పట్టణాల్లో బీజేపీ, పల్లెల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకుకి గురిపెట్టింది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగడానికే వ్యూహాలు పన్నుతూ ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రచారాన్ని అంతా తానై నడిపించారు. ఉచిత కరెంట్, ఢిల్లీ మోడల్ పాలన ఆ పార్టీకి కలిసొచ్చే అంశంగా ఉంది.

ఏ ప్రాంతంలో ఎవరి హవా !

2017 ఎన్నికల్లో 89 స్థానాలకు గాను బీజేపీ 48 స్థానాల్లో విజయం సాధిస్తే కాంగ్రెస్ 40 సీట్లలో గెలుపొందింది. ఒక్క స్థానంలో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఈ సారి ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కూడా బలం పుంజుకోవడంతో త్రిముఖ పోటీ నెలకొంది. ఇక ఎస్పీ, బీఎస్పీ, లెఫ్ట్ పార్టీలతో పాటుగా, భారతీయ ట్రైబల్ పార్టీ (బీటీపీ) కూడా పోటీ చేస్తున్నాయి. గత ఎన్నికల్లో సౌరాష్ట్ర, కచ్‌లలో బీజేపీ వెనుకబడి పోయింది. పటీదార్ల ఉద్యమంతో ఈ ప్రాంతంలోని ప్రాబల్యమున్న లెవా పటేళ్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపించారు. ఈ ఐదేళ్లలో మళ్లీ బీజేపీ వైపు మళ్లిపోయారు. ఈ ప్రాంతానికి చెందిన మల్దారీలు అందరూ ఈ సారి ఆప్‌కి అండగా ఉన్నారు. అధికార బీజేపీ ప్రతిపాదించిన పశువుల నియంత్రణ బిల్లును మల్దారీలు తీవ్రగా వ్యతిరేకించారు. ఆప్ పశు సంరక్షణ కోసం రోజుకి రూ.40 ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆ వర్గం ఆప్ వైపే చూస్తోంది. సౌరాష్ట్రలో బీజేపీకి పట్టున్న రాజ్‌కోట్, భావ్‌నగర్ పట్టణ కేంద్రాలపై ఆప్ దృష్టి సారించింది. దక్షిణ గుజరాత్‌లో పటీదార్లతో పాటు మరాఠీలు, ఆదివాసీల ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ ఆరెస్సెస్, క్రిస్టియన్ మిషనరీ సంస్థలు క్రియాశీలకంగా ఉండడం బీజేపీకి, కాంగ్రెస్ కలిసొచ్చే అంశం.

- సాక్షి, నేషనల్ డెస్క్

పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలు 89	
పోటీ పడుతున్న అభ్యర్థులు	788
మహిళా అభ్యర్థులు	70
స్వతంత్ర అభ్యర్థులు	339
ఓటర్ల సంఖ్య	2.39 లక్షలు
పోలింగ్ కేంద్రాలు	14,32

బరిలో 788 మంది

తొలి దశ ఎన్నికల్లో మొత్తం 788 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.బీజేపీ, కాంగ్రెస్ మొత్తం 89 స్థానాల్లో పోటీ పడుతూ ఉంటే, ఆప్ 88 స్థానాల్లో పోటీ చేస్తోంది.. తూర్పు సూరత్ నియోజకవర్గం అభ్యర్థి ఆఖరి నిమిషంలో తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఆప్ 88 స్థానాలకే పరిమితమవాల్సి వచ్చింది. ఆప్ సీఎం అభ్యర్థి ఇసుదాన్ గఢ్వీ ద్వారక జిల్లాలోకి కంభాలియా నుంచి పోటీ పడుతూ ఉంటే ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ ఇటాలియా సూరత్‌లోని కటార్గామ్ నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తొలి దశ పోటీలో ఉన్న ముఖ్యుల్లో క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రవీబా జడేజా జామ్‌నగర్ (ఉత్తరం) నుంచి బరిలో ఉన్నారు.



సూరత్‌లో పోలింగ్ విధులకు బయలుదేరుతున్న సిబ్బంది

నాకు స్వర్గం గ్యారెంటీ

అక్కడ అప్సరసలతో ఆనందిస్తా ● శ్రద్ధను చంపినందుకు పశ్చాత్తాపం లేదు
ముంబైలోనే ముక్కలు చేద్దామనుకున్నా ● ఉరి తీసినా బాధ పడను: అఫ్తాబ్
20 మందికి పైగా అమ్మాయిలను ట్రాప్ చేసినట్టు వెల్లడి



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హత్య కేసు నిందితుడు అఫ్తాబ్ అమీన్ పూనావాలా పాలిగ్రాఫ్ టెస్టులో నివ్వెరపరిచే అంశాలు బయట పెట్టాడు. నమ్మి సహజీవనం చేసిన శ్రద్ధా వాకర్‌ను అత్యంత పాశవికంగా కడతేర్చినందుకు తనకు ఇసుమంతైనా పశ్చాత్తాపం లేదని కుండబద్దలు కొట్టాడు! ''నన్ను ఉరితీసినా బాధ లేదు. ఎందుకంటే నేను స్వర్గానికే వెళ్తా. అక్కడ నన్నంతా ఓ హీరోలా చూస్తారు. అప్సరసలతో ఆనందిస్తా'' అని చెప్పుకొచ్చాడు. ''శ్రద్ధను చంపేటప్పుడు గానీ, శవాన్ని ముక్కలుగా నరుకుతున్నప్పుడు గానీ ఏమాత్రం బాధగా అనిపించలేదు. అసలు ముంబైలో ఉండగానే శ్రద్ధను చంపి ముక్కలు చేయాలని భావించా'' అని వెల్లడించాడు. అంతేకాదు, ''శ్రద్ధతో సహజీవనం చేస్తూనే మరోవైపు 20 మందికి పైగా అమ్మాయిలతో సంబంధం పెట్టుకున్నా! బంబుల్ యాప్ సాయంతో వారిని ట్రాప్ చేసేవాడిని. శ్రద్ధను చంపాక ఓ సైకాలజిస్టును ఫ్లాట్‌కు ఆహ్వానించి ఆమెతో గడిపా. శ్రద్ధ తాలూకు రింగును ఆమెకు గిఫ్ట్‌గా ఇచ్చా'' అని వివరించాడు. ఇవన్నీ విని షాకయ్యామని పోలీసులు చెప్పుకొచ్చారు. విచారణ అనంతరం అతను ఏ చీకూచింతా లేకుండా ఇట్టే నిద్రలోకి జారిపోయేవాడని వివరించారు. పరీక్ష అనంతరం అతని ఫ్లాట్ నుంచి ఐదు కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

రష్యా సైనికులను వారి భార్యలే... రేప్‌లకు ప్రోత్సహిస్తున్నారు!

ఉక్రెయిన్ అధ్యక్షుని భార్య ఆవేదన



కీవ్: ''అమాయక ఉక్రెయిన్ మహిళలపై రష్యా సైనికులు అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ఈ లైంగిక దాడిని కూడా ఓ ఆయుధంగా వాడుతున్నారు. పైగా రష్యా సైనికులను వారి భార్యలే అందుకు ప్రోత్సహిస్తున్నారు'' అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ భార్య ఒలెనా జెలెన్స్కా (44) ఆరోపించారు. లండన్‌లో ఓ అంతర్జాతీయ సదస్సు సందర్భంగా స్కై న్యూస్‌కు ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారు. ''బలహీనులపై ఆధిపత్య ప్రదర్శనకు లైంగిక దాడి అత్యంత క్రూరమూ, ఆటవికమూ అయిన మార్గం. రష్యా సైనికులకు మా దేశ మహిళలపై యథేచ్ఛగా ఈ రకమైన దాడికి పాల్పడుతున్నారు. పైగా దీనిపై బాహాటంగా మాట్లాడుతున్నారు. తమ కుటుంబీకులు, బంధుమిత్రులకు ఫోన్లో గొప్పగా చెప్పుకుంటున్నారు. ఉక్రేనియా ఆడవాళ్లను రేప్ చేయండంటూ వారి భార్యలు కూడా ప్రోత్సహిస్తుండటం నిజంగా సిగ్గుచేటు'' అంటూ మండిపడ్డారు. ''ఈ లైంగిక దాడిని యుద్ధ నేరంగా గుర్తించాలి. బాధ్యులను శిక్షించాలి'' అని డిమాండ్ చేశారు.

మృత్యుఘాతం

గాయాలతో ఏటా 44 లక్షలమంది బలి



న్యూయార్క్: గాయాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా దాదాపు 44 లక్షల మంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. వీరిలో ప్రతి ముగ్గురిలో ఒకరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి, ప్రాణాలు కోల్పోతున్నారని తెలియజేసింది. ఈ మేరకు 'గాయాల నివారణ, సంరక్షణ' 14వ ప్రపంచ సదస్సు సందర్భంగా డబ్ల్యూహెచ్ఓ ఒక నివేదిక విడుదల చేసింది. గాయాలు, హింస వల్ల ప్రపంచవ్యాప్తంగా నిత్యం 12,000 మంది బలైపోతున్నారని నివేదికలో వివరించింది. 5 నుంచి 29 ఏళ్ల వయసున్నవారిలో సంభవిస్తున్న మరణాలకు తొలి 5 కారణాల్లో 3 కారణాలు గాయాలకు సంబంధించినవేనని స్పష్టం చేసింది. జనం మృత్యువాత పడడానికి రోడ్డు ప్రమాదాలు, హత్యలు, ఆత్మహత్యలు, నీటిలో మునిగిపోవడం, అగ్ని ప్రమాదాలు, విషం తీసుకోవడం వంటివి ప్రధానంగా కారణమవుతున్నాయని డబ్ల్యూహెచ్ఓ తేల్చిచెప్పింది. ప్రతి 6 మరణాల్లో ఒకటి ఆత్మహత్య, ప్రతి 9 మరణాల్లో ఒకటి హత్య, ప్రతి 61 మరణాల్లో ఒకటి యుద్ధం, ఘర్షణల వల్ల సంభవిస్తున్నాయని పేర్కొంది. సంపన్నులతో పోలిస్తే పేదలు గాయాల వల్ల చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధానోమ్ గెబ్రీయెసస్ తెలిపారు.



స్పెయిన్‌లోని వెలెన్సియా ఓడరేవులో స్వాధీనం చేసుకున్న 5.6 టన్నుల కొకైన్ ప్యాకెట్లివి. దక్షిణ అమెరికా నుంచి వస్తున్న కంటెయినర్‌లో బయటపడ్డాయి. వీటి విలువ అంతర్జాతీయ మార్కెట్లో ఏకంగా రూ.2,857 కోట్లు!

● భారత్‌లో అక్టోబర్ నెలలో 23.24 లక్షల ఖాతాలను నిషేధించినట్లు సోషల్ మీడియా వేదిక 'వాట్సాప్' యాజమాన్యం తెలియజేసింది. వీటిలో 8.11 కొత్త ఖాతాలు ఉన్నాయని వెల్లడించింది. సెప్టెంబర్‌లో 26.85 లక్షల ఖాతాలపై నిషేధం విధించామని పేర్కొంది. సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్‌లో 13 శాతం తక్కువ ఖాతాలపై వేటు పడిందని తెలిపింది. ఈ మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్–2021 కింద నెలవారీ నివేదికను బుధవారం విడుదల చేసింది.



చూడ్డానికి ప్లాస్టిక్ బల్లిగా కనిపిస్తున్న ఇది అంతరిస్తున్న జీవ జాతుల జాబితాలో ఉన్న టోకే గెక్కో రకం బల్లి. అంతర్జాతీయ మార్కెట్లో ఏకంగా రూ.1.5 కోట్లు పలుకుతుంది! స్మగ్లర్లు దీన్ని పశ్చిమబెంగాల్ అడవుల్లో పట్టుకుని ఢిల్లీ తరలిస్తుండగా బిహార్‌లో పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేశారు.

ప్రపంచంలో బెస్ట్ సిటీ వెలెన్సియా

న్యూయార్క్: మూడు ఖండాల నుంచి మూడు నగరాలు ఇంటర్‌నేషన్స్ సంస్థ తాజా సర్వేలో అత్యుత్తమ సిటీల జాబితాలో నిలిచాయి. ప్రవాసులు నివసించడానికి 2022లో ప్రపంచంలో అత్యుత్తమ నగరాల్లో స్పెయిన్‌లోని వెలెన్సియా టాప్‌లో నిలిచింది. అద్భుతమైన జీవన ప్రమాణాలుంటాయని జీవన వ్యయం భరించే స్థాయిలో ఉంటుందని, ప్రజలు స్నేహపూర్వకంగా ఉంటారని సర్వేలో అత్యధికులు వెలెనికా నగరానికి ఓటు వేశారు. ఆ తర్వాత స్థానంలో దుబాయ్, మూడో స్థానంలో మెక్సికో సిటీ నిలిచాయి. 181 దేశాల్లో నివసిస్తున్న 11,970 మంది ప్రవాసుల అభిప్రాయాలను తెలుసుకొని ఈ జాబితాకు రూపకల్పన చేశారు.



టాప్ 10 నగరాలివే..

1. **వెలెన్సియా (స్పెయిన్):** జీవన ప్రమాణాలు, అల్ప జీవన వ్యయం, మంచి వాతావరణం.
2. **దుబాయ్:** పని చేయడానికి అనుకూలం, ఖాళీ సమయాన్ని ఎంజాయ్ చేయొచ్చు.
3. **మెక్సికో సిటీ:** ఫ్రెండ్లీ నగరం.
4. **లిస్బన్ (పోర్చుగల్):** అద్భుత వాతావరణం.
5. **మాడ్రిడ్ (స్పెయిన్):** సాంస్కృతిక అద్భుతం.
6. **బాంకాక్:** సొంత దేశంలో ఉండే ఫీలింగ్.
7. **బాసిల్ (స్విట్జర్లాండ్):** ఆర్థికం, ఉపాధి, జీవన ప్రమాణాల్లో ప్రవాసుల సంతృప్తి
8. **మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా):** అన్నింటా బెస్ట్.
9. **అబుదాబి:** ఆరోగ్యం రంగట్లో టాప్. ప్రభుత్వోద్యోగుల పనితీరు అద్భుతం.
10. **సింగపూర్:** మంచి కెరీర్.

రోమ్ (ఇటలీ), టోక్యో (జపాన్), మిలన్ (ఇటలీ), హాంబర్గ్ (జర్మనీ), హాంగ్‌కాంగ్ ప్రవాసుల నివాసానికి అనుకూలంగా ఉండవని సర్వే పేర్కొంది.

జియాంగ్ జెమిన్ ఇకలేరు

- అనారోగ్యంతో కన్నుమూసిన చైనా మాజీ అధినేత
- ప్రజలకు తీరని లోటు
- కమ్యూనిస్ట్ పార్టీ ప్రకటన



బీజింగ్: డ్రాగన్ దేశం చైనాలో అధ్యక్షుడిగా ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి, నేడు ప్రత్యక్షంగా కనిపిస్తున్న అభివృద్ధికి బాటలు వేసిన నాయకుడిగా కీర్తి గడించిన జియాంగ్ జెమిన్ బుధవారం మధ్యాహ్నం కన్నుమూశారు. 96 ఏళ్ల జెమిన్ కొంత కాలంగా లుకేమియా, అవయవాల వైఫల్యంతో బాధపడుతున్నారు. గతంలో మేయర్‌గా సేవలందించిన షాంఘై నగరంలోనే ఆయన తుదిశ్వాస విడిచారని చైనా అధికారిక షిన్‌హువా వార్తా సంస్థ వెల్లడించింది. జెమిన్ మృతి దేశ ప్రజలకు తీరని లోటు అని చైనా కమ్యూనిస్ట్ పార్టీ, పార్లమెంట్, సైన్యం పేర్కొన్నాయి. ప్రపంచంలో అమెరికా తర్వాత రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చైనా అవతరించడానికి జెమిన్ దూరదృష్టి, ఆలోచనలు, నిర్ణయాలే కారణం అంటే అతిశయోక్తి కాదు.

నిరంకుశ వైఖరి

1993 మార్చి 27 నుంచి 2003 మార్చి 15 దాకా పదేళ్లపాటు చైనాను పరిపాలించిన జియాంగ్ జెమిన్ చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. మార్కెట్ ఆధారిత సంస్కరణలకు ప్రాధాన్యం ఇచ్చారు. బ్రిటిష్ పాలనలో ఉన్న హాంకాంగ్‌ను 1997లో చైనాలో తిరిగి విలీనం చేశారు. జెమిన్ చొరవతో 2001లో ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ)లో చైనా సభ్యదేశంగా చేరింది. దాంతో విదేశీ పెట్టుబడిదారులు చైనాలో అడుగుపెట్టారు. అభివృద్ధిని కాంక్షించిన జియాంగ్ జెమిన్ పరిపాలనలో నిరంకుశంగా వ్యవహరించారన్న అపవాదు మూటగట్టుకున్నారు. మానవ హక్కుల సంఘాలు, కార్మిక, ప్రజాస్వామ్య అనుకూల సంఘాల నేతలు, కార్యకర్తలపై ఉక్కుపాదం మోపారు. వారిని జైలుపాలు చేశారు. తన అధికారానికి ముప్పుగా మారిందన్న అనుమానంతో 'ఫలూన్ గాంగ్' అనే ఆధ్యాత్మిక ఉద్యమాన్ని నిషేధించారు.

సబ్బుల కంపెనీలో కార్మికుడిగా..

జియాంగ్ జెమిన్ 1926 ఆగస్టు 17న చైనా తూర్పు ప్రాంతంలోని యాంగ్‌జై సిటీలో మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. 1947లో షాంఘైలోని జియాటోంగ్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ మెషినరీ డిపార్టుమెంట్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తొలుత ఫుడ్ ఫ్యాక్టరీలో, తర్వాత సబ్బుల తయారీ పరిశ్రమలో, ఆటోమొబైల్ ప్లాంట్‌లో పనిచేశారు. 1966 నుంచి 1976 దాకా కార్మిక సంఘాల్లో సభ్యుడిగా చురుగ్గా సేవలందించారు. కమ్యూనిస్ట్ పార్టీ అగ్రనాయకుల దృష్టిని ఆకర్షించారు. పార్టీలో ఆయన పరపతి పెరిగిపోయింది. 1985 నుంచి 1989 దాకా షాంఘై మేయర్‌గా పనిచేశారు. తియానన్మెన్ స్క్వేర్‌లో విద్యార్థులపై సైన్యం దాడి తర్వాత 1989లో అధికార కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా ప్రధాన కార్యదర్శిగా జెమిన్ బాధ్యతలు చేపట్టారు. 2002 దాకా ఈ పదవిలో కొనసాగారు. 1989 నుంచి చైనా మిలటరీ కమిషన్ చైర్మన్‌గా కొనసాగిన ఆయన 2004లో ఈ పదవి నుంచి తప్పుకున్నారు. చైనా ప్రస్తుత అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఎదుగుదల వెనుక జియాంగ్ జెమిన్ ప్రోత్సాహం ఎంతో ఉంది.

సాక్షి

విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 1 । డిసెంబర్ । 2022



దుర్గగుడికి విరాళాలు

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బుధవారం భారీగా విరాళాలు అందాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు రూ.8 లక్షలు సమర్పించారు.



నిరంతరం నాణ్యమైన విద్యుత్

పెనమలూరు: రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దన రెడ్డి తెలిపారు. కానూరులో సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే కె.పి.సారథితో కలిసి బుధవారం ప్రారంభించారు.



ఇక బోధనే బాధ్యత

ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇక నుంచి విద్యాబోధనకే పరిమితమవుతున్నారు. బోధనేతర విధుల నుంచి ప్రభుత్వం విముక్తి కలిగించింది. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. -8లో▸

న్యూస్‌రీల్

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల సౌకర్యం కోసం తాత్కాలికంగా పలు రైళ్లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ మూడు నుంచి 31వ తేదీ వరకు సికింద్రాబాద్-దర్భంగా (17007), డిసెంబర్ ఆరు నుంచి జనవరి మూడో తేదీ వరకు దర్భంగా-సికింద్రాబాద్ (17008) రైళ్లకు అదనంగా రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఏర్పాటు చేస్తారు. డిసెంబర్ ఆరు నుంచి 28వ తేదీ వరకు సికింద్రాబాద్-హిసార్ (22737), డిసెంబర్ తొమ్మిది నుంచి జనవరి ఒకటో తేదీ వరకు హిసార్-సికింద్రాబాద్ (22738) రైళ్లకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్ ఏర్పాటుచేస్తారు. డిసెంబర్ రెండు నుంచి 30వ తేదీ వరకు తిరుపతి-విశాఖపట్నం (22708), డిసెంబర్ మూడు నుంచి 31వ తేదీ వరకు విశాఖపట్నం-తిరుపతి (22707) రైళ్లకు ఒక ఏసీ చైర్ కార్ కోచ్ ఏర్పాటు చేసి నడుపుతారు. డిసెంబర్ ఒకటి నుంచి 31వ తేదీ వరకు విజయవాడ-లింగంపల్లి (12795), డిసెంబర్ రెండు నుంచి జనవరి ఒకటో తేదీ వరకు లింగంపల్లి-విజయవాడ (12796), డిసెంబర్ ఒకటి నుంచి 31వ తేదీ వరకు నర్సాపూర్-ధర్మవరం (17247), డిసెంబర్ రెండు నుంచి జనవరి ఒకటో తేదీ వరకు ధర్మవరం-నర్సాపూర్ (17248) రైళ్లకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్ ఏర్పాటు చేస్తారు.

లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): డీజిల్ రేట్లు, టోల్ చార్జీల పెరుగుదల, సరుకు దిగుమతికి తీవ్రజాప్యం వంటి కారణాలతో లారీ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు జిల్లాల నుంచి వచ్చిన లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ ఘటితంగా ఈ సమస్యలను అధిగమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విజయవాడ బెంజి సర్కిల్ సమీపంలోని దీ కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు లారీ యజమానులు మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి వచ్చిన లారీల్లో సరుకు దిగుమతి చేసుకోకుండా కొందరు వ్యాపారులు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ముఠా కార్మికులు దిగుమతికి బస్తాకు ఓ రేటు, టన్నుకు మరో రేటు డిమాండ్ చేస్తున్నారని, కొందరు ఆశీలు కూడా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. డిసెంబర్ 15 నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ మామూళ్లు ఎవరికీ చెల్లించాల్సిన అవసరం లేదని, గుమస్తా రుసుం ఇవ్వొద్దని తీర్మానించారు. దిగుమతికి 24 గంటల సమయం మించితే వెయిటింగ్ చార్జీని సరుకు యజమాని చెల్లించాలని, ఆశీలు వసూలు చేయరాదని పేర్కొంటూ తీర్మానాలు చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్‌నాయుడు, కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణానది రక్షణ గోడ నిర్మాణ టెండర్ ఖరారు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణానది కరకట్ట వెంబడి నిర్మిస్తున్న మూడో దశ రక్షణ గోడ నిర్మాణ పనులకు టెండర్ ఖరారైందని నీటిపారుదల శాఖ ఎస్‌ఈ తిరుమలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరకట్ట ప్రాంత వాసుల కష్టాలు తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు మూడో దశలో రక్షణ గోడ నిర్మిస్తామని వివరించారు. రూ.118.64 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ఈ పనులను మీఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్ దక్కించుకుందని వివరించారు.

అక్రమ అంతస్తులు

- వీఎంసీలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ప్లాన్ ప్రకారం జరగని భవన నిర్మాణ పనులు
- అక్రమాలపై సర్కిల్-2లో ఫిర్యాదుల వెల్లువ
- అధికారుల కనుసన్నల్లోనే సాగుతున్న అక్రమ కట్టడాలు
- గతంలో ఏసీబీ దాడుల్లో చిక్కిన పలువురు అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్-2 పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రాంత పరిధిలో భవన నిర్మాణాలు అడ్డగోలుగా జరుగుతున్నాయి. కార్పొరేషన్ నుంచి తీసుకున్న ప్లానుకు భిన్నంగా పలువురు నిర్మాణాలు చేపట్టారు. ఉదాహరణకు 62వ డివిజన్ పరిధిలో ఒకరు జీ+3 భవన నిర్మాణానికి నగరపాలక సంస్థ నుంచి అనుమతి తీసుకున్నారు. ప్లానులో వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన స్థలాన్ని షాపులు, గోదాముకు వాడుతున్నారు. దీంతో ఆ భవనంలో నివసించే వారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. అయోధ్యనగర్ మొదటి లైన్‌లోనూ ఓ నిర్మాణం ప్లాన్‌కు విరుద్ధంగా సాగుతోంది. ఇలా పలువురు ప్లాన్ ప్రకారం కాకుండా, అసలు ప్లానే లేకుండా భవన నిర్మాణాలు చేపట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ కళ్ల ముందే అక్రమ నిర్మాణాలు భారీగా జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడమే ఇందుకు నిదర్శనమని నగర ప్రజలు పేర్కొంటున్నారు. ఈ ప్రాంత పరిధిలో పనిచేసే ప్రణాళికా విభాగం అధికారులు అడ్డగోలు పనులతో ఆ విభాగం ప్రతిష్ఠ మసకబారుతోంది. నగరపాలక సంస్థలో ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయి, ప్రస్తుతం సర్కిల్-2లో విధులు నిర్వర్తిస్తున్న ఓ అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఇద్దరు టౌన్ ప్లానింగ్ అధికారులపైన ఏసీబీ అధికారులకు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయని సమాచారం. ఈ సర్కిల్ పరిధిలో అధికారులపై వస్తున్న ఫిర్యాదులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.



అయోధ్యనగర్ మొదటి లైనులో అక్రమ కట్టడం



62వ డివిజన్ పరిధిలో పార్కింగ్ స్థలంలో నిర్మిస్తున్న షాపులు

హెచ్చరించినా మారని తీరు

నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం ప్రక్షాళనకు అధికారులు చర్యలు చేపట్టారు. అనధికార కట్టడాలను ప్రారంభంలోనే గుర్తించడంతోపాటు ఆయా నిర్మాణాలు చేపట్టిన వారిపై చార్జిషీట్ వేసేలా అడుగులు వేశారు. భవన అనుమతుల్లో నిబంధనలను అతిక్రమిస్తే వేటు తప్పదని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. గత ఆగస్టులో ఏసీబీ అధికారుల దాడుల్లో వెలుగు చూసిన అవకతవకలను సరిచేసేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్ చర్యలు చేట్టారు. టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నగరంలోని ఎన్ని అనధికార కట్టడాలు ఉన్నాయో గుర్తించాలని ఆదేశించారు. భవనాల అనుమతుల్లో అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. ఇందులో భాగంగా ప్లాన్‌ల అనుమతుల్లో నిబంధనలు తప్పక పాటించాలని చైన్‌మన్లు, ప్లానింగ్ సెక్రటరీ, డీసీపీ, ఏసీపీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే వేటు తప్పదని హెచ్చరికలు జారీ చేశారు. అయినా కొందరు సిబ్బంది. అధికారులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రక్షాళన చేస్తాం



పట్టణ ప్రణాళిక విభాగాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తాం. ఇప్పటికే ఆ దిశగా చర్యలు చేపట్టాం. అక్రమ, అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. బాధ్యులైన అధికారులపైనా చర్యలు చేపడ్తాం.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగరపాలక సంస్థ కమిషనర్

మసకబారుతున్న ప్రతిష్ఠ

పట్టణ ప్రణాళిక విభాగంలో కింది స్థాయిలో కొంత మంది సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తుండటంతో ఆ విభాగానికి పూర్తిస్థాయిలో అవినీతి మరకలు అంటుతున్నాయి. 100, 200 గజాల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన ప్లాన్ ఇచ్చేందుకు ఆ స్థలాల యజమానులను ప్లానింగ్ విభాగం సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భవన నిర్మాణదారులకు మేలుకలిగేలా సరళంగా అనుమతులు మంజూరయ్యేలా కృషిచేయాల్సిన సిబ్బంది అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అక్రమ కట్టడాలు, అనుమతి లేని నిర్మాణాలపై నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ముఖ్య ప్రణాళికాధికారి జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్ పట్టణ ప్రణాళికా విభాగంపై దృష్టి సారించి, అవినీతి అధికారులపైన చర్యలు తీసుకోవాల్సిన అవశ్యకత ఉందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

బందరు పోర్టుకు త్వరలో పర్యావరణ అనుమతులు



చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పోర్టు నిర్మాణానికి త్వరలో పర్యావరణ అనుమతులు మంజూరు కానున్నట్లు పార్లమెంట్ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్, బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి తెలిపారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌ను కలిశారు. పోర్టు నిర్మాణానికి త్వరితగతిన తుది పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అనుమతులు మంజూరు కోసం వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు తన్మయికుమార్, అమరదీప్‌రాజాలను ఆదేశించినట్లు ఎంపీ తెలిపారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ వన్‌టైమ్ ఆపర్చునిటీ పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ డాక్టర్ వీరబ్రహ్మచారి తెలిపారు. అదే విధంగా డిగ్రీ నాల్గో సెమిస్టర్ పునర్ మూల్యాంకన ఫలితాలను కూడా విడుదల చేశామన్నారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో వీటిని పొందుపరిచామని, విద్యార్థులు వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. అనుబంధ కాలేజీల ప్రిన్సిపాల్స్ దీనిపై విద్యార్థులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పరీక్షల విభాగం అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ లంకా సుశీల పాల్గొన్నారు.

పటుత్వం కోల్పోతున్న ఎముకలు

- కాల్షియం, విటమిన్ డీ తగ్గడమే కారణం
- చాప కింద నీరులా పెరుగుతున్న ఆస్టియో ఫొరోసిస్
- రోగుల్లో 80 శాతం మహిళలే
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో లక్ష మందికిపైగా బాధితులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): వడివడిగా అడుగులు పడాలన్నా.. చకచకా పనులు సాగాలన్నా.. మనిషి దృఢంగా ఉండాలన్నా.. ఎముకలు పటిష్టంగా ఉండాలి. మారుతున్న జీవన విధానం, ఆహారపు అలవాట్లు ఎముకల పటుత్వంపై దుష్ప్రభావం చూపుతున్నాయి. అన్నీ సవ్యంగా సాగితే జీవితాంతం సేవలు అందించాల్సిన ఎముకలు చిన్న, నడివయస్సులోనే సత్తువ కోల్పోతున్నాయి. ఎముకలు గుల్లబారడం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని వైద్య నిపుణులు చెపుతున్నారు.

శారీరక శ్రమ లేకనే...

ఒకప్పుడు ఇంట్లో పిండి రుబ్బడం, దుస్తులు ఉతకడం, బావినీళ్లు చేదడం వంటి ఇంటి పనులతో మహిళలకు తగిన వ్యాయామం లభించేది. ఇప్పుడా పరిస్థితి లేదు. గ్రైండర్‌లు, వాషింగ్ మెషిన్‌లు రావడంతో శరీరానికి తగినంత వ్యాయామం లభించడం లేదు. మగవారిలో సైతం వాహనాల వినియోగం పెరగడం, కనీసం వాటిని స్టార్ట్ చేసేందుకు కిక్ కొట్టే అవకాశం లేకుండా ఎలక్ట్రిక్ స్టార్ట్ బటన్‌లు రావడంతో ఏ మాత్రం వ్యాయామం ఉండటం లేదు. దీనికి తోడు ఏసీల వినియోగం పెరగడం, సూర్యకిరణాలు శరీరాన్ని చేరకపోవడం వంటి కారణాలతో ఎముకల్లో సాంద్రత తగ్గిపోతోంది. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారిలో ఆస్టియో ఫోరోసిస్ వల్ల ఎముకలు విరిగేవి (ఫ్యాక్చర్లు). ఇప్పుడు చిన్న వయస్సులోనే పటుత్వం కోల్పోతున్నట్లు వైద్యులు చెపుతున్నారు.

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో లక్ష మందికిపైనే...

ఎముకలు పటుత్వం తగ్గి ఫ్యాక్చర్లు అవుతున్న వారితో పాటు, ఆస్టియో ఫోరోసిస్ వ్యాధికి గురయ్యే వారు ఉమ్మడి కృష్ణాలో లక్ష మంది వరకూ ఉన్నట్లు అంచనా. ఎముకలు విరిగిన వారు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి రోజూ ఐదారుగురు వస్తుంటారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్న వారు కూడా ఉంటున్నారు. ఇటీవల కాలంలో వెన్నునొప్పి, మెడ ఎముక నొప్పి, తొంటి ఎముక విరగడం వంటి సమస్యలతో అత్యధిక శాతం మంది ఇబ్బంది పడుతున్నారు.

మహిళల్లోనే అధికంగా..

సగటు మహిళకు రొమ్ము, అండాశయ, గర్భకోశ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కంటే బోలు ఎముక (ఎముక పటుత్వం తగ్గడం) వ్యాధి వచ్చే ప్రమాదం చాలా ఎక్కువని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్త్రీ అండాశయంలో ఈస్ట్రోజన్ అనే హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. ఈ హార్మోన్ ఎముక కణాల ఉత్పత్తికి దోహదపడుతుంది. తగినంత శారీరక వ్యాయామం లేక పోవడంతో ఈస్ట్రోజన్ తగ్గడం వలన ఎముక కణాలు క్షీణించి బోలుగా మారుతాయని వైద్యులు చెపుతున్నారు. బహిష్టు ఆగిన వారిలో ఐదేళ్లలో ఎముక సాంద్రత 20 శాతం తగ్గుతుందని పేర్కొంటున్నారు.

శారీరక శ్రమ అవసరం



ఆరోగ్యవంతమైన జీవనశైలితోనే ఎముకలను పటిష్టంగా ఉంచుకోవచ్చు. ముఖ్యంగా కాల్షియం, విటమిన్ డీ, ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే పాలు, పెరుగు, ఉప్పునీరు, చేపలు, రాగులు, పండ్లు వంటి సమతుల ఆహారం తీసుకోవాలి. రోజూ వ్యాయామం చేయాలి. నడకకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. ధూమ, మద్యపానం, కాఫీ, శీతలపానీయాలు అధికంగా సేవించడం మంచిది కాదు. శరీరానికి సూర్య కిరణాలు తాకితే ఎముకలు పటిష్టంగా మారతాయి. విద్యార్థి దశలో క్రీడలు శరీర దారుఢ్యానికి ఉపయోగపడతాయి. ఎముక పటుత్వాన్ని బీఎండీ పరీక్ష ద్వారా నిర్ధారించొచ్చు.

– డాక్టర్ కె.సుధాకర్, ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు, జీజీహెచ్

ఎముక పటుత్వం తగ్గడానికి కారణాలివే..

- ఆహారంలో తగు పాళ్లలో కాల్షియం, విటమిన్ డీ, ప్రొటీన్లు లోపించడం
- నిశ్చల జీవనశైలి (శారీరక శ్రమ లేక పోవడం), మద్యపానం, ధూమపానం
- అధికంగా కాఫీ తాగడం, శీతలపానీయాలు సేవించడం
- అధిక మోతాదులో స్టెరాయిడ్స్ వాడటం
- మహిళల్లో ఈస్ట్రోజన్ హార్మోన్ లోపం



విద్యాదీవెన.. భవితకు నిచ్చెన

- ఎన్టీఆర్ జిల్లాలో 42,524 మంది లబ్ధిదారులు
- విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో రూ.30.76 కోట్లు జమ
- హాజరైన ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న విద్యా దీవెన పథకం విద్యార్థుల బంగారు భవితకు నిచ్చెనలా ఉపయోగపడుతోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టంచేశారు. రాష్ట్రంలో నిరుపేదలకు సైతం కార్పొరేట్ విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. జగనన్న విద్యా దీవెన ద్వారా విద్యార్థుల చదువులకు అయ్యే పూర్తి ఫీజును రీయింబర్స్ చేస్తున్నామని తెలిపారు. మూడేళ్లలో తన నియోజకవర్గంలోనే రూ.240 కోట్లు ఖర్చు చేశామన్నారు. నాలుగో విడత విద్యా దీవెనకు గాను 5,322 మంది విద్యార్థులకు గాను వారి తల్లుల బ్యాంక్ ఖాతాల్లో రూ.4.14 కోట్లను ముఖ్యమంత్రి జమ చేశారని వివరించారు. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లాలో 211 కళాశాలలకు చెందిన 42,524 మంది విద్యార్థులకు సంబంధించి 37,736 మంది తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జగనన్న విద్యాదీవెన పథకం కింద రూ.30,76,31,991 జమ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అమ్మ ఒడి, మన బడి నాడు - నేడు, గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, సంపూర్ణ పోషణ తదితర పథకాల ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యారంగంలో నూతన ఒరవడి నెలకొందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ సేవలు, పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. తొలుత చిత్తూరు జిల్లా మదనపల్లె నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించిన కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, పలువురు అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు అంగిరేకుల నాగేశ్వరరావు, గొల్లభామ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు, డెప్యూటీ మేయర్ శైలజ

భారం తొలగింది



జగనన్న విద్యాదీవెనతో తల్లిదండ్రులపై మా చదువుల భారం తొలిగింది. ఆర్థిక ఇబ్బందులు లేకపోవడంతో పేద విద్యార్థులం పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు వెళ్లకుండా కళాశాలలో పూర్తి సమయం గడపగలుగుతున్నాం. మా పేరెంట్స్ బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేయడం సంతోషంగా ఉంది. వారు కాలేజీకి వచ్చి మేము ఎట్లా చదువుతున్నామో తెలుసుకుంటున్నారు.

– దుంపల విజయ్, బీఏ ద్వితీయ సంవత్సరం, విజయవాడ

హ్యాట్సాఫ్ జగనన్న



నేను ఇంటర్‌తోనే చదువును ఆపేయాల్సిన పరిస్థితి. జగనన్న విద్యా దీవెన ఆదుకుంది. ఈ పథకం వల్లే నేను డిగ్రీ చదవగలుగుతున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఫీజు చెల్లిస్తున్నాడనే భరోసాతో కళాశాలకు ధైర్యంగా వెళ్తున్నాం. పది, ఇంటర్‌తో పేదల చదువులు ఆగిపోకుండా జగనన్న విద్యాదీవెన పథకం ఆదుకుంటోంది.

– మనోరమణ, బీఎస్సీ ప్రథమ సంవత్సరం, విజయవాడ

శంకుస్థాపనకు సర్వ సన్నద్ధం

- బందరు పోర్టు పనులకు ముహూర్తం
- జనవరి లేదా ఫిబ్రవరిలో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు
- విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని



మాట్లాడుతున్న మాజీ మంత్రి పేర్ని నాని

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పోర్టు నిర్మాణంతో జిల్లా వాసుల చిరకాల వాంఛ త్వరలో నెరవేరనుందని మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బందరు పోర్టు నిర్మాణాన్ని దీక్షగా చేపట్టారన్నారు. కానీ కోర్టు అడ్డంకుల వల్ల ఇప్పటి వరకు ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం అన్ని అడ్డంకులు తొలగిపోవటం, కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు, మూడు వారాల్లో పర్యావరణ అనుమతులు వచ్చే అవకాశాలుండటంతో పనులు ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అన్నీ కుదిరితే జనవరి నెలాఖరు లేక ఫిబ్రవరి మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

30 నెలల్లో పూర్తికి ఒప్పందం

పోర్టు నిర్మాణానికి రూ. 5,253.88 కోట్లు అవసరం కాగా దీనిలో రూ. 3049.21 కోట్లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణం, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని నాని తెలిపారు. పనులు ప్రారంభమైన నాటి నుంచి 30 నెలల్లో పనులు పూర్తి చేయాలని నిబంధన కాంట్రాక్టు సంస్థ మెగా ఇంజినీరింగ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు.

దశల వారీగా నిర్మాణం..

- బందరు పోర్టు నిర్మాణాన్ని దశల వారీగా నిర్మించనున్నట్లు పేర్ని నాని తెలిపారు.
- మొదటి దశలో ప్రభుత్వం భూమి 1,730 ఎకరాల్లో నాలుగు బెర్త్‌లు నిర్మాణం చేపట్టనున్నామన్నారు.
- సముద్ర అలల తాకిడిని తట్టుకునేందుకు రెండు కిలోమీటర్లు దక్షిణం, ఉత్తరాల్లో గోడ నిర్మాణానికి రూ. 446 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు.
- ఈ గోడల నిర్మాణం పూర్తయిన అనంతరం 4.6 కోట్ల క్యూబిక్ మీటర్లు డ్రెడ్జింగ్‌లో మట్టిని తవ్వాల్సి వస్తుందన్నారు. ఈ డ్రెడ్జింగ్ కోసం రూ. 1,262.88 కోట్లు కేటాయించామన్నారు.
- ఓడలు రావడానికి అప్రోచ్ చానల్ నిర్మాణం కోసం రూ.706.26 కోట్లు, ఓడలు టర్నింగ్ సర్కిల్‌కు, బెర్త్ పాకెట్స్ కోసం రూ.452.07 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే షిప్ బరువు కాకుండా 80 వేల టన్నుల బరువుతో వచ్చే షిప్‌లు సురక్షితంగా రాగలుగుతాయన్నారు.
- లక్ష నుంచి లక్షన్నర టన్నుల బరువుతో వచ్చే షిప్‌ల కోసం రెండోదశలో బెర్త్‌లు నిర్మించనున్నట్లు పేర్ని నాని తెలిపారు.

రోడ్డు, రైలు మార్గాలకు భూసేకరణ..

పోర్టు నిర్మాణానికి సంబంధించి రోడ్డు, రైలుమార్గాన్ని ఏర్పాటు చేసేందుకు 235 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని పేర్ని నాని తెలిపారు. సాధ్యమైనంత వరకు పొలాల ప్రాంతం నుంచి భూమిని సేకరించేందుకు కృషి చేస్తామన్నారు. బీచ్‌రోడ్డు, పోతిరెడ్డిపాలెం, పోతేపల్లి రైల్వే ట్రాక్ వద్ద రూ.180 కోట్లతో వీటిని నిర్మించాల్సి ఉందన్నారు. మచిలీపట్నం - విజయవాడ రహదారి ఆరు లైన్ల రహదారిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

శరవేగంగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు..

మచిలీపట్నంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని 2023 సెప్టెంబర్‌లో క్లాసులను కచ్చితంగా ప్రారంభిస్తామని పేర్ని నాని తెలిపారు. బందరు మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా నాగదుర్గాభవాని, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా తదితరులు పాల్గొన్నారు.

సోదరుల్లా పనిచేశాం

బదిలీపై వెళ్తున్న కృష్ణా జేసీ సత్కార సభలో కలెక్టర్ రంజిత్ బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతి ఉద్యోగి, అధికారికి బదిలీ తప్పదని అయితే ఉన్న సమయంలో విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కృష్ణా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల వెళ్లిన మహేష్‌కుమార్ రావిరాలకు వీడ్కోలు, నూతన జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ సిన్‌సిన్వర్‌కు స్వాగతం పలుకుతూ బుధవారం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన అనంతరం తనతో పాటు బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమార్ ఎనిమిది నెలల పాటు కలిసి పనిచేసి సోదరుల్లా జిల్లా ప్రజలకు సేవలందించామన్నారు. తదనంతరం జిల్లాలో గవర్నర్, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించామన్నారు. బదిలీపై వెళ్తున్న మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా అధికారుల సహకారంతోనే పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు సాధ్యమైందన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ చైతన్య, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



జేసీ మహేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా చిత్రంలో నూతన జేసీ అపరాజితసింగ్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు


ప్రమాదంలో గాయపడి స్పృహ కోల్పోయిన దుర్గ

జి.కొం దూరు(మైలవరం): జి.కొండూరు శివారులోని 30వ నంబరు జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళ్తే.. విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామానికి చెందిన శీలంనేని తిరుమలరావు బుధవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై మైలవరం వైపు నుంచి రాయనపాడు వెళ్తున్నాడు. జి.కొండూరు శివారులోకి రాగానే అదే సమయంలో పినపాక గ్రామానికి చెందిన నక్కనబోయిన నాగయ్య తన భార్య దుర్గతో కలిసి జి.కొండూరు వైపు నుంచి పినపాక వెళ్తూ జాతీయరహదారి దాటుతుండగా తిరుమలరావు వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నక్కనబోయిన దుర్గకి గాయాలై స్పృహ కోల్పోగా తిరుమలరావుకి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జి.కొండూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో విజయవాడ తరలించారు.

వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసిన చంద్రబాబు

- పసికందును ఎలుకలు కరిచింది ఆయన పాలనలోనే..
- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు


మీడియాతో మాట్లాడుతున్న వెలంపల్లి, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): తన పాలనలో వైద్య రంగాన్ని, ఆరోగ్య శ్రీని నిర్వీర్యం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో పసికందును ఎలుకలు కరిచింది, బ్యాటరీ లైట్ల వెలుగులో ఆపరేషన్లు చేసిందీ ఆయన పాలనలోనే అని గుర్తుచేశారు. విద్యాధరపురంలో హెల్త్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించిన అనంతరం వెలంపల్లి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుపై ధ్వజమెత్తారు. తమ పాలనలో మన బడి నాడు – నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడం, ప్రభుత్వాస్పత్రులను ఆధునికీకరించడం, కొత్త హాస్పిటళ్లను నిర్మించడం వంటి అభివృద్ధి కార్యక్రమాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. '40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే నీవు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నియమించినంత మంది వైద్యులను, స్టాఫ్‌ను నీ పాలనలో నియమించావా?' అంటూ సూటిగా ప్రశ్నించారు. రోడ్లపై చిన్న చిన్న గుంతలు చూపి అనుకూల మీడియాలో అభూత కల్పనలు రాయించడం కాదు చంద్రబాబూ.. వాస్తవంలోకి రా అంటూ హితవుపలికారు. సీఎం జగనన్న ప్రభుత్వంలో కొత్తగా నిర్మించిన హెల్త్ సెంటర్లను, మిలమిలా మెరిసిపోతున్న సీసీ రోడ్లు చూస్తే అభివృద్ధి అంటే ఏమిటో తెలుస్తుందన్నారు. చంద్రబాబు హయాంలో కాలేజీలకు బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెల్లించారని గుర్తుచేశారు. ప్రతి క్వార్టర్‌కు ఆయా కాలేజీలకు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించి విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. అమరావతి అంశంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రతిపక్షాలకు వినబడక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావాలనే ఆకాంక్షతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులు ప్రకటించారని పేర్కొన్నారు.

పాడిరైతులకు రూ.19 కోట్ల బోనస్ పంపిణీ


తీర్మానాలను వెల్లడిస్తున్న చైర్మన్ చలసాని

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): పాడి రైతులకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ రెండో విడత బోనస్‌గా రూ.19 కోట్లు చెల్లించనున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. విజయవాడ రోడ్డులోని కాకాని వెంకటరత్నం పాల ఉత్పత్తిదారుల సమావేశ మందిరంలో కృష్ణా మిల్క్ యూనియన్ పాలక మండలి సమావేశం బుధవారం జరిగింది. అనంతరం పాలకమండలి తీర్మానాలను చైర్మన్ చలసాని మీడియాకు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటికే మొదటి విడత బోనస్‌గా రైతులకు రూ.16 కోట్లు చెల్లించామన్నారు. రెండో విడతగా రూ.19 కోట్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. గత ఏడాదితే పోల్చితే 32 శాతం వృద్ధి రేటుతో గడిచిన ఎనిమిది నెలలో 6.08 కోట్ల లీటర్ల పాలు సేకరించామని వివరించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.1150 కోట్ల టర్నోవర్ లక్ష్యమని తెలిపారు. బాపులపాడు మండలం వీరవల్లిలో ఆరు లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న నూతన కార్మాగారాన్ని 2023 విజయదశమి నాటిని ప్రారంభిస్తామన్నారు. యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు ఎర్నేని సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

కృష్ణలంక(విజయవాడతూర్పు): కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) నాలుగో రాష్ట్ర మహా సభలు నవంబర్ 28, 29 తేదీల్లో కర్నూలులో అత్యంత వైభవంగా జరిగాయని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభలో ఎన్నికైన నూతన కమిటీ వివరాలను, ఆమోదించిన తీర్మానాలను వెల్లడించారు. 15 మందితో ఆఫీసు బేరర్స్, 67 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైందన్నారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఓ.నల్లప్ప, అంద్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షులుగా వి.శ్రీనివాసరావు, దడాల సుబ్బారావు, గుడిసె నటరాజ్, ఎం.డి.ఆనంద్‌బాబు, బూరలక్ష్మీ, టి.చిరంజీవి, పచ్చిమాల వసంతకుమార్, సహాయ కార్యదర్శులుగా గుండిమెడ క్రాంతికుమార్, బొమ్మతోటి రఘురామ్, కె.క్రాంతిబాబు, ఆలూరు తిరుపాలు, జి.రవిబాబు, కె.రంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. 15 తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నగరాజు, సహాయ కార్యదర్శి క్రాంతికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఇక బోధనే బాధ్యత

బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి

- ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయుల నుంచి డిమాండ్
- ఇన్నాళ్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేస్తున్న మేధావులు
- స్వాగతిస్తున్న ఉపాధ్యాయ వర్గాలు


బడిలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు(ఫైల్)

మచిలీపట్నం: విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది. విద్యాబుద్ధులు నేర్పి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దటంలో తల్లిదండ్రుల తర్వాత గురువుదే గురుతర బాధ్యత. అందుకే వారు 'ఆచార్య దేవోభవ' అని పూజింపబడుతున్నారు. కానీ గత పాలకులు విద్యారంగంపై చూపిన నిర్లక్ష్యం కారణంగా చదువులు చెప్పాల్సిన మాస్టారు బోధనేతర పనుల వైపు శ్రద్ధ పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఆ బోధనేతర పనులకు చెరమగీతం పాడే రోజులు వచ్చాయి. తన నైపుణ్యాన్ని అంతా రంగరించి పిల్లలకు చక్కగా పాఠ్యాంశాలు బోధించి.. మా దేవుడు మీరే మాస్టారు అని పిలిపించుకునే తరుణం ఆసన్నమైంది.

ఇన్నాళ్లకు మోక్షం..

ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు విధులు కేటాయించటంపై ఎప్పటి నుంచో ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వీటి నుంచి తప్పించాలని ఉపాధ్యాయ సంఘాల నుంచి డిమాండ్ ఉంది. కానీ నాటి పాలకులెవ్వరూ ఉపాధ్యాయుల గోడు వినలేదు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పుడు ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయిస్తూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయాయి. దశాబ్దాల తరబడి ఉపాధ్యాయుల నుంచి వస్తున్న డిమాండ్‌కు ఇన్నాళ్లకు మోక్షం లభించింది. ఇక నుంచి టీచర్లు బడిలో పనులకే పరిమితి కావాల్సి ఉంటుంది. దీనిపై మేధావి వర్గంతో పాటు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల నుంచి సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యకు మంచి రోజులు..



అందరికీ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది. విద్యార్థులను తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయులే కీలకం. కానీ వారిని బోధనేతర పనులకు వినియోగిస్తుండటం వల్ల ఆశించిన స్థాయిలో ఫలితాలను రాబట్టలేని పరిస్థితులు ఇప్పటి వరకు ఉండేవి. ప్రభుత్వ ఉత్తర్వులతో ఇక ఉపాధ్యాయులంతా విద్యార్థులకు చక్కగా పాఠాలు చెప్పవచ్చు.

– తాహెరా సుల్తానా, డీఈవో, కృష్ణా జిల్లా

మంచి నిర్ణయం..



ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. బోధనేతర పనుల భారంతో మేము స్కూల్లో విద్యార్థులకు చదువులు సవ్యంగా చెప్పలేకపోతున్నాం. ఉపాధ్యాయుల సమస్యలను గుర్తించిన ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. దీని వల్ల ఉపాధ్యాయులకు ఎంతో ఉపశమనం కలిగినట్లే. ఇదీ అందరూ హర్షించాల్సిన గొప్ప నిర్ణయం.

– ఎం.వీ. మహంకాళీరావు, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, కృష్ణా జిల్లా

ఇదో గొప్ప మార్పు..



విద్యారంగంలో ఇదో గొప్ప మార్పుగానే చెప్పవచ్చు. నాడు–నేడు పనులతో పాఠశాలలు ఎన్నడూ లేని రీతిలో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో చదువులు కూడా సవ్యంగా సాగాలి. ప్రభుత్వం ఇలాంటి ఆలోచనలతోనే ఉపాధ్యాయులను బోధనేతర పనులు నుంచి తప్పించింది. దీని వల్ల మంచి ఫలితాలు చూడవచ్చు.

– యూవీ సుబ్బారావు, డెప్యూటీ డీఈవో, మచిలీపట్నం

ఉపాధ్యాయుల పక్షానే ప్రభుత్వం..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉపాధ్యాయుల పక్షానే ఉంది. ఎన్నికల విధుల్లాంటి బోధనేతర పనులు వద్దని ఎంతో కాలంగా ఎస్టీయూ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. కానీ గత ప్రభుత్వాలు పెద్దగా ఇలాంటి సమస్యపై దృష్టి పెట్టలేదు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. అలాగే ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచటం హర్షణీయం.

– కొమ్ము ప్రసాద్, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు


పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన వస్తువులు



సరికొత్తగా ముస్తాబు చేసిన పార్కులోని ప్రధాన ఆర్చ్

ఆసాంతం.. ఆహ్లాదం



బందరులోని ప్రధాన పార్కు నగర వాసులకు సరికొత్త అనుభూతిని అందిస్తోంది. పార్కునకు ఇటీవల రూ.15 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. శిథిలమైన సిమెంట్ బల్లలు, తుప్పు బట్టిన పిల్లల ఆట వస్తువులు, అలంకార ప్రాయంగా వాటర్ ఫౌంటెన్‌ల స్థానంలో కొత్తవి అమర్చారు. పార్కు గోడలపై సెల్ఫీలు తీసుకునేందుకు వీలుగా త్రీడీ కలర్స్‌తో పలు జంతువుల చిత్రాలను గీయించారు. ఎడమ పక్కన 'ఐ లవ్ మచిలీపట్నం' అనే స్వాగత బోర్డు, నూతనంగా రెండు షటిల్ కోర్టులు ఏర్పాటు చేశారు. – మచిలీపట్నంటౌన్


ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన సిమెంటు బల్లలు


పార్కులోని పార్వతీ పరమేశ్వరుల విగ్రహం

పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంచించాడు

పెనమలూరు: ప్రేమపేరుతో వంచించి తనపై పలుమార్లు లైంగిక దాడి చేశాడని ఓ బాధితురాలు పెనమలూరు పోలీసులను ఆశ్రయించటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరుకు చెందిన బీటెక్ చదివిన యువతి అదే గ్రామానికి చెందిన షేక్. దావలి గత మూడు సంవత్సరాలుగా పరస్పరం ప్రేమించుకుంటున్నారు. తనను పెళ్లి చేసుకుంటానని దావలి పలు మార్లు లైంగిక దాడి చేశాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరించాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై దావలి, అతనికి సహకరించిన తలిదండ్రులు షేక్.కొండ, షేక్.ఇమామ్‌బీపై పోలీసులు లైంగికదాడి కేసు నమోదు చేశారు.

డాక్యుమెంట్లు ఫోర్జరీ.. ఇద్దరిపై కేసు

పెనమలూరు: డాక్యుమెంట్లు ఫోర్జరీ చేసిన ఇద్దరు వ్యక్తులపై పెనమలూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఆర్. గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప గ్రామానికి చెందిన మేడసాని రమేష్‌కు పూర్వీకుల నుంచి 2.72 ఎకరాల మాగాణి భూమి సంక్రమించింది. అయితే ఈ ఏడాది సెప్టెంబర్‌లో మారెడ్డి వెంకటరెడ్డి అనే వ్యక్తి రమేష్ వద్దకు వచ్చి అస్వాధీన దస్తావేజు రాసి ఇచ్చారని భూమి స్వాధీనం చేయాలని రమేష్‌ను అడిగాడు. దీంతో రమేష్ దిగ్భ్రాంతికి గురయ్యాడు. సదరు డ్యాక్యుమెంట్లను హైదరాబాద్‌లోని ఓ ల్యాబ్‌లో పరిశీలనకు పంపగా అవి ఫోర్జరీ సంతకాలని గుర్తించాడు. అయితే మారెడ్డి వెంకటరెడ్డి, కమ్మిలి రంగనాథ్ కలిసి రమేష్ పొలాన్ని ఆక్రమించే యత్నం చేశారు. దీంతో బాధితుడు తన ఆస్తి డాక్యుమెంట్లు ఫోర్జరీ చేసి, బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐఎల్ఆర్ఎస్ఏ జాతీయ కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న అసోసియేషన్ సెక్రటరీ జనరల్ కె.సి.జేమ్స్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) నూతన జాతీయ కార్యవర్గం ఎన్నికైంది. విజయవాడ గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న ఏఐఎల్ఆర్ఎస్ఏ స్వర్ణోత్సవాలు, జాతీయ 23వ ద్వైవార్షిక మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన జాతీయ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా ఎం.ఎన్.ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్.మోనీ, సెక్రటరీ జనరల్‌గా కె.సి. జేమ్స్, ట్రెజరర్‌గా మోహన్‌చాంద్ పాండే, వైస్ ప్రెసిడెంట్లుగా టి.హనుమయ్య, ఎం.ఎం.రోలీ, రాంచరణ్, ఆర్.ఎస్.సింగ్, రంజిత్‌కుమార్, ప్రకాశ్ పరమర్, సి.చౌదరి, జగ్‌నారాయణ్ షాహ్, ఆర్.ఆర్.భగత్, హెచ్.ఎస్.భదూరియాలతో కలిపి 76 మందిని జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ జనరల్ కె.సి. జేమ్స్ మాట్లాడుతూ.. లోకో రన్నింగ్ కార్మికుల సమస్యలు కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. లేకుంటే రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించారు. అసోసియేషన్ నాయకులు కె.రామకృష్ణ, ఎం.వెంకటేశన్, ఎస్.గురుమూర్తి, జి.వెంకటేశ్వర్లు, వై.కె.ఆర్.ఎన్.మూర్తి, రవిశంకర్, రాజేష్ కుమార్, వి.వెంకటరావు, 26 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

బొగ్గు పోయి గ్యాస్ వచ్చె..


విజయవాడ పుష్ప హోటల్ రెడ్ సర్కిల్ సెంటర్‌లో ఇంధన వాయువుతో ఇస్త్రీ చేస్తున్న దృశ్యం

రోజురోజుకీ బొగ్గు రేటు పెరిగిపోవడంతో వాటి స్థానంలో ఇటీవల మార్కెట్‌లోకి గ్యాస్ ఐరన్ పెట్టెలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో బొగ్గు ఐరన్ పెట్టెల వాడకం అధికంగా ఉండేది. ప్రస్తుతం బొగ్గు ధర కేజీ రూ.50 ఉండడంతో రోజుకు రూ.200 పెట్టుబడి అవుతోంది. అంత ధరకు బొగ్గును కొనుగోలు చేసి వ్యాపారం చేయలేక రజక వృత్తిదారులు ఇటీవల మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చిన గ్యాస్ ఐరన్‌బాక్స్‌ను కొనుగోలు చేసి ఇస్త్రీకి వినియోగిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

భారతీయ యోగా ప్రపంచానికి ఆదర్శం

విజయవాడ కల్చరల్: భారతీయ యోగా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని స్వామి రాందేవ్‌బాబా శిష్యులు స్వామి పరమార్ధదేవ్ అన్నారు. భారత స్వాభిమాన్ ట్రస్ట్, పంతంజలి యోగా సమితి, మహిళా పంతంజలి యోగా సమితి, యువ భారత్, కిసాన్ సేవా సమితి ఆధ్వర్యంలో సైంటిఫిక్ యోగా శిబిరాన్ని దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యోగా సాధకులకు శరీరంతోపాటు మనసు అదుపులో ఉంటుందన్నారు. యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఆయుర్వేదం మనజీవన మార్గంగా మలచుకోవాలని పిలుపునిచ్చారు. రాందేవ్‌బాబా యోగా అందరికీ అవగాహన కోసం విశేషమైన కృషి చేస్తునట్లు తెలిపారు. ఆచార్య చంద్రమోహన్‌జీ జ్యోతిని వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. యోగా శిబిరంలో సీనియర్ న్యాయవాది జీ రామకృష్ణ, అసిస్టెంట్ డైరక్టర్ మినిస్టర్ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఎస్ ప్రకాశరావు, ఆర్‌వీఎస్ ప్రసాద్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యోగా గురువు రఘు, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన యోగా సాధకులు శిబిరంలో పాల్గొన్నారు. యోగా, సూర్య నమస్కారాలు ప్రదర్శన ఆసక్తి కలిగించింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు కొత్తపేట ఆంజనేయవాగు దుక్క తిరుపతమ్మ వీధికి చెందిన తొత్తడి రాజు తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తుంటాడు. రాజుకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె రుచిత(19) డిగ్రీ చదువుతోంది. రోజూ కాలేజీకి అమ్మాయిని రాజు తీసుకెళుతుంటాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఉన్న రుచిత వరండాలో ఫోన్ మాట్లాడుతోంది. కొంత సమయం తర్వాత రుచిత వరండాలో కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

డ్రైయినేజీలలో మరమ్మతులకు చర్యలు


డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన చేసి పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్

వించిపేట(విజయవాడపశ్చిమ): డివిజన్‌లో మురుగునీటి పారుదలకు ప్రాధాన్యం ఇస్తు, డ్రైయినేజీలలో మరమ్మతులకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు స్థానిక 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. డివిజన్‌లోని చిట్టినగర్, ఈద్గా మసీదు ఎదురు, అంబేడ్కర్ విగ్రహం సమీపంలో దెబ్బతిన్న డ్రైయినేజీ మరమ్మతు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి శ్రీనివాసరావువీధి మొదటి వరకు కల్వర్టులు తొలగించి, సైడు డ్రెయిన్ల నిర్మాణానికి నగరపాలకసంస్థ రూ. 4లక్షల నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుర్గా కోఆపరేటీవ్ బ్యాంక్ డైరెక్టర్ చేపూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు తంగిరాల కృప, నగరపాలకసంస్థ ఏఈ రాజేష్, ప్రసాద్, సచివాలయ సిబ్బంది జమీల్, భవానిరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో ఆధునిక ఎక్స్‌-రే విభాగం ప్రారంభం



రైల్వే రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ప్రధాన రైల్వే ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక డిజిటల్, కంప్యూటరైజ్డ్ రేడియోగ్రఫి సిస్టంతో ఏర్పాటు చేసిన ఎక్స్‌-రే విభాగంతో పాటుగా ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సహకారంతో ఆధునికీకరించిన పిల్లల వార్డును డీఆర్ఎం శివేంద్రమోహన్ బుధవారం లాంచనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే కుటుంబాలు, పెన్షనర్స్‌కు మెరుగైన వైద్య సాయం అందించే దిశగా రైల్వే హాస్పిటల్‌లో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు నూతనంగా రూ.1.39 కోట్లతో ఆధునిక ఎక్స్‌-రే పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా ఎక్స్‌రే యంత్రాలను ఏర్పాటుకు కృషి చేసిన వైద్య బృందాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అదే విధంగా పిల్లల వార్డు ఆధునీకీకరణ పనులకు ముందుకు వచ్చి సహకరించిన ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. రైల్వే ఉద్యోగులు, పెన్షనర్లు హాస్పిటల్‌లోని అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జయమోహన్‌తో, సభ్యులు నూతనంగా ఏర్పాటు చేసిన పిల్లల వార్డుకి అవసరమైన ఆట పరికరాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, సీఎంఎస్ డాక్టర్ ఎమ్.శ్రీలక్ష్మీ, ఏసీఎంఎస్ డి.సీతారామ్, ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధికి పెద్దపీట

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 4వ డివిజన్ పరిధిలోని హరిజన వాడలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలను లబ్ధిదారులను చేస్తూ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాలలో రోడ్లు, విద్యుత్, డ్రైయినేజీ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు.

ప్రభుత్వం పై పెరిగిన విశ్వాసం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విధానాల ద్వారా ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందన్నారు. ఈ కారణంగా వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అత్యధిక మెజారిటీతో గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలతో టీడీపీ పూర్తిగా కనుమరుగువుతుందన్నారు. ఇప్పటికే ఆ పార్టీ నాయలకు ఓటమి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. ప్రజల్లో తమ పార్టీకి పెరుగుతున్న ఆదరణకు ఓర్వలేక ప్రతి పక్ష నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు.

సక్రమంగా సంక్షేమ పథకాలు

నాల్గవ డివిజన్‌లో పరిధిలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని దేవినేని అవినాష్ పేర్కొన్నారు. అర్హులైన పేదలకు పింఛన్లు, ప్రభుత్వ స్థలాలు అందుతున్నాయని తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి స్థానికులను కలుసుకున్నారు. 4వ డివిజన్ ఇన్‌చార్జి గల్లా పద్మావతి, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు గల్ల రవికుమార్, బొడ్డు తరుణ్, సునీత పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే పేదరిక నిర్మూలన


విద్యా దీవెన చెక్కును అందిస్తున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ఆర్థిక భరోసా కల్పిచడం ద్వారా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఆంధ్రా లయోల ఇంజినీరింగ్ కళాశాల ఆవరణ లో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యా దీవెన చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరగాలంటే విద్యావ్యాప్తి ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఇందులో భాగంగా నాణ్యమైన విద్యనందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకొచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారన్నారు. కేవలం ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థీ చదువునకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే విద్యా దీవెన పథకం ద్వారా తలిదండ్రుల ఖాతాల్లోకి నగదును బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటిఐ, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ ఇలా అన్ని గ్రూపుల విద్యార్థులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని 5,895 మంది విద్యార్థులకు రూ.4,76,67,689ను విడుదల చేసినట్లు చెప్పారు. 5,191 మంది తలిదండ్రుల ఖాతాల్లోకి జమచేసినట్లు పేర్కొరు. ఇంత పెద్ద మొత్తంలో నగదును ఎటువంటి దళారీలు లేకుండా పారదర్శకంగా బదిలీ చేయడం హర్షణీయమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్యా దీవెన పథకం అమలు జరుగుతోందన్నారు. అనంతరం విద్యార్థులకు చెక్కును అందచేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్ జేవియర్, ప్రిన్సిపాల్ మహేష్, మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక పాల్గొన్నారు.

4న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సమావేశం

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు


సమైక్యతను చాటుతున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు కేసన శంకరరావు, క్రాంతికుమార్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సుప్రీం కోర్టు పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ ఈ నెల 4న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. కేంద్రంలో దీర్ఘకాలం పాలన చేసిన కాంగ్రెస్, తర్వాత నిత్యం హిందుత్వం గురించే మాట్లాడే బీజేపీలకు బీసీల సంక్షేమం విషయంలో ఏనాడూ చిత్తశుద్ధిలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో డిసెంబరు 4న గాంధీనగర్ ఐలాపురం కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సన్నాహక సమావేశం బుధవారం లబ్బీపేటలోని తమ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం పలు విభాగాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రిజర్వేషన్లు రద్దు చేసి, దేశంలోని అన్ని కులాల ప్రజలకు వారి సంఖ్యను బట్టి వనరులు, అవకాశాలు సమానంగా పంచాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అనేక అంశాలపై చర్చించడం కోసం రౌండ్ టేబుల్ నిర్వహిస్తున్నామన్నారు. ఆ సమావేశంలో రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో పాటు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మేధావులు పాల్గొంటారని పేర్కొన్నారు. అనేకసార్లు 50 శాతం బోర్డర్‌లైను దాటకూడదంటూ తీర్పు చెప్పిన సుప్రీం కోర్టు, తమ లక్ష్మణరేఖను వారే అతిక్రమించినట్లయిందన్నారు. ఆనాడు రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదంటూ తొమ్మిది మంది న్యాయమూర్తులు తీర్పు చెబితే, నేడు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తొమ్మిది మంది న్యాయమూర్తుల తీర్పును పట్టించుకోలేదని పేర్కొన్నారు. వీటన్నింటిపై చర్చించి ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పేందుకు బీసీలను సమాయత్తం చేసేందుకు తాము పోరాటం చేస్తామని కేసన తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధుల కుమ్మర క్రాంతికుమార్, కనకారావు, నాగమల్లేశ్వరరావు, తులసీరామ్, పావులూరి హనుమంతరావు, అంగడాల పూర్ణచంద్రరావు, కోలా అశోక్, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, రంగరావు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న సంతోష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయని సుప్రజా టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు చలువాది సంతోష్ తెలిపారు. అంతర్జాతీయ కంప్యూటర్ భద్రతా దినోత్సవం సందర్భంగా బుధవారం సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో సైబర్ సెక్యూరిటీ–హ్యాకింగ్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సైబర్ నేరాలు, వివిధ రకాల ఆఫర్ల పేరుతో మొబైల్ ఫోన్లకు పంపించే నకిలీ సందేశాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇటీవల నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలను సృష్టించి, వారి పరిచయస్తులకు ఫోన్ పే, గుగూల్ పే వంటి యాప్ ద్వారా నగదు బదిలీ చేయమని సందేశాలు పంపడం సాధారణంగా మారిందన్నారు. అందువల్ల ఫేస్‌బుక్ అకౌంట్ ఉన్న వారు వారి అకౌంట్‌ను లాక్ చేయడం ద్వారా ఈ రకం మోసాలకు నివారించవచ్చన్నారు. సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలను సంతోష్ వివరించారు. ఈ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాల గురించి విద్యార్థులకు ఆయన అవగాహన కలిగించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్, శిక్షణా ఉపాధి విభాగాధికారి కావూరి శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుర్గగుడి భద్రతపై సమీక్ష

ఆక్టోపస్ మాక్‌డ్రిల్


సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ కోటేశ్వరరావు, ఆక్టోపస్ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి భద్రతా చర్యల్లో భాగంగా ఆక్టోపస్ మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై బుధవారం ఆక్టోపస్ మాక్‌డ్రిల్‌పై దేవస్థాన అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్రాహ్మణ వీధిలోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావు, ఆక్టోపస్ ఎస్పీ శ్రీరామచంద్రమూర్తి, డీఎస్పీ తిరుపతయ్య, వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఆక్టోపస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, శివాజీతో పాటు అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, వైద్య, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, ఏజైల్ సెక్యూరిటీ సిబ్బంది, దుర్గగుడి ఎలక్ట్రికల్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా తీసుకునే చర్యలతో పాటు భక్తుల భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి


ప్రాజెక్ట్ కాంపిటీషన్‌లో బహుమతులు సాధించిన విద్యార్థులు

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులను భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చి దిద్దేందుకు విద్యా సంస్థలు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ నుపూర్ అజయ్ కుమార్ అన్నారు. ఆంధ్రా లయోల కళాశాల ఆవరణలో 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి ప్రాజెక్ట్ కాంపిటీషన్ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని కోరారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించేందుకు విద్యా సంస్థలు కృషి చేయాలన్నారు. విద్యార్థులు సైతం ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, వాటిని సాధించే దిశగా పాటుపడాలన్నారు. అనంతరం జిల్లా విద్యా శాఖాధికారి సీవీ రేణుక మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో సాంకేతికత, వైజ్ఞానిక విషయాలలో పోటీ తత్వం ఉందన్నారు. నానాటికీ వైజ్ఞానికతలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని తెలిపారు. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులు ఆయా అంశాల పై పట్టు సాధించాలన్నారు. కేవలం విద్యకే పరిమితం కాకుండా నూతన తరహాలో ఆలోచించాలని సూచించారు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు విద్యా శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో సైన్స్ ప్రాజెక్ట్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని చెప్పారు. జిల్లా స్థాయి పోటీలలో ఏడు అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వచ్చేనెల తొమ్మిదో తేదీన శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా లోని గూడూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు. గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ మైనం హుస్సేన్, జిల్లా అకడమిక్ కో–ఆర్డినేటర్ ఎస్.జయలక్ష్మి, నిర్వాహకులు పాల్గొన్నారు.

4న కృష్ణలంకలో ఉచిత వైద్య శిబిరం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని అమర జీవి పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాల (ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్) ఆవరణలో కృష్ణలంక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ నిమ్మల దుర్గారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ హాస్పిటల్ యాజమాన్యం సహకారంతో కృష్ణలంక ప్రాంత ప్రజలకు ఉచిత స్క్రీనింగ్, పూర్తి స్థాయిలో డయాబెటిక్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శిబిరం ఆదివారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

ముగిసిన శ్యామలాంబదేవి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావుబుచ్చయ్య కాలనీ లోని శ్యామలాంబదేవి ఆలయం వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. అమ్మవారికి విశేషంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. లోక కళ్యాణార్థం లక్ష్మీగణపతి హోమం, ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాంహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు చోడిశెట్టి సాంబశివరావు, సత్యనారాయణ, జీ కృష్ణమోహన్ తదితరులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు, గౌరి పర్యవేక్షించారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పుట్టవీధిలోని స్వయంభూ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం లోక కళ్యాణార్థం విశేషంగా హోమం, శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పలు రకాల పుష్పాలతో పుష్పార్చనలను ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ నిర్వహించారు.

డివిజన్ స్థాయిలో కార్పొరేటర్లతో సమీక్ష



సమావేశంలో పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అవినాష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూంలో తూర్పు నియోజకవర్గంలోని 2,3,4,5,6,7 డివిజన్లకు సంబంధించిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, కొత్త ప్రాజెక్ట్స్, సచివాలయ వ్యవస్థపై నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణలు బుధవారం ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా క్షేత్ర స్థాయిలో డివిజన్లలో పర్యటించిన నేపథ్యంలో ప్రధానంగా రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, కొండ ప్రాంతాల్లో మెట్లు వంటి పలు సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అవినాష్ వివరించారు. నగరపాలక సంస్థ ద్వారా ప్రజలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలలో ఎదురవుతున్న ఇబ్బందులకు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మల కుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, కలపాల అంబేడ్కర్, వియ్యపు అమర్‌నాథ్, మెరకనపల్లి మాధురి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) శకుంతల, జోనల్ కమిషనర్–3 డాక్టర్ రవిచంద్, ఏడీహెచ్ శ్రీనివాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వీ చంద్రశేఖర్, ఏఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు, హత్యలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె శ్రీదేవి కోరారు. హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐద్వా పశ్చిమ కమిటీ ఆధ్వర్యంలో మద్యం, మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించాలని కోరుతూ బుధవారం స్థానిక నేతాజీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాచారాలు, హింసలకు మూలమైన మద్యం, మత్తు పదార్థాల అమ్మకాలు, వినియోగాన్ని నిషేధించాలన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


వెలంపల్లిని సత్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు


క్యాండిల్ లైట్ సర్వీస్‌లో పాల్గొన్న ఫెడరేషన్ ప్రతినిధులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏసు ప్రభువు జననం గురించి తెలుసుకునే విధంగా ముందస్తుగానే కార్యక్రమాలను నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. వైఎస్ థామస్ రెడ్డి మాట్లాడుతూ పాస్టర్ల సంక్షేమం కోసం క్రిస్టియన్ భవన నిర్మాణానికి క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్స్ ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. రెబ్బ ఇమ్మానియేల్ బిషప్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు పెరికె వరప్రసాదరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కుల్లో మత స్వేచ్ఛ హక్కు ఉందని, దానిపై కొన్ని దుష్ట శక్తులు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవులందరూ ఐక్యంగా ఉన్నప్పుడే మన హక్కులను సాధించుకోగలమన్నారు. ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ రెవరెండ్ పాస్టర్ జీవన్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ వేడుకల్లో సుప్రీం కోర్ట్ న్యాయవాది రోనాల్డ్ రాజు క్యాండిల్ లైట్ సర్వీస్‌ను ప్రారంభించగా విశ్వప్రసాద్ క్రిస్మస్ గీతాలను ఆలపించారు.

గురజాడ అప్పారావుకు ఘన నివాళి


గురజాడ అప్పారావుకు నివాళులర్పిస్తున్న మహిళలు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రముఖ కవి, సంఘసంస్కర్త గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమం బుధవారం ప్రకాష్‌నగర్లో ప్రజాసంఘాల కార్యాలయంలో ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పించిన పిమ్మట, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ అప్పారావు అభ్యుదయవాది, స్త్రీ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, వితంతువులకు పునర్వివాహాలు చేయాలని స్త్రీ విద్య కోసం పోరాటాలు చేసిన గొప్పవ్యక్తన్నారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు కె.సరోజ, జి.ఝాన్సీ, దేవికుమారి, అమ్ములు, నిర్మల, విజయ పాల్గొన్నారు.

రహదారి వెంబడి పచ్చదనం పెంపొందించాలి

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


కుండీలలో మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం అధికారులతో కలిసి వారధి నుంచి రామవరప్పాడు రింగ్ వరకు జాతీయ రహదారి, తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో వాల్ పెయింటింగ్స్, గ్రీనరీ అభివృద్ధిపై అధికారులను అడిగి తెలుసుకుని పలు ఆదేశాలు జారీ చేశారు. బెంజి సర్కిల్ జంక్షన్‌లో ఫ్లెఓవర్ బ్రిడ్జి దిగువున ఏర్పాటు చేసిన కుండీల మధ్య ఉన్న గ్యాప్‌ను తగ్గించి, ఖాళీగా ఉన్న కుండీలలో మొక్కలను నాటాలన్నారు. గ్రీనరీని అభివృద్ధి చేయడంతో పాటు జంక్షన్‌లో పూర్తి స్థాయిలో పచ్చదనాన్ని పెంపొందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యానవన అధికారులకు సూచించారు. అదే విధంగా రమేష్ హాస్పిటల్ దగ్గర ఫ్లెఓవర్ బ్రిడ్జి కింద వేస్తున్న వాల్ పెయింటింగ్స్ పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. పెయింటింగ్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వీ చంద్రశేఖర్, ఏఎస్ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్య ప్రభుత్వ బాధ్యత కాదన్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ ధ్వజం



సాక్షి, అమరావతి: చంద్రబాబు సీఎంగా ఉండగా విద్య ప్రభుత్వ బాధ్యత కాదని అన్నారని, కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని కోరారని వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ చెప్పారు. సీఎంగా ఉండగా విద్యా వ్యవస్థను చిన్న చూపు చూశారన్నారు. నేడు విద్యార్థులకు మంచి జరుగుతుంటే అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఎంపీ బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కార్పొరేట్ మాఫియాను ప్రోత్సహించిన చంద్రబాబు.. ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రభుత్వం ఆధ్వర్యంలోనే పేదలకు ఇంగ్లిష్ మీడియం చదువులు అందుబాటులోకి వస్తే ఓర్వలేకపోతున్నారని అన్నారు. నాడు – నేడు, ఇంగ్లిష్ మీడియం గురించి చంద్రబాబు ఎంత హీనంగా మాట్లాడారో ప్రజలంతా చూశారన్నారు. సీఎం జగన్ ప్రజలకు ఏ మంచి చేసినా రాక్షసులు, మారీచుల రూపంలో బాబు అండ్ బ్యాచ్ అడ్డుకుంటోందని తెలిపారు.

బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన ప్రతి మాటనూ నెరవేరుస్తున్న సీఎం జగన్

- మంత్రి చెల్లుబోయిన వేణు



సాక్షి,అమరావతి : బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్ నెరవేర్చుతున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చెప్పారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ 8న బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, ఈ సమ్మేళనానికి సీఎం జగన్‌ను ఆహ్వానించనున్నట్టు తెలిపారు. మూడున్నరేళ్ల పాలనలో బీసీ వర్గాలకు జరిగిన మేలును గుర్తు చేసుకుంటూ.. గ్రామ సర్పంచ్ నుంచి ఎంపీల వరకూ బీసీ ప్రజాప్రతినిధులంతా కలిసి ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బీసీలకు ఈ ప్రభుత్వం ఎంత అండగా ఉందో.. సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా భరోసా ఇచ్చిన విషయాన్ని సమావేశంలో తెలియజేస్తామని వివరించారు. బీసీలకు డీబీటీ ద్వారా మూడున్నరేళ్లలో రూ.86 వేల కోట్లకు పైగా అందించినట్టు తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టింది వైఎస్సార్‌సీపీనేనని చెప్పారు.

ప్రాధాన్యత బిల్లులకు రూ.499.99 కోట్లు

గ్రామీణ ప్రాంతాలకు రూ.348.14 కోట్లు, పట్టణాలకు రూ.151.85 కోట్లు

- డీడీవోలకు నిధులు విడుదల చేస్తూ ప్రణాళికా శాఖ ఉత్తర్వులు
- 3,663 సచివాలయాల్లో రూ.732.60 కోట్ల విలువైన పనులు మంజూరు



సాక్షి, అమరావతి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అత్యంత ప్రాధాన్యతగా చేపట్టి పూర్తి చేసిన పనుల బిల్లులు చెల్లించేందుకు తొలి విడతగా రూ.499.99 కోట్లను విడుదల చేస్తూ ప్రణాళిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని జిల్లాలవారీగా డీడీవోలకు విడుదల చేసింది. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు సచివాలయాల వారీగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యేల పర్యటన సందర్భంగా స్థానిక అవసరాలను గుర్తించి అత్యంత ప్రాధాన్యత పనులను చేపట్టేందుకు ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.3,000 కోట్లకు పైగా నిధులను ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. సంబంధిత ఏజెన్సీ, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు జిల్లాల వారీగా గ్రామీణ ప్రాంతాలకు రూ.348.14 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.151.85 కోట్లు చొప్పున ప్రణాళికా శాఖ విడుదల చేసింది.

రూ.732.60 కోట్ల పనులు మంజూరు

గడప గడపకు మన ప్రభుత్వంలో సచివాలయాల వారీగా ఇప్పటికే రూ.732.60 కోట్ల పనులను మంజూరు చేశారు. 3,663 సచివాలయాల పరిధిలో రూ.20 లక్షల చొప్పున రూ.732.60 కోట్ల విలువైన 18,162 పనులను మంజూరు చేశారు. ఇందులో 3,132 సచివాలయాల పరిధిలో 15,262 పనులు ప్రారంభం కూడా అయ్యాయి. వీటిపై ప్రతి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సీఎస్ సమీక్షిస్తున్నారు.

పనులు పూర్తయ్యేకొద్దీ నిధులు..

గడప గడపకు మన ప్రభుత్వంలో చేపట్టిన పనులను పూర్తి చేయడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్ తెలిపారు. బిల్లులు చెల్లించేందుకు తొలి దశ నిధులు విడుదల చేశామని, పనులు పూర్తవుతున్న కొద్దీ నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

రైతుభరోసా అందని వారికి అవకాశం

- రేపటిలోగా దరఖాస్తు చేసుకోండి
- వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ వెల్లడి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో అర్హత ఉండి తొలి రెండువిడతల్లో లబ్ధిపొందని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చిందని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అర్హులైన రైతులు తమ వివరాలను సమీప ఆర్బీకేల్లోని రైతుభరోసా పోర్టల్ ద్వారా శుక్రవారం (డిసెంబర్ 2వ తేదీ)లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ దరఖాస్తుల్ని పరిశీలించి అర్హులకు జనవరిలో మూడోవిడతతో కలిపి రైతుభరోసా సొమ్ము జమచేస్తామని చెప్పారు. ఖరీఫ్ ఈ–క్రాప్ నమోదుకు సంబంధించిన రసీదులను డిసెంబర్ మూడో తేదీలోగా రైతులకు అందజేయాలని ఆదేశించారు. రబీ–2022–23 సీజన్ కోసం 22.69 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటికే 12.88 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆర్బీకేల ద్వారా మూడులక్షల టన్నుల విక్రయం లక్ష్యం కాగా 44 వేల టన్నులు విక్రయించినట్లు చెప్పారు. ఆర్బీకేల ద్వారా ఎరువుల సరఫరాను మెరుగుపర్చాలని సూచించారు. మిల్లెట్ మిషన్ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 8,700 హెక్టార్లలో 435 క్లస్టర్స్ ఏర్పాటు చేసి రాగి, కొర్ర తదితర చిరుధాన్యపు పంటలసాగు చేపట్టాలన్నారు. ఒక్కో క్లస్టర్‌కు 20 హెక్టార్లు గుర్తించాలని, ప్రతి హెక్టార్‌కు రూ.6 వేల ప్రోత్సాహం ఇస్తామని చెప్పారు. ఆర్బీకే స్థాయిలో ఏర్పాటు చేయతలపెట్టిన కిసాన్ డ్రోన్ల కోసం గుర్తించిన రైతులకు డ్రోన్ పైలెట్ మొదటి విడత శిక్షణ ప్రారంభమైందన్నారు. డిసెంబర్ 15న ప్రారంభం కానున్న రెండోవిడత శిక్షణకు ఎంపిక చేసిన రైతులను సిద్ధం చేయాలని సూచించారు.

సవరణ చట్టంతో అమరావతి రైతుల వ్యాజ్యాలు నిరర్థకం

- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లస్థలాల కేటాయింపు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 2020లో జారీచేసిన జీవో 107ను సవాలు చేస్తూ అమరావతి రైతులు దాఖలు చేసిన వ్యాజ్యాలన్నీ నిరర్థకం అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. సీఆర్‌డీఏ చట్టానికి సవరణలు చేసిన నేపథ్యంలో పాత వ్యాజ్యాలన్నీ నిరర్థకం అవుతాయని, ఆ మేరకు ఒక మెమో కూడా దాఖలు చేశామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి బుధవారం హైకోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అంతేగాక నిరర్థక వ్యాజ్యాల్లో తమ అభ్యర్థనను సవరించేందుకు అనుమతి కోరుతూ అమరావతి రైతులు ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. ప్రభుత్వ మెమోను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని అమరావతి రైతుల తరఫు న్యాయవాదులకు స్పష్టం చేసింది. ప్రధాన అభ్యర్థనను సవరించేందుకు అనుమతి కోరుతూ అనుబంధ వ్యాజ్యం దాఖలు చేశామని రైతుల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు తెలిపారు. ఈ అనుబంధ వ్యాజ్యంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈ మేరకు సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌కు అవార్డు

సాక్షి, అమరావతి: పర్యావరణ హిత సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తున్న స్వచ్ఛంద సంస్థల జాబితాలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌కు జాతీయ పురస్కారం లభించింది. ఢిల్లీలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) 2వ సుస్థిర వ్యవసాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వర్షాధార వ్యవసాయానికి చేసిన విశేష కృషికి గానూ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ అవార్డును అందజేశారు. కరువు నివారణ కోసం రక్షక తడి, మిశ్రమ ఆహార పంటల నమూనాలు, బహుళ వృక్ష పంటలు, నేల, నీటి సంరక్షణ కార్యక్రమాలను ఎకాలజీ సెంటర్ ప్రోత్సహిస్తోంది.

తెలంగాణ

విజయ్‌కి 'లైగర్' సెగ!

ఈడీ ఎదుట హాజరైన హీరో విజయ్ దేవరకొండ

- లైగర్ సినిమాలో పెట్టుబడుల విషయమై ప్రశ్నలు
- కొందరు రాజకీయ నేతల డబ్బులున్నట్లు అనుమానం
- త్వరలో కరణ్ జోహార్ సహా మరికొందరికి నోటీసులు

సాక్షి, హైదరాబాద్: 'లైగర్' చిత్రంలో పెట్టుబడులకు సంబంధించిన సెగ ఆ చిత్రంలో ఫైటర్‌గా నటించిన హీరో విజయ్ దేవరకొండకు తగిలింది. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల ఎదుట ఆయన బుధవారం హాజరయ్యారు. ప్రధానంగా భారీ బడ్జెట్‌తో కూడిన ఆ సినిమా నిర్మాణానికి పెట్టుబడులు పెట్టిన వారి విషయం పైనే ఈడీ దృష్టి పెట్టింది. కొందరు రాజకీయ నేతలు మనీలాండరింగ్ ద్వారా లైగర్‌లో పెట్టుబడులు పెట్టారని అధికారులు అనుమానిస్తున్నారు. ఈడీ గత నెల 17న ఈ సినిమా దర్శకనిర్మాతలు పూరీ జగన్నాథ్, చార్మీ కౌర్‌లను 10 గంటలపాటు ప్రశ్నించిన సంగతి తెలిసిందే. వారి విచారణలో వెలుగులోకి వచ్చిన కొన్ని అంశాలను క్రాస్ చెక్ చేసుకోవడానికి విజయ్ దేవరకొండకు నోటీసులు జారీ చేసింది.

రెమ్యునరేషన్ ఎలా తీసుకున్నారు?

విజయ్ తన మేనేజర్‌తో కలిసి బుధవారం ఉదయం 8.30 గంటలకు ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఈడీ అధికారులకు ఇవ్వడానికి తన వెంట కొన్ని పత్రాలను తెచ్చారు. ఉదయం 10.30 గంటలకు విజయ్‌ను ప్రశ్నించడం ప్రారంభించిన అధికారులు గంట భోజన విరామం ఇచ్చారు. ఆ తర్వాత ప్రారంభమైన విచారణ రాత్రి వరకు సాగింది. ఈ చిత్ర నిర్మాణంతోపాటు విజయ్ తీసుకున్న రెమ్యునరేషన్‌కు సంబంధించి అధికారులు ప్రశ్నల్ని సంధించారు. పారితోషికాన్ని చెక్కుల ద్వారానా, ఆన్‌లైన్‌లోనా లేదా నగదు రూపంలో తీసుకున్నారా అని ప్రశ్నించారు. ఈ చిత్రానికి సంబంధించి నిర్మాతలతో చేసుకున్న ఒప్పందం పత్రాలను విజయ్ నుంచి తీసుకున్నారు. ఈ చిత్రానికి పెట్టుబడులు పెట్టిన వారిలో హైదరాబాద్‌కు చెందిన కొందరు రాజకీయ నేతలు ఉన్నారన్నది ఈడీ అనుమానం. ఈ విషయంపై అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చిన ఆయన.. నటించడం మాత్రమే తన బాధ్యతని, ఆర్థిక లావాదేవీల్లో కలగజేసుకోలేదని చెప్పారని సమాచారం. తాను ఎక్కువగా దర్శకుడితోనే సంప్రదింపులు జరిపానని, తమ మధ్య పెట్టుబడులు, ఆర్థిక లావాదేలపై ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ చిత్రం నిర్మాణంలో ఉన్నప్పుడు, వివిధ ఫంక్షన్ల సమయంలోనూ రాకపోకలు సాగించిన, హాజరైన వారి జాబితాలను అధికారులు సేకరిస్తున్నారు. వీరికి నిర్మాతలతో ఉన్న సంబంధాలపై ఆరా తీయనున్నారు. అధికారులు త్వరలో మరికొందరు సినీ, రాజకీయ ప్రముఖులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. లైగర్ నిర్మాతల్లో పూరీ జగన్నాథ్, చార్మీ కౌర్‌తోపాటు బాలీవుడ్ ప్రముఖుడు కరణ్ జోహార్, అపూర్వ మెహతా సైతం ఉన్నారు. వీరికీ నోటీసులు జారీ చేసి విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ చిత్రంలో నటించిన మైక్ టైసన్ రెమ్యునరేషన్ అంశాన్నీ ఈడీ అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారని సమాచారం.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ప్రముఖులు

మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది. ఎక్సైజ్ అధికారులకు రూ.కోటి లంచం అందించడంలోనూ విజయ్‌నాయర్ కీలక పాత్ర పోషించారని పేర్కొంది. దక్షిణాది గ్రూపును శరత్‌చంద్రారెడ్డి, కె.కవిత, మాగుంట శ్రీనివాసులురెడ్డి నియంత్రించారని పేర్కొంది. మద్యం పాలసీ రూపకల్పన సమయం నుంచి వీరంతా ఎన్ని ఫోన్లు వినియోగించారు. ఎన్ని ఫోన్ నంబర్లు మార్చారన్న అంశాలను తేదీలతో సహా వివరించింది. ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా నాలుగు ఫోన్ నంబర్లు, విజయ్‌నాయర్ రెండు, సృజన్‌రెడ్డి ఒకటి, అభిషేక్ బోయినపల్లి ఒకటి, బుచ్చిబాబు గోరంట్ల ఒకటి, శరత్‌రెడ్డి ఒకటి, కల్వకుంట్ల కవిత రెండు ఫోన్ నంబర్లు వినియోగించారని, ఏయే రోజుల్లో సదరు ఫోన్ వినియోగించారనేది ఐఎంఈఐ సహా స్పష్టం చేసింది. మొత్తంగా 36 మంది (నిందితులు/అనుమానితులు) ఫోన్ నంబర్ల వివరాలను రిపోర్టులో పేర్కొంది. ఈ 36 మంది 170 ఫోన్లు వినియోగించి వాటిని ధ్వంసం చేశారని తెలిపింది. ఈ ఫోన్ల విలువ రూ.1.38 కోట్లు ఉంటుందని పేర్కొంది. 2022, సెప్టెంబర్ 23 వరకూ ఆయా ఫోన్లు వినియోగించారని తెలిపింది. మద్యం విధానంలో భాగంగా 32 జోన్లుగా విభజించారని, ఆయా జోన్లను ఎవరి ఆధ్వర్యంలో నిర్వహించారన్న విషయాలు వివరించింది. మద్యం పాలసీ కారణంగా ప్రభుత్వ ఖజానాకు రూ.2,873 కోట్లు నష్టం వాటిల్లిందని దీనిపై పూర్తిస్థాయి వివరాలు రాబట్టడానికి అమిత్ అరోరాను 14 రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరింది.

శాతవాహన కాలం నాటి గుహలను పరిరక్షించాలి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కృష్ణా జిల్లా గన్నవరం మండలం ముస్తాబాదలో క్రీస్తు శకం 1వ శతాబ్దానికి చెందిన బౌద్ధ గుహ ముందు భాగం ఇటీవల వర్షాలకు కూలిపోయిందని, దానిని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ) సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. గుహ పరిసరాలను బుధవారం ఆయన పరిశీలించారు. శాతవాహనుల కాలంలో బౌద్ధ భిక్షువులు వర్షాకాలంలో ఈ గుహల్లో నివసించే వారని, క్రీస్తు శకం 8వ శతాబ్దంలో ఈ గుహలను వైష్ణవులు తమ గుహాలయంగా మార్చుకున్నారని వివరించారు. ఈ గుహల చారిత్రక ప్రాధాన్యత గురించి స్థానికులకు అవగాహన కల్పించామని తెలిపారు. అమరావతి బుద్ధ విహార కార్యదర్శి మేడసాని శుభాకర్, ముస్తాబాద గ్రామానికి చెందిన వీరపనేని ప్రభాకర్, కంచర్ల సాంబశివరావులతో పాటుగా స్థానిక పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

4న టేకుపల్లిలో ఘంటసాల శతజయంతి ఉత్సవం



టేకుపల్లి(మోపిదేవి): అమర గాయకుడు, గాన గంధర్వుడు, పద్మశ్రీ డాక్టర్ ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్సవాలను ఈనెల 4వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు మోపిదేవి మండలం టేకుపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించనున్నట్లు యడవల్లి నీలలోహిత శాస్త్రి, రామేశ్వరస్వామి దేవాలయ పాలకవర్గం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామేశ్వర స్వామివారి దేవాలయ ప్రాంగణంలో ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత, నృత్య, కళా మండప నిర్మాణ ప్రకటన ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి, ముఖ్య అతిథులుగా అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ చీఫ్ విప్ కరణం ధర్మశ్రీ, ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఘంటసాల జీవిత విశేషాలతో కూడిన ఛాయాచిత్రప్రదర్శన ఉంటుందన్నారు.

మళ్లీ మోగుతున్న డేంజర్ బెల్

- ఉమ్మడి కృష్ణా జిల్లాలో పెరుగుతున్న హెచ్ఐవీ కేసులు
- మొబైల్ ఫోన్లతో యువత పెడదారి
- గర్భిణులకు సోకుతుండటంపై ఆందోళన
- పాజిటివ్ రేటు తగ్గించేలా కార్యాచరణ
- నేడు ప్రపంచ ఎయిడ్స్ డే

మచిలీపట్నంకు చెందిన ఓ గర్భిణి వైద్య పరీక్షల కోసం పెద్దాస్పత్రికి వెళితే... అక్కడ చేసిన పరీక్షల్లో ఆమెకు హెచ్ఐవీ పాజిటివ్ అని తేలింది. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్త కారణంగా తనకీ దుస్థితి పట్టిందని తెలుసుకున్న ఆమె, తీవ్ర మనోవేదనకు లోనైంది. కడుపులో ఉన్న బిడ్డకు వ్యాధి సోకకూడదని వైద్యుల వద్ద విషయాన్ని ధైర్యంగా చెప్పి, తగిన మందులు వాడుతోంది.

ఇబ్రహీంపట్నంకు చెందిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థి కడుపునొప్పి అని వైద్యం కోసం వెళితే... అక్కడ చేసిన పరీక్షల్లో హెచ్ఐవీ అని నిర్ధారణ అయింది. దీంతో సదరు విద్యార్థి కాలేజీ చదువుకు ఫుల్‌స్టాప్ పడింది. చేసిన తప్పుకు పశ్చాత్తాపంతో కుంగిపోతున్న అతన్ని చూసిన వైద్యులు, క్రమం తప్పకుండా మందులు వాడితే కొన్నాళ్లకు దీని నుంచి బయటపడవచ్చని సలహా ఇవ్వటంతో ఆ విద్యార్థి కుటుంబం ఊపిరి పీల్చుకుంది.

మచిలీపట్నం: విచ్చలవిడి శృంగారం ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి బారిన పడేలా చేస్తోంది. ఆండ్రాయిడ్ ఫోన్లలో కనిపిస్తున్న డేటింగ్ యాప్‌ల కారణంగానూ యువత పెడదోవ పడుతున్నారు. భాగస్వామితో కాకుండా ఇతరులతో కలవటం, సురక్షిత పద్ధతులు పాటించకపోవటంతో భార్య కడుపులో ఉన్న బిడ్డకు సైతం హెచ్ఐవీ సోకుతోంది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఇటీవల వెలుగు చూస్తున్న హెచ్ఐవీ కేసులు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

పాజిటివ్ రేటు తగ్గించేలా...

హెచ్ఐవీ పాజిటివ్ రేటు తగ్గించటమే లక్ష్యంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో 21,031 మంది, కృష్ణా జిల్లాలో 7,073 మంది ప్రస్తుతం హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులు ఉన్నట్లుగా గుర్తించారు. రెండు జిల్లాల పరిధిలో ఉన్న ఏఆర్‌టీ, ఐసీటీసీ కేంద్రాల ద్వారా తరచూ వైద్య సేవలు అందిస్తూ, వారు క్రమం తప్పకుండా మందులు వాడేలా గ్రామస్థాయిలో ఉన్న ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల ద్వారా పర్యవేక్షణ పెంచారు. మూడు నెలల పాటు క్రమం తప్పకుండా ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా మందులు వాడిన వారికి పింఛన్ అందజేస్తున్నారు.



ఎయిడ్స్ నియంత్రణపై లోగో

విస్తృతంగా హెచ్ఐవీ పరీక్షలు

హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులను సకాలంలో గుర్తించటం ద్వారా వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చనే లక్ష్యంతో ఆస్పత్రుల్లో పరీక్షల సంఖ్యను పెంచారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎలాంటి ఆపరేషన్ చేసినా, తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్ష చేస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 25,727 మందికి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 0.98 పాజిటివ్ రేటు ఉన్నట్లు గుర్తించారు. గర్భం దాల్చిన ప్రతి మహిళకు వైద్య సేవల్లో భాగంగా హెచ్ఐవీ పరీక్షలు చేస్తున్నారు. ఇలా ఈ ఏడాది 14,566 మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో 0.954 శాతం పాజిటివ్‌ను గుర్తించారు.


మూడేళ్లలో పరీక్షలు, పాజిటివ్ కేసులు ఇలా...

సంవత్సరం	గర్భిణులు	పాజిటివ్	జనరల్ పరీక్షలు	పాజిటివ్
2020–21	85,417	57	1,05,834	1,152
2021–22	87,256	71	1,55,107	1,634
2022–23 (అక్టోబర్ వరకు)	63,149	39	1,21,207	1,086

స్వచ్ఛంద సంస్థలపై పర్యవేక్షణ పెంచాల్సిందే

సెక్స్‌వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ట్రాన్స్ జెండర్లు, మాదక ద్రవ్యాలను సూదుల ద్వారా ఎక్కించుకునే వారి ద్వారానే ఎక్కువగా హెచ్ఐవీ విస్తరిస్తోందని వైద్య శాఖాధికారులు భావిస్తున్నారు. ఇలాంటి వారికి అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టేందుకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 13 స్వచ్ఛంద సేవా సంస్థలు పనిచేస్తున్నాయి. వీటి నిర్వహణకు ఏపీ శాక్స్ నుంచి నిధులు కేటాయిస్తున్నారు. కానీ కొన్ని సంస్థలు కాగితాల్లోనే తప్ప క్షేత్రస్థాయిలో కనిపించటం లేదు. ఎయిడ్స్ నియంత్రణ కార్యకలాపాలు చూస్తున్న ఓ ఉద్యోగి వీరితో కుమ్మక్కై నిధులు కొల్లగొడుతున్నట్లు ప్రచారం ఉంది. ఏపీ శాక్స్ నిధులతో నిర్వహిస్తున్న సంస్థ కార్యకలాపాలపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ

వ్యాధి నియంత్రణకు శ్రద్ధ తీసుకుంటున్నాం



హెచ్ఐవీ సోకిన గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రజల్లో అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రచార కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తున్నాం.

– డాక్టర్ జూపూడి ఉషారాణి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి

ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో అడ్మిషన్లు పునరుద్ధరణ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్ పేటలోని డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో అడ్మిషన్లను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఈ నెల 28న ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్లు నిలిపివేయడంతో కళాశాల యాజమాన్యం సమస్యను ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకురాగా, ఆయన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అడ్మిషన్లు పునఃప్రారంభించాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆయుష్ శాఖ కమిషనర్, న్యూఢిల్లీలోని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ వారితో మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం, మినిస్టరీ ఆఫ్ ఆయుష్ 2022–23 విద్యా సంవత్సరానికి 75 అండర్ గ్రాడ్యుయేషన్, 25 గ్రాడ్యుయేషన్ సీట్లకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే చొరవతో తమ కళాశాలలో అడ్మిషన్లు పునఃప్రారంభం కావడాన్ని హర్షిస్తూ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు బుధవారం ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి ఆయన్ను సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.సాయిసుధాకర్, సెక్రటరీ జె.ధనుంజయరావు, ఎస్ఎంపి అధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నరాజు, కళాశాల పెద్దలు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

దుర్గగుడికి రూ.8 లక్షల విరాళాలు



ఆలయ ఈవో భ్రమరాంబకు విరాళం అందజేస్తున్న వీరభద్రరావు కుటుంబం



రూ.2 లక్షలు విరాళం అందజేసిన గన్నవరం భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు బుధవారం వేర్వేరుగా రూ.8 లక్షల మేర విరాళాలు సమర్పించారు. కృష్ణాజిల్లా ఈడుపుగల్లు గ్రామానికి చెందిన సూర్యదేవర వీరభద్రరావు, బిజిలీకుమారి(లైలా) కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ.5,00,116 విరాళాన్ని అందజేసింది. గన్నవరానికి చెందిన బోయపాటి సీతారామాంజనేయులు, శ్రీమన్నారాయణల కుటుంబం అమ్మవారిని దర్శించుకుని నిత్యాన్నదాన పథకానికి రూ.2,00,116 విరాళం సమర్పించింది. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన తిరుపతయ్య, రమాదేవి, వారి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దనరెడ్డి

పెనమలూరు: రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో లోపాలు లేకుండా చూడాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దనరెడ్డి తెలిపారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని కానూరు శ్రీరామ్‌నగర్‌లో రూ.5 కోట్లతో నిర్మాణం చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో 24x7 విద్యుత్ సరఫరాలో భాగంగా 45 నియోజకవర్గాల్లో రూ.కోట్లు వెచ్చించి విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ఒక్క పెనమలూరు నియోజకవర్గంలోనే రూ.20 కోట్లతో నాలుగు సబ్‌స్టేషన్‌లు నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రజలు, సిబ్బంది సహకారంతో విద్యుత్ రంగాన్ని పటిష్టం చేయగలుగుతున్నామని అన్నారు. కానూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో లోఓల్టేజీ సమస్య తీరుతుందని, నాణ్యమైన విద్యుత్ సరఫరా కారణంగా దాదాపు 9 వేల మంది విద్యుత్ వినియోగదారులకు బిల్లులు కూడా తగ్గుతాయని వివరించారు.



కానూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించిన ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దనరెడ్డి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, అధికారులు

రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన చంద్రబాబు : ఎమ్మెల్యే పార్థసారథి

చంద్రబాబు పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, అప్పుల రాష్ట్రంగా మార్చారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆరోపించారు. చంద్రబాబు దాదాపు రూ.3 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించాడని అన్నారు. తాము చేసిన అప్పులకు అణాపైసా లెక్కలతో చూపుతామని, చంద్రబాబు చేసిన అప్పులు లెక్కలు చూపగలరా అని ప్రశ్నించారు. ప్రజలు కూడా వాస్తవ విషయాలు పరిశీలించాలని కోరారు. పెనమలూరు ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతున్నందున మరిన్ని సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి తాము స్థలాలు కేటాయిస్తామన్నారు. సంక్షేమం–అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. ప్రతిపక్ష నేతలు కళ్లు తెరచి చూస్తే అభివృద్ధి కనబడుతుందన్నారు.

పోరంకిలో సబ్‌స్టేషన్ మంజూరు..

పోరంకి ప్రభునగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ అవసరముందని ఎమ్మెల్యే పార్థసారథి ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దనరెడ్డిని కోరగా ఆయన వెంటనే స్పందించి 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఎన్.ప్రకాశరావు, డీఈలు హరిబాబు, వసంతరావు, ఏడీఈ ఎం.పూర్ణచంద్రరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు అన్నే చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 1-12-2022

స్ఫూర్తి

చాలా సందర్భాల్లో పుస్తకాల నుంచి స్ఫూర్తి లభిస్తుంది.
అయితే వ్యక్తుల్లో కూడా పుస్తకాలలాంటి వారు ఉంటారు.
ఆనాటి విఠల్ బాలక్రిష్ణ నుంచి నిన్నటి రాకేష్ ఝున్‌ఝున్‌వాలా వరకు
అలాంటి వారు ఎంతోమంది ఉన్నారు.
తాత విఠల్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని అడుగులు వేస్తున్న మనవరాలు లీనా గాంధీ తివారి,
భర్తనే గురువుగా భావించి, అతడి నుంచి స్ఫూర్తి పొంది
తనను తాను నిరూపించుకున్న రేఖా ఝున్‌ఝున్‌వాలా
తాజాగా ఫోర్బ్స్ ఇండియా '100 రిచెస్ట్ 2022' జాబితాలో చోటు సంపాదించారు....

అడుగు జాడలలో... గెలుపు బాటలలో



● రేఖా ఝున్‌ఝున్‌వాలా

● లీనా గాంధీ తివారి

'రాకేష్ శకం ముగిసిపోలేదు. ఆయన ప్రతినిధిగా నేను ఉన్నాను' అనిపించేలా ఇన్వెస్టర్‌గా గెలుపు జెండా ఎగరవేసింది 59 సంవత్సరాల రేఖ. ఆమె విజయానికి తాజా కొలమానం ఫోర్బ్స్ ఇండియా జాబితాలో ఆమె పేరు.

స్వాతంత్ర్య సమరయోధుడిగా, భవిష్యత్ దార్శనికుడిగా చరిత్రకెక్కిన విఠల్ బాలక్రిష్ణ జీవితాన్ని 'బియాండ్ పైప్స్ అండ్ డ్రీమ్స్' పేరుతో పుస్తకంగా రాసింది లీనా గాంధీ తివారి. కంపెనీ వ్యవహారాల నుంచి సామాజిక సేవ వరకు ఎన్నో విషయాల్లో ఈ పుస్తకం తనకు మార్గదర్శనం చేస్తుంది.

ముంబై కేంద్రంగా పనిచేస్తున్న మల్టీనేషనల్ ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ కంపెనీ 'యుఎస్వీ' చైర్‌పర్సన్ లీనా గాంధీ తివారి. 'యూనివర్శిటీ ఆఫ్ ముంబై'లో బి.కామ్ చేసింది. బోస్టన్ యూనివర్శిటీలో ఎంబీఏ చేసింది. తన మూలాలలోకి వెళ్లాలనుకున్న లీనా తివారి తాత జీవితాన్ని ఒక పుస్తకంగా తీసుకురావడానికి నడుం బిగించింది.

ఎందరితోనో మాట్లాడింది.

ఎన్నో ప్రాంతాలు తిరిగింది.

ఈ క్రమంలో తనకు తాత జీవితం లోతుగా అర్థమైంది. అది జీవితం అనడం కంటే స్ఫూర్తిని ఇచ్చే పుస్తకమనే అవగాహన వచ్చింది.

పేదరికంలో పుట్టి పెరిగిన విఠల్ బాలక్రిష్ణ గాంధీ మహారాష్ట్రలోని రత్నగిరి నుంచి అమెరికాకు వెళ్లి ఉన్నత చదువులు చదువుకోవడం వరకు ఒక ప్రయాణం. అమెరికా నుంచి తిరిగి వచ్చిన తరువాత 1961లో యుఎస్వీ కంపెనీ స్థాపించడం మరో ప్రయాణం. ఈ ప్రయాణాలేవి అతడికి నల్లేరు మీద నడకలు కాలేదు. అడుగడుగునా కష్టాలు ఎదురయ్యాయి.

అయితే విఠల్ బాలక్రిష్ణ ఎప్పుడూ వెనక్కి చూడలేదు.

'ప్రపంచంలో నీ గురించి నీకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. అందుకే మన కోసం మనం ప్రత్యేకమైన టైమ్ కేటాయించుకోవాలి. ఆ సమయంలో మనలోని ఇద్దరి మధ్య సంవాదం జరుగుతుంది. ఇదిగో ఇవి నీ బలహీనతలు. ఇవిగో నీ బలాలు. ఆ సమయంలో నువ్వు అలా చేశావు. అలా కాకుండా ఇలా చేసి ఉంటే బాగుండేది....ఇలాంటి వాటిని జాగ్రత్తగా అవలోకిస్తే మన గురించి మనకు బాగా తెలుస్తుంది. ఏంచేయాలి, ఏం చేయకూడదు అనే విషయంలో ప్రాథమిక అవగాహన వస్తుంది' అని చెప్పే విఠల్ బాలక్రిష్ణ స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో లోక్‌సభ సభ్యుడిగా పార్లమెంట్‌లోకి అడుగుపెట్టాడు.

పార్లమెంట్‌లో జరిగే చర్చల్లో చురుగ్గా పాల్గొని తన అభిప్రాయాలను వినిపించేవాడు. దీనికి ముందు సంబంధిత సబ్జెక్ట్‌ను లోతుగా అధ్యయనం చేసేవాడు.

స్వాతంత్ర్య సమరయోధుడిగా, భవిష్యత్ దార్శనికుడిగా చరిత్రకెక్కిన విఠల్ బాలక్రిష్ణ జీవితాన్ని 'బియాండ్ పైప్స్ అండ్ డ్రీమ్స్' పేరుతో పుస్తకంగా రాసింది లీనా గాంధీ తివారి. కంపెనీ వ్యవహారాల నుంచి సామాజికసేవ వరకు ఎన్నో విషయాల్లో ఈ పుస్తకం తనకు మార్గదర్శనం చేస్తోంది.

సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణిస్తున్న లీనా గాంధీ తివారికి సంఘసేవ అంటే ఇష్టం. ప్రకృతిలో ఏకాంతంగా గడపడం అంటే ఇష్టం. ప్రయాణాలు చేయడం అంటే ఇష్టం. వ్యాపారానికి సంబంధించి అంతర్జాతీయ సెమినార్‌లలో పాల్గొనడం ఎంత ఇష్టమో, ముంబైలోని వకోలకు సమీపంలోని మురికివాడ పిల్లలతో గడపడం అంటే కూడా అంతే ఇష్టం.

వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి రకరకాల పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తుంటుంది.

రాకేష్ ఝున్‌ఝున్‌వాలా పరిచయం అక్కర్లేని పేరు. ఈక్విటీ మదుపర్లకు మార్గదర్శిగా చెప్పుకునే పేరు. స్టాక్ మార్కెట్ చరిత్రలో చాప్టర్‌గా మారిన పేరు.

అయిదువేల రూపాయలు అప్పు చేసి 'ట్రేడింగ్'కు శ్రీకారం చుట్టిన రాకేష్ ఆ తరువాత 'స్టాక్ మార్కెట్ స్టార్'గా ఎదిగాడు. వందల కోట్లు సంపాదించాడు. విమానయానరంగంలోకి కూడా అడుగు మోపాడు. ఆయన హఠాన్మరణం భార్య రేఖను దుఃఖ సముద్రంలోకి నెట్టివేసింది. అయితే అందులో నుంచి త్వరగానే బయటపడింది. తనను భర్త ఎప్పుడూ నవ్వు ముఖంతో చూడాలనుకునేవాడు.

సందర్భం వచ్చినప్పుడల్లా రేఖ గురించి...

'నా విజయంలో ఆమెకు భాగస్వామ్యం ఉంది. సహనం ఉన్న వ్యక్తి' అని చెబుతుండేవాడు. ఇద్దరి పేర్లలోని కొన్ని ఆంగ్ల అక్షరాలతో తన స్టాక్‌బ్రోకింగ్ సంస్థకు 'రేర్' అని పేరు పెట్టాడు రాకేష్.

'రాకేష్ శకం ముగిసిపోలేదు. ఆయన ప్రతినిధిగా నేను ఉన్నాను' అనిపించేలా ఇన్వెస్టర్‌గా గెలుపు జెండా ఎగరవేసింది 59 సంవత్సరాల రేఖ. తన విజయానికి తాజా కొలమానం ఫోర్బ్స్ ఇండియా జాబితాలో ఆమె పేరు.

తండ్రి కోరికపై సామాజిక సేవా కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి పెట్టేవాడు రాకేష్ ఝున్‌ఝున్‌వాలా. 'నాకు సంపదను పంచే శక్తి ఇవ్వు' అంటూ దైవాన్ని ప్రార్థించేవాడు. ఆయన మరణంతో ఆ కార్యక్రమాలేవి అటకెక్కలేదు. ఇన్వెస్టర్‌గా తనను తాను నిరూపించుకున్న రేఖ ఝున్‌ఝున్‌వాలా భర్తకు ఇష్టమైన సేవాకార్యక్రమాలపై కూడా దృష్టి సారించింది.

వారసులు వారసత్వాన్ని తీసుకోవడానికి ఉత్సాహపడతారు. యువరాజులు కిరీటం కోసం వెంపర్లాడతారు. ఆసక్తి లేని పని చేయనక్కర్లేదని సామ్రాజ్యాలను వదలుకుంటారా ఎవరైనా? 32 ఏళ్ల జయంతి చౌహాన్. 7000 కోట్ల బిస్లరీ వాటర్ సామ్రాజ్యానికి ఏకైక యువరాణి. 'నాకు ఆసక్తి లేదు' అని చైర్ పర్సన్ పదవిని నిరాకరించింది. దీని వల్ల సంస్థను టాటా పరం చేయనున్నట్టు వార్తలు వస్తున్నాయి. తృప్తినిచ్చే పని చిన్నది కావచ్చు. పెద్దది కావచ్చు. కాని తృప్తినిచ్చే పనిలోనే ఆనందం ఉందని ఆమె సందేశం ఇస్తోంది. ఈ కాలపు యువత ఈ మాట ఆలకించాల్సిందే.


జయంతి చౌహాన్

ఆసక్తి లేని పని ఆమెకు వద్దట

ఇదంతా ఒక జానపద కథలాగే ఉంది.

పూర్వం ఎవరో ఒక రాజు తన రాజ్యం మొత్తాన్ని ఏకైక కుమార్తె చేతిలో పెడదామనుకుంటే 'నాకు వద్దు నాన్నా. నాకు హాయిగా సెలయేళ్ల మధ్య గడుపుతూ, చిత్రలేఖనం చేసుకుంటూ, పూ లతల మధ్య ఆడుకోవాలని ఉంది' అని ఆ కూతురు అంటే రాజు ఏమంటాడు? రాజ్యం ఏమవుతుంది?

'జల సామ్రాజ్యం' లేదా 'ఆక్వా కింగ్‌డమ్'గా అందరూ పిల్చుకునే 'బిస్లరీ' సంస్థకు ఇప్పుడు ఆ పరిస్థితే ఎదురైంది. దాని అధినేత రమేష్ చౌహాన్ తన సంస్థను అనివార్యంగా టాటాకు అప్పజెప్పనున్నాడు. రేపో మాపో ఇది జరగనుంది. 7000 కోట్లకు సంస్థ చేతులు మారుతుంది. పూర్తి మార్పుకు మరో రెండేళ్లు పడుతుంది. అంతవరకూ సంస్థ భారాన్ని 82 ఏళ్ల రమేష్ చౌహాన్ మోయక తప్పదు. కారణం ఏమిటి?

'నా ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంది. నా కుమార్తె జయంతికి సంస్థ పగ్గాలు స్వీకరించడంలో ఆసక్తి లేదు. సంస్థ అమ్మేయదల్చుకోవడం బాధాకరమే. కాని టాటా సంస్థకు విలువలు, విశ్వసనీయత ఉన్నాయి. అదైతే నా సంస్థను బాగా చూసుకుంటుందని భావిస్తున్నాను. వారి వైపే నా మనసు మొగ్గుతున్నది' అని రమేష్ చౌహాన్ అన్నాడు.

పార్లే బ్రదర్స్‌లో ఒకరైన రమేష్ చౌహాన్ 1993లో తన సొంత సాఫ్ట్‌డ్రింక్‌లైన థమ్సప్, సిట్రా, మాజా, గోల్డ్‌స్పాట్‌లను కోకాకోలాకు విక్రయించాడు. ఇప్పుడు ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బ్రాండ్ అయిన బిస్లరీని అమ్మేయబోతున్నాడు. కారణం కూతురు జయంతికి ఉన్న కళాత్మక ఆసక్తులే.

ఎవరు జయంతి?

జయంతి చౌహాన్ (37) రమేష్ చౌహాన్‌కు ఒక్కగానొక్క కూతురు. ఢిల్లీలో పుట్టి పెరిగింది. ఆ తర్వాత మొదట న్యూయార్క్‌లో, ఆ తర్వాత లండన్‌లో, ఆ పైన ఇటలీలో చదువుకుంది. ప్రాడక్ట్ డెవలప్‌మెంట్‌తో పాటు ఫ్యాషన్ స్టైలింగ్ కూడా చదువుకుంది. దాంతోపాటు లండన్‌లో 'స్కూల్ ఆఫ్ ఓరియెంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్' (లండన్ యూనివర్సిటీ) నుంచి అరబిక్ భాష నేర్చుకుంది. అరబిక్ భాష నేర్చుకోవడం ఒక భిన్న అభిరుచి అని చెప్పవచ్చు. ఆమెకు ఇదొక్కటే కాదు... ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. ప్రయాణాలు ఇష్టపడుతుంది. జంతు ప్రేమ ఉంది. అంత పెద్ద వ్యాపార సంస్థకు వారసురాలైనా చక్కగా ఒక ఆటో ఎక్కి రోడ్డు పక్కన బంతిపూలు కొనుక్కుంటూ కనిపిస్తుంది. ఆమెకు రంగులు అంటే ఇష్టం. మంచి బట్టలు ఇష్టం. భావుకత్వంతో జీవించడం ఇష్టం. అలా అని ఆమెకు వ్యాపార దక్షత లేదనుకుంటే పొరపాటు. చదువు పూర్తయిన వెంటనే 24 ఏళ్ల వయసులో సంస్థలో ప్రాథమిక స్థాయి నుంచి పని చేయడం మొదలుపెట్టింది. మొదట ఢిల్లీ కార్యాలయంలో చేసి ఆ తర్వాత ముంబై ఆఫీస్‌కు హెడ్ అయ్యింది. జయంతి చేరాక హెచ్.ఆర్, మార్కెటింగ్, సేల్స్‌లో సమూలమైన మార్పులు తెచ్చింది. పోటీదారుల దొరబాటును ఎదుర్కొనడానికి 'బ్లూ' కలర్ నుంచి బిస్లరీ రంగును 'ఆకుపచ్చ'కు మార్చింది. సంస్థలో ఆధునిక యాంత్రీకీకరణలో దూకుడు ప్రదర్శించింది. ఇప్పుడు సంస్థకు వైస్ ప్రెసిడెంట్‌గా ఉంది. ఇంత సాధించిన కుమార్తె సంస్థ పగ్గాలు చేపడుతుందని తండ్రి ఆశించడం సహజం. కాని జయంతి తనకు ఆసక్తి లేదని తేల్చి చెప్పింది. బహుశా ఆమె మనసు ఇందులో లేదు. ఆమెకు తృప్తినిచ్చే పని ఇది కాకపోవచ్చు. అందుకే ఆమె ఇంత సామ్రాజ్య కిరీటాన్ని వద్దనుకుంది.


● తండ్రి రమేష్ చౌహాన్‌తో...

మనకు ఏది ఇష్టం?

జయంతి నుంచి ఏం నేర్చుకోవచ్చు? ఏది మనసుకు బాగా నచ్చుతుందో ఆ పని చేయాలి. అందరికీ అన్నిసార్లు కుదరకపోవచ్చు. కాని కుదిరే అవకాశం వచ్చినప్పుడు తప్పక నిర్ణయం తీసుకోవాలి. చాలా మంది జీవితం గడిచిపోయాక 'నేను ఇది కాదు చేయాలనుకున్నది. నాకు అవకాశం కూడా వచ్చింది. కాని వేరే దారిలో వెళ్లిపోయాను. చాలా అసంతృప్తిగా ఉంది' అనడం వింటూ ఉంటాము. ఆ రియలైజేషన్ వచ్చేలోపు జీవితం గడిచిపోయి ఉంటుంది. అదే సమయంలో మన అభిరుచులు, ఆసక్తులు అన్ని వేళలా ఆర్థిక సమీకరణాలకు లొంగేలా ఉండకపోవచ్చు. అయినప్పటికీ కొంచెం ఎక్కువ తక్కువలు ఉన్నా జీవితం సంతోషంగా ఉంటుంది అనుకున్నప్పుడు సొంత మార్గం ఎంచుకోవడంలో తప్పు ఏముంది?

ఐ.టి. ఉద్యోగాన్ని వదులుకుని వ్యవసాయం చేసేవారు, ఐ.పి.ఎస్. ఉద్యోగాన్ని వదిలి సంఘసేవ చేసేవారు ఉన్నారు. ఒక స్పష్టతతోనే జయంతి బిస్లరీని వద్దనుకుని ఉంటుంది. ఆ స్పష్టత ఉంటే ఎవరైనా తమకు ఇష్టమైన రంగంలో పని చేస్తూ ఆనందకరమైన జీవితం గడపవచ్చు. డబ్బు వల్ల మాత్రమే ఆనందం లభించదని జయంతి చెబుతోంది కదా.

సైబర్ టాక్

ట్వీట్ చేస్తున్నారా?!


ప్రతీకాత్మక చిత్రం

ట్విటర్‌ని సాధారణంగా బ్రేకింగ్ న్యూస్‌లను త్వరగా వ్యాప్తి చేయడానికి ఉపయోగిస్తుంటారు. ఎందుకంటే ఇది సంప్రదాయ మీడియా ప్రసార అవుట్‌లెట్‌ల కంటే ఫాస్ట్‌గా ఉంటుంది. ఇక్కడ వ్యక్తులు ట్వీట్లు అని పిలువబడే చిన్న టెక్ట్స్‌ల ద్వారా కమ్యూనికేట్ చేస్తారు. ట్విటర్‌ను మైక్రోబ్లాగింగ్ సైట్ అని కూడా అంటారు. మెజారిటీ ట్వీటర్‌లు మైక్రోబ్లాగ్ చేస్తారు, ప్రపంచానికి తమను తాము వ్యక్తపరచడానికి దీనిని ఒక సాధనంగా ఉపయోగిస్తుంటారు. వారి ట్వీట్‌లను చదివే ఫాలోవర్స్‌తో ఎప్పుడూ కలిసి ఉంటారు.

కొత్త సినిమా ప్రసారాన్ని లేదా ప్రణాళికాబద్ధమైన వెబినార్‌కు ఉచిత కాంప్లిమెంటరీ ఇ పాస్‌ను అందించడం వంటి వేగవంతమైన, ఆకర్షణీయమైన ప్రకటనలను సృష్టించగల సామర్థ్యాన్ని ట్విటర్ మీకు అందిస్తుంది. ట్విటర్‌లో విసుగు కలిగించే అంశాలు చాలానే ఉన్నాయి, అదే సమయంలో ఉపయోగకరమైన వార్తలు, విజ్ఞానవంతమైన కంటెంట్ కూడా ఎంతో ఉంది.

ట్విటర్ స్పేస్

ఆడియోతో మీ సంభాషణలకు జీవం పోస్తోంది ట్విటర్ స్పేస్. 600 కంటే ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్న ట్విటర్ యూజర్ ఎవరైనా ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చు. వినియోగదారులు ఈ స్పేస్‌లో తమ చర్చలను హోస్ట్ చేయవచ్చు, ఇతర యూజర్లను చేరమని ఆహ్వానించవచ్చు. మీరు ఫాలో అయ్యే ఎవరైనా స్పేస్‌ను హోస్ట్ చేస్తున్నట్లయితే లేదా ఒకదానిలో స్పీకర్ అయితే, అది సంభాషణ వ్యవధిలో మీ టైమ్‌లైన్ ఎగువన పర్పుల్ బబుల్‌గా చూపబడుతుంది. ట్విటర్ స్పేస్‌లో యూజర్లు ఇప్పుడు వారు కోరుకున్నంత కాలం మాట్లాడగలరు. అయితే, దీనిని కూడా ఎవరికి వారు నియంత్రించవచ్చు.

ట్విటర్ సర్కిల్

ఈ సర్కిల్.. వ్యక్తులను ఎంపిక చేయడానికి, మీ ఆలోచనలను గ్రూప్‌తో పంచుకోవడానికి ట్వీట్‌లను పంపడానికి ఒక మార్గంలా పని చేస్తుంది. మీతో యాడ్ అయిన వ్యక్తులకు మాత్రమే సర్కిల్‌లో షేర్ చేసే ట్వీట్‌లకు రిప్లై ఇవ్వగలరు. ఇది మరిన్ని ప్రైవేట్ సంభాషణలను సులభతరం చేస్తుంది. ఎంచుకున్న అనుచరులతో సన్నిహిత సంబంధాలను ఏర్పరుస్తుంది. మీరు మీ సర్కిల్‌కి పంపే ట్వీట్‌లు ఆకుపచ్చ బ్యాడ్జ్‌తో కనిపిస్తాయి. మీరు మీ ట్విటర్ సర్కిల్‌లో గరిష్ఠంగా 150 మంది వ్యక్తులను చేర్చుకోవచ్చు.

కొన్ని ముఖ్యమైన చిట్కాలు

- ట్విటర్ అకౌంట్‌కి ప్రత్యేక అక్షరాలు, పెద్ద అక్షరాలు, సంఖ్యలను కలిగి ఉన్న బలమైన, సంక్లిష్టమైన పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేయాలి. సెట్టింగ్స్‌లో సీక్రెట్, అకౌంట్ భద్రత అనేవి సెట్ చేసుకోవాలి.
- మీ ట్వీట్‌లను మీ ఫాలోవర్లు మాత్రమే చూసేలా సెట్ చేసుకోవచ్చు. దీంట్లోనూ సెట్టింగ్, సీక్రెట్, సెక్యూరిటీ చూసుకోవాలి.
- లొకేషన్ డీయాక్టివేట్ చేయడం ద్వారా మీరు మీ ప్రస్తుత లొకేషన్‌ను ప్రసారం చేయకుండా ట్వీట్ లొకేషన్‌ను ఆపవచ్చు. దీనివల్ల మీరున్న ప్లేస్‌కు సంబంధించిన సమాచారం భద్రంగా ఉంటుంది.
- ఫొటో ట్యాగింగ్ పద్ధతిని కొనసాగించవచ్చు. అయితే, మిమ్మల్ని వేధించడానికి లేదా స్పామ్ చేయడానికి ఎవరైనా దీనిని ఉపయోగిస్తారని మీకు అనిపిస్తే ఫొటో ట్యాగింగ్ కూడా సెక్యూర్ చేసుకోవచ్చు.
- ప్రకటనలు, డేటా, ట్రాకింగ్ ద్వారా మీ గుర్తింపు, స్థలం, పరికరం ఆధారంగా రిలీజ్ అవుతుంటే వాటిని ఆఫ్ చేయవచ్చు.
- మీరు ఫాలో అవని వ్యక్తులు మీకు డైరెక్ట్ మెసేజ్ పంపలేరని నిర్ధారించుకోవడానికి మీ డైరెక్ట్ మెసేజింగ్‌ని స్విచ్ ఆఫ్ చేయడం లేదా ప్రత్యామ్నాయంగా 'షో రీడ్ రిసిప్ట్'ని కూడా ఆఫ్ చేయచ్చు.
- మీరు వర్డ్స్‌ని ఎంతసేపు మఫిల్ చేయాలనుకుంటున్నారో కూడా సెట్ చేసుకోవచ్చు. అందుకు.. 24 గంటలు, 7 రోజులు, 30 రోజులు లేదా ఎప్పటికీ అనేది ముందుగానే మ్యూట్ చేయవచ్చు.
- ఎవరైనా మిమ్మల్ని ఫాలోయింగ్ కోసం పదే పదే ట్యాగ్ చేస్తుంటే, మీరు సదరు వ్యక్తి ఖాతాను బ్లాక్ చేయవచ్చు.
- మీరు ట్వీట్‌లో సెన్సిటివ్‌గా అనిపించిన కంటెంట్‌ని సీక్రెట్‌గా ఉంచవచ్చు.
- మోడర్న్ ఫిల్టర్‌ల ద్వారా మీరు ఫాలో అవని వ్యక్తుల నుండి వచ్చే నోటిఫికేషన్‌లను మ్యూట్ చేయవచ్చు. మిమ్మల్ని ఫాలో అయినవారిలో కొత్త అకౌంట్ ఉన్నవారు, డిఫాల్ట్ ప్రొఫైల్ ఫొటో ఉన్నవారు, వారి ఇ-మెయిల్, ఫోన్ నంబర్‌ను ధ్రువీకరించని వారు ఉంటే.. అవన్నీ సెట్టింగ్‌లో సెక్యూరిటీ జాబితాలోకి చేర్చవచ్చు.



ముఖ్యమైన లింక్స్

- మీ అకౌంట్ హ్యాక్ అయితే https://help.twitter.com/en/safety-and-security,
- ప్రైవసీ భద్రతకు... https://help.twitter.com/en/safety-and-security/twitter-privacy-settings
- రూల్స్ వ్యతిరేకంగా ఉంటే... https://help.twitter.com/en/rules-and-policies/enforcement-philosophy, సమస్యను రిపోర్ట్ చేయడానికి.. https://help.twitter.com/en/safety-and-security/report-twitter-impersonation
- ఫ్రీ ఫాలోవర్ యాప్స్... https://help.twitter.com/en/safety-and-security/free-twitter-followers-policy
- వేధింపులు ఉంటే... https://help.twitter.com/en/safety-and-security/report-abusive-behavior
- జనరల్ గైడ్‌లైన్స్‌కి... https://help.twitter.com/en/rules-and-policies

లాగిన్ అయ్యి రిపోర్ట్ చేయవచ్చు.

తప్పుడు సమాచారంతో ఉంటే..

యూనివర్శిటీ ఆఫ్ వాషింగ్టన్, యూనివర్శిటీ ఆఫ్ మిషిగాన్ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్‌తో పాటు మరెంతో (తప్పుడు సమాచారం, ఆన్‌లైన్ మానిప్యులేషన్, వేధింపులు) అధ్యయనం చేసే అనేకమంది పండితులు, పరిశోధకుల సలహా మండలిని ట్విటర్ కలిగి ఉంది. పరిష్కారం కూడా అంతే వేగంగా అందుతుంది.



ఇన్‌పుట్స్:
అనిల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



యశస్వి, ఈశ్వరన్ సెంచరీలు

బంగ్లాదేశ్ 'ఎ' జట్టుతో కాక్స్ బజార్‌లో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' జట్టు 292 పరుగుల ఆధిక్యం అందుకుంది. మ్యాచ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 404 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (145 : 20 ఫోర్లు, 1 సిక్స్), అభిమన్యు ఈశ్వరన్ (142 : 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో చెలరేగారు. ప్రస్తుతం క్రీజ్‌లో తిలక్ వర్మ (26 బ్యాటింగ్), ఉపేంద్ర (27 బ్యాటింగ్) ఉన్నారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో జ్ఞాన దత్తు

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-15 బాలుర సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ కుర్రాడు తలశిల టంకర జ్ఞాన దత్తు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన మూడో రౌండ్‌లో జ్ఞాన దత్తు 21-3, 21-11తో సయ్ చియాయు (చైనీస్ తైపీ)పై గెలుపొందాడు. జ్ఞాన దత్తు హైదరాబాద్‌లోని చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు.



'అర్జున' సంబరం

- జాతీయ క్రీడా అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి
- 'ఖేల్ రత్న' అందుకున్న శరత్ కమల్
- 'అర్జున' స్వీకరించిన నిఖత్, శ్రీజ



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 'ఖేల్ రత్న' అవార్డు అందుకుంటున్న శరత్ కమల్

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక జాతీయ క్రీడా పురస్కారాల ప్రదాన కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము క్రీడాకారులు, శిక్షకులకు అవార్డులు అందజేశారు. దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' అవార్డును టేబుల్ టెన్నిస్ (టీటీ) స్టార్ ఆచంట శరత్ కమల్ అందుకున్నాడు. తమిళనాడుకు చెందిన 40 ఏళ్ల శరత్ కమల్ ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల సింగిల్స్, టీమ్, మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకాలు సహా ఐదు కామన్వెల్త్ క్రీడల్లో కలిపి మొత్తం 13 పతకాలు సాధించాడు. నాలుగుసార్లు ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన శరత్ ఆసియా చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్యాలు, ఆసియా క్రీడల్లో రెండు కాంస్యాలు సాధించాడు. ఈ ఏడాది 25 మందిని 'అర్జున అవార్డు' వరించింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రపంచ చాంపియన్ బాక్సర్ నిఖత్ జరీన్, టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి ఆకుల శ్రీజలు కూడా ఈ పురస్కారాన్ని రాష్ట్రపతి నుంచి అందుకున్నారు. ఈ జాబితాలో షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్...అథ్లెట్లు సీమా పూనియా, అవినాశ్ సాబ్లే, షూటర్ ఇలవెనిల్, చెస్ ప్లేయర్ ప్రజ్ఞానంద తదితరులు ఉన్నారు. తన కోచింగ్‌తో రోహిత్ శర్మ సహా పలువురు క్రికెటర్లను తీర్చిదిద్దిన దినేశ్ లాడ్‌కు 'ద్రోణాచార్య' అవార్డు లభించింది. అర్జున గెలుచుకున్న తెలంగాణ ప్లేయర్లు నిఖత్, శ్రీజలను రాష్ట్రపతి భవన్‌లో స్వయంగా కలిసి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో నిఖత్, శ్రీజ కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.



జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానోత్సవంలో తమ కుటుంబ సభ్యులతో అర్జున అవార్డు గ్రహీతలు నిఖత్ జరీన్, ఆకుల శ్రీజ

ఆరేళ్ల తర్వాత ఆసీస్‌పై గెలుపు

చివరి నిమిషంలో గోల్ చేసి భారత హాకీ జట్టును గెలిపించిన ఆకాశ్‌దీప్



ఆకాశ్‌దీప్

అడిలైడ్: ప్రపంచ నంబర్‌వన్, కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్ ఆస్ట్రేలియా పురుషుల హాకీ జట్టుపై భారత జట్టు ఆరేళ్ల విరామం తర్వాత తొలి విజయం నమోదు చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన భారత్... సిరీస్‌లో నిలబడాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. చివరకు 4-3 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియాపై గెలిచి సిరీస్‌లో ఆతిథ్య జట్టు ఆధిక్యాన్ని 1-2కి తగ్గించింది. నాలుగో మ్యాచ్ శనివారం జరుగుతుంది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (12వ ని.లో), అభిషేక్ (47వ ని.లో), షంషేర్ సింగ్ (57వ ని.లో), ఆకాశ్‌దీప్ సింగ్(60వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మ్యాచ్ చివరి నిమిషంలో ఆకాశ్‌దీప్ గోల్ చేసి భారత విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆస్ట్రేలియా తరఫున జాక్ వెల్చ్ (25వ ని.లో), ఆరాన్ జలెవ్‌స్కీ (32వ ని.లో), నాథన్ ఎఫ్‌రామస్ (59వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. నిర్ణీత సమయంలోపు ఫలితం తేలిన మ్యాచ్‌ల్లో భారత్ చివరిసారి 2016 నవంబర్ 29న ఆస్ట్రేలియాపై 3-2తో గెలిచింది. అనంతరం ఈ రెండు జట్ల మధ్య 13 మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో 10 సార్లు ఆసీస్ నిర్ణీత సమయంలోపు నెగ్గగా... నిర్ణీత సమయంలోపు మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిసి వర్గీకరణ పాయింట్ల కోసం పెనాల్టీ షూటౌట్ ద్వారా ఫలితం నిర్ణయించిన రెండు మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది. మరో మ్యాచ్ 1-1తో 'డ్రా'గా ముగిసింది.

ఇంగ్లండ్ అజేయంగా...

ఐదున్నర దశాబ్దాలుగా ఊరిస్తున్న రెండో ప్రపంచకప్ టైటిల్‌ను ఈసారైనా సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టు తొలి దశను సాఫీగా అధిగమించింది. కనీసం 'డ్రా' చేసుకుంటే నాకౌట్ దశకు అర్హత సాధించే అవకాశం ఉన్నా... ఈ మాజీ చాంపియన్ మాత్రం అదరగొట్టే ప్రదర్శనతో భారీ విజయం నమోదు చేసి గ్రూప్ దశను అజేయంగా ముగించి తమ గ్రూప్ 'బి'లో 'టాపర్'గా నిలిచింది.

- ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన మాజీ చాంపియన్
- చివరి లీగ్ మ్యాచ్‌లో 3-0తో వేల్స్‌పై విజయం
- రెండు గోల్స్‌తో మెరిసిన రాష్‌ఫోర్డ్



రాష్‌ఫోర్డ్

అల్ రయ్యాన్ (ఖతర్): ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన ఇంగ్లండ్ జట్టు ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో 13వసారి నాకౌట్ దశకు అర్హత సాధించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన గ్రూప్ 'బి' చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో 1966 విశ్వవిజేత ఇంగ్లండ్ 3-0 గోల్స్ తేడాతో వేల్స్ జట్టుపై ఘనవిజయం సాధించింది. ఇంగ్లండ్ తరఫున మార్కస్ రాష్‌ఫోర్డ్ (50వ, 68వ ని.లో) రెండు గోల్స్ చేయగా... ఫిల్ ఫోడెన్ (51వ ని.లో) ఒక గోల్ అందించాడు. 1958లో తొలిసారి ప్రపంచకప్‌లో పాల్గొని క్వార్టర్ ఫైనల్ చేరిన వేల్స్ 64 ఏళ్ల తర్వాత ఈ మెగా ఈవెంట్‌కు రెండోసారి అర్హత సాధించినా ఈసారి మాత్రం గ్రూప్ దశను దాటలేకపోయింది.

వేల్స్‌తో కనీసం 'డ్రా' చేసుకున్నా తదుపరి దశకు అర్హత పొందే అవకాశమున్నా ఇంగ్లండ్ మాత్రం విజయమే లక్ష్యంగా ఆడింది. అయితే వేల్స్ డిఫెండర్లు గట్టిగా నిలబడటంతో తొలి అర్ధ భాగంలో ఇంగ్లండ్ ఖాతా తెరువలేకపోయింది. పలువురు స్టార్ ఆటగాళ్లతో నిండిన ఇంగ్లండ్ రెండో అర్ధభాగంలో వ్యూహం మార్చి ఫలితం పొందింది. 18 నిమిషాల వ్యవధిలో ఏకంగా మూడు గోల్స్ సాధించి వేల్స్‌కు కోలుకునే అవకాశం ఇవ్వకుండా చేసింది. 50వ నిమిషంలో లభించిన ఫ్రీకిక్‌ను రాష్‌ఫోర్డ్ నేరుగా వేల్స్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. 2020 యూరో ఫైనల్లో ఇటలీపై పెనాల్టీ షూటౌట్‌లో తన షాట్‌ను గోల్‌గా మలచలేకపోయిన రాష్‌ఫోర్డ్‌కు గత రెండేళ్లుగా ఏదీ కలిసి రావడంలేదు. నల్ల జాతీయుడు కావడంతో స్వదేశంలో అతనిపై జాతి వివక్ష వ్యాఖ్యలు కూడా చేశారు. అయితే వేల్స్‌పై రాష్‌ఫోర్డ్ రెండు గోల్స్‌తో రాణించి మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. తొలి గోల్ అయ్యాక నిమిషం వ్యవధిలోనే ఇంగ్లండ్ ఖాతాలో రెండో గోల్ చేరింది. కెప్టెన్ హ్యారీ కేన్ క్రాస్ పాస్‌ను 'డి' ఏరియాలో అందుకున్న ఫిల్ ఫోడెన్ బంతిని లక్ష్యానికి చేర్చాడు. అనంతరం 68వ నిమిషంలో రాష్‌ఫోర్డ్ గోల్‌తో ఇంగ్లండ్ ఆధిక్యం 3-0కు పెరిగింది.

ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేసిన మూడో గోల్ ప్రపంచకప్ చరిత్రలో ఆ జట్టుకు 100వ గోల్ కావడం విశేషం. 92 ఏళ్ల ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో 100 గోల్స్ మైలురాయిని అందుకున్న ఏడో జట్టుగా ఇంగ్లండ్ గుర్తింపు పొందింది. 'బి' గ్రూప్ టాపర్‌గా నిలిచిన ఇంగ్లండ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సెనెగల్ జట్టుతో ఆడుతుంది.

అమెరికా ఆరోసారి...

గత ప్రపంచకప్‌నకు అర్హత పొందలేకపోయిన అమెరికా జట్టు ఈసారి మాత్రం గ్రూప్ దశను దాటి నాకౌట్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఇరాన్‌తో జరిగిన చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో అమెరికా 1-0తో గెలిచింది. ఆట 38వ నిమిషంలో క్రిస్టియన్ పులిసిక్ గోల్‌తో అమెరికా ఖాతా తెరిచింది. 11వసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న అమెరికా ఆరోసారి గ్రూప్ దశను అధిగమించింది. ప్రి క్వార్టర్స్‌లో నెదర్లాండ్స్‌తో అమెరికా తలపడుతుంది.

ఆస్ట్రేలియా 2006 తర్వాత...

గత మూడు ప్రపంచకప్‌లలో గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టిన ఆస్ట్రేలియా ఈసారి నాకౌట్ బెర్త్‌ను సంపాదించింది. బుధవారం జరిగిన గ్రూప్ 'డి' చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 1-0 గోల్‌తో డెన్మార్క్ జట్టును ఓడించింది. ఆట 60వ నిమిషంలో మాథ్యూ లెకీ ఆసీస్ జట్టుకు గోల్ అందించాడు. ఈ టోర్నీలో ఆస్ట్రేలియాకిది రెండో విజయం. దాంతో 2006 తర్వాత ఆస్ట్రేలియా ఈ మెగా ఈవెంట్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. రెండు విజయాలతో ఫ్రాన్స్, ఆస్ట్రేలియా ఆరు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచినా మెరుగైన గోల్స్ సగటు ఆధారంగా ఫ్రాన్స్ జట్టు గ్రూప్ 'డి' టాపర్‌గా నిలిచింది. ఆస్ట్రేలియాకు రెండో స్థానం ఖరారైంది.

ఫ్రాన్స్‌కు ట్యునీషియా షాక్



ఖాజ్రి

వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి అందరి కంటే ముందుగా ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్ సంపాదించిన డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్ జట్టుకు గ్రూప్ 'డి' చివరి లీగ్ మ్యాచ్‌లో అనూహ్య పరాజయం ఎదురైంది. ప్రపంచ 30వ ర్యాంకర్ ట్యునీషియా 1-0 గోల్‌తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఫ్రాన్స్ జట్టును ఓడించింది. అయితే ఈ గెలుపు ట్యునీషియాకు నాకౌట్ బెర్త్‌ను అందించలేకపోయింది. ఆట 58వ నిమిషంలో వాహిబి ఖాజ్రి గోల్‌తో ట్యునీషియా విజయాన్ని దక్కించుకుంది. స్టాపేజ్ సమయంలో (90+10వ ని.లో) ఫ్రాన్స్ గ్రీజ్‌మన్ కొట్టిన షాట్ ట్యునీషియా గోల్‌పోస్ట్‌లోనికి వెళ్లడంతో స్కోరు సమం అయింది. అయితే ట్యునీషియా రిఫరీ నిర్ణయాన్ని సమీక్షించడంతో రీప్లేలో ఫ్రాన్స్ గోల్ ఆఫ్‌సైడ్‌గా తేలింది. దాంతో రిఫరీ గోల్ ఇవ్వలేదు. ఫలితంగా 1971 తర్వాత ఫ్రాన్స్‌పై ట్యునీషియాకు రెండో విజయం దక్కింది.

ప్రపంచకప్‌లో నేడు

కెనడా X మొరాకో
రాత్రి గం. 8:30 నుంచి

బెల్జియం X క్రొయేషియా
రాత్రి గం. 8:30 నుంచి

జర్మనీ X కోస్టారికా
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పెయిన్ X జపాన్
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

గ్రూప్ 'బి' పాయింట్ల పట్టిక


దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	పా
ఇంగ్లండ్	3	2	1	0	9	2	7
అమెరికా	3	1	2	0	2	1	5
ఇరాన్	3	1	0	2	4	7	3
వేల్స్	3	0	1	2	1	6	1

గ్రూప్ 'డి' పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	పా
ఫ్రాన్స్	3	2	0	1	6	3	6
ఆస్ట్రేలియా	3	2	0	1	3	4	6
ట్యునీషియా	3	1	1	1	1	1	4
డెన్మార్క్	3	0	1	2	1	3	1

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, చే.గో–చేసిన గోల్స్, ఇ.గో–ఇచ్చిన గోల్స్, పా–పాయింట్లు

ఫైనల్లో మహారాష్ట్ర, సౌరాష్ట్ర



రుతురాజ్

అహ్మదాబాద్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో మహారాష్ట్ర, సౌరాష్ట్ర జట్లు ఫైనల్లోకి ప్రవేశించాయి. సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో మహారాష్ట్ర 12 పరుగుల తేడాతో అస్సాంపై, సౌరాష్ట్ర 5 వికెట్ల తేడాతో కర్ణాటకపై గెలిచాయి. ఫైనల్ శుక్రవారం జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మహారాష్ట్ర 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 350 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (126 బంతుల్లో 168; 18 ఫోర్లు, 6 సిక్స్‌లు) తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ మరో సెంచరీ సాధించగా, అంకిత్ బావ్నే (89 బంతుల్లో 110; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా శతకం బాదాడు. అనంతరం అస్సాం చివరి వరకు పోరాడి 50 ఓవర్లలో 8 వికెట్లకు 338 పరుగులు చేయగలిగింది. మరో సెమీస్‌లో ముందుగా కర్ణాటక 49.1 ఓవర్లలో 171 పరుగులకే కుప్ప కూలింది. జైదేవ్ ఉనాద్కట్ 26 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం సౌరాష్ట్ర 36.2 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసి గెలిచింది.

వానదే విజయం

12 బంతుల తేడాతో పరాజయం తప్పింది. మరో రెండు ఓవర్ల ఆట జరిగి ఉంటే సిరీస్ ఫలితం 0–2గా మారేది. అయితే వానతో ఆట ఆగిపోవడంతో భారత్‌కు మూడో వన్డేలో ఓటమి ఎదురు కాలేదు. చివరకు భారత్ 0–1తో సిరీస్ కోల్పోయింది. సొంతగడ్డపై దాదాపు మూడేళ్లుగా వన్డే సిరీస్ చేజార్చుకోని న్యూజిలాండ్ ఆ రికార్డును నిలబెట్టుకుంది.

- మూడో వన్డే కూడా అర్ధాంతరంగా రద్దు
- ఓటమిని తప్పించుకున్న భారత్
- వన్డే సిరీస్ 1–0తో కివీస్ సొంతం



వాషింగ్టన్ సుందర్



సిరీస్ ట్రోఫీతో విలియమ్సన్

క్రైస్ట్‌చర్చ్: భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడో వన్డే కూడా వర్షార్పణమైంది. చివరకు మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 47.3 ఓవర్లలో 219 పరుగులకే ఆలౌటైంది. వాషింగ్టన్ సుందర్ (64 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (59 బంతుల్లో 49; 8 ఫోర్లు) రాణించారు. అనంతరం న్యూజిలాండ్ 18 ఓవర్లలో వికెట్ నష్టానికి 104 పరుగులు చేసింది. ఫిన్ అలెన్ (54 బంతుల్లో 57; 8 ఫోర్లు, 1 సిక్స్), డెవాన్ కాన్వే (51 బంతుల్లో 38 నాటౌట్; 6 ఫోర్లు) తొలి వికెట్‌కు 97 పరుగులు జోడించి జట్టును సునాయాస విజయం దిశగా తీసుకెళ్లారు. అయితే 18 ఓవర్ల తర్వాత కురిసిన వర్షం ఆపై తెరిపినివ్వలేదు. ఆట ఆగిపోయే సమయానికి డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం కివీస్ ఏకంగా 50 పరుగులు ముందంజలో ఉంది. అయితే వన్డే నిబంధనల ప్రకారం రెండో ఇన్నింగ్స్‌లోనూ కనీసం 20 ఓవర్ల ఆట సాగితేనే ఫలితం తేలుతుంది. మిగతా రెండు ఓవర్ల కోసం ఎంత వేచి చూసినా వాన ఆగలేదు. దాంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. తొలి వన్డేలో కివీస్ గెలవగా, రెండో వన్డే కూడా రద్దయింది. అంతకుముందు టి20 సిరీస్‌లో కూడా భారత్ ఒక మ్యాచ్ నెగ్గగా, మరో మ్యాచ్ రద్దయింది. ఇంకో మ్యాచ్ కూడా వాన కారణంగానే 'టై'గా ముగిసి భారత్ 1-0తో సిరీస్ నెగ్గింది. ఈ పర్యటనలో ఆరు మ్యాచ్‌లలో నాలుగు వర్షం బారిన పడ్డాయి.

వర్షం కారణంగా ఆట పది నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఓపెనర్లు శిఖర్ ధావన్ (45 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) శుబ్‌మన్ గిల్ (22 బంతుల్లో 13; 2 ఫోర్లు) దూకుడుగా ఆడటంలో విఫలమయ్యారు. ఫలితంగా 10 ఓవర్ల పవర్‌ప్లేలో భారత్ 43 పరుగులే చేయగలిగింది. మరోవైపు తక్కువ వ్యవధిలో ధావన్, పంత్ (10), సూర్యకుమార్ (6) వెనుదిరగడంతో జట్టు కష్టాల్లో పడింది. ఆ తర్వాత శ్రేయస్ అర్ధ సెంచరీ చేజార్చుకోగా, దీపక్ హుడా (12) కూడా విఫలం కావడంతో స్కోరు 149/6కు చేరింది. ఈ దశలో స్కోరు 200 పరుగులు దాటడం కూడా కష్టమనిపించింది. అయితే సుందర్ స్ఫూర్తిదాయక బ్యాటింగ్‌తో జట్టు కోలుకుంది. స్వల్ప లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ ఓపెనర్లు అలెన్, కాన్వే ధాటిగా ఆడారు. ముఖ్యంగా చహర్ ఓవర్లో కాన్వే నాలుగు ఫోర్లు కొట్టడం హైలైట్‌గా నిలిచింది. ఇద్దరి జోరుతో 10 ఓవర్లలో స్కోరు 71 పరుగులకు చేరింది. ఈ క్రమంలో సుందర్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో 51 బంతుల్లోనే అలెన్ హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. ఎట్టకేలకు 17వ ఓవర్లో ఈ జోడీని ఉమ్రాన్ విడదీశాడు. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి అలెన్ వెనుదిరిగాడు. అయితే మరో 9 బంతులకే ఆట ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ ఇన్నింగ్స్: 219 ఆలౌట్ (47.3 ఓవర్లలో) (ధావన్ 28, శ్రేయస్ అయ్యర్ 49, వాషింగ్టన్ సుందర్ 51, మిల్నే 3/57, డరైల్ మిచెల్ 3/25, సౌతీ 2/36). **న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** 104/1 (18 ఓవర్లలో) (ఫిన్ అలెన్ 57, కాన్వే 38 నాటౌట్, ఉమ్రాన్ మాలిక్ 1/31).

రెండో స్థానంలోనే హంపి



కోల్‌కతా: టాటా స్టీల్ ఇండియా ర్యాపిడ్ చెస్ అంతర్జాతీయ టోర్నీ మహిళల విభాగంలో ఆరో రౌండ్ తర్వాత ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. బుధవారం మూడు గేమ్‌లు జరగ్గా హంపి ఒక విజయం నమోదు చేసి, రెండింటిని 'డ్రా'గా ముగించింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికతో జరిగిన నాలుగో గేమ్‌ను హంపి 36 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. సవితాశ్రీ (భారత్)తో జరిగిన ఐదో గేమ్‌లో హంపి 27 ఎత్తుల్లో నెగ్గింది. నానా జాగ్‌నిడ్జె (జార్జియా)తో జరిగిన ఆరో గేమ్‌ను హంపి 33 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. హారిక 3.5 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో ఉంది. గురువారం మరో మూడు రౌండ్‌లు జరుగుతాయి. ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 3.5 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. నాలుగో గేమ్‌లో సేతురామన్ (భారత్) చేతిలో 83 ఎత్తుల్లో ఓడిన అర్జున్... సో వెస్లీ (అమెరికా)తో జరిగిన ఐదో గేమ్‌ను 49 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఆరో గేమ్‌లో అర్జున్ 36 ఎత్తుల్లో షఖ్రియార్ (అజర్‌బైజాన్)పై గెలిచాడు.

లబుషేన్ సెంచరీ: ఆస్ట్రేలియా 293/2



లబుషేన్

పెర్త్: సొంతగడ్డపై వెస్టిండీస్‌తో బుధవారం ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజు ఆస్ట్రేలియా సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 293 పరుగులు సాధించింది. లబుషేన్ (270 బంతుల్లో 154 నాటౌట్; 16 ఫోర్లు, 1 సిక్స్) కెరీర్‌లో ఎనిమిదో సెంచరీ సాధించగా... ఉస్మాన్ ఖాజా (149 బంతుల్లో 65; 5 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (107 బంతుల్లో 59 నాటౌట్; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. డేవిడ్ వార్నర్ (5) ఒక్కడే విఫలమయ్యాడు. ఇప్పటికే లబుషేన్, స్మిత్ మూడో వికెట్‌కు అభేద్యంగా 142 పరుగులు జోడించారు. ఈ మ్యాచ్‌తో వెస్టిండీస్ దిగ్గజం శివ్‌నారాయణ్ చందర్‌పాల్ కుమారుడు తేజ్ నారాయణ్ చందర్‌పాల్ టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు.

సినిమా

విజువల్ ట్రీట్



రామ్‌చరణ్

న్యూజిలాండ్‌కి బై బై చెప్పారు రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. కియారా అద్వానీ హీరోయిన్. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవల న్యూజిలాండ్‌లో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో రామ్‌చరణ్, కియారాలపై బాస్కో మార్టిస్ కొరియోగ్రఫీలో ఓ సాంగ్ చిత్రీకరణ పూర్తి చేశారు. 'న్యూజిలాండ్‌లో సాంగ్ షూటింగ్ పూర్తయింది. అద్భుతమైన విజువల్స్ వచ్చాయి'' అని బుధవారం ట్వీట్ చేశారు రామ్‌చరణ్. కాగా ఈ పాట చిత్రీకరణకు దాదాపు రూ.15కోట్లు ఖర్చుచేశారట చిత్రయూనిట్. సో.. ఈ సాంగ్ ప్రేక్షకులకు విజువల్ ట్రీట్‌గా ఉండనుంది. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది చివర్లో విడుదలకానుంది.

గీతాంజలికి దగ్గరగా ఉంటుంది

\- చింతపల్లి రామారావు



''మనం ఇతరుల ప్రేమను పొందడమే కాదు.. మన ప్రేమను కూడా వారికి పంచాలి. విలువైన ప్రేమలు ఎలా ఉంటాయి? సమాజంలో మనం ఎలా నడుచుకోవాలి? వంటి అంశాలతో 'గుర్తుందా శీతాకాలం' కథనం ఉంటుంది'' అని నిర్మాత చింతపల్లి రామారావు అన్నారు. సత్యదేవ్, తమన్నా, కావ్య శెట్టి, మేఘా ఆకాష్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'గుర్తుందా శీతాకాలం'. నాగశేఖర్ దర్శకుడు. భావనా రవి, రామారావు చింతపల్లి, ఎమ్‌ఎస్ రెడ్డి, నాగశేఖర్, చినబాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా రామారావు చింతపల్లి మాట్లాడుతూ–''గుంటూరు జిల్లాలోని వినుకొండ నియోజకవర్గం మేళ్లవాగు నా స్వస్థలం. సినిమాలపై ఆసక్తితో డిస్ట్రిబ్యూటర్ సుబ్బరాడ్డిగారితో కలిసి 'ఆడు మగ్రాడ్రా బుజ్జీ' సినిమాకు అసోసియేట్ అయ్యాను. తమిళ్ డబ్బింగ్ సినిమాలు 'టెన్'(విక్రమ్), 'గజకేసరి'(ఆర్య) చిత్రాలు తెలుగులో రిలీజ్ చేశాను. నా తొలి స్ట్రయిట్ ఫిల్మ్ 'గుర్తుందా శీతాకాలం'. నాగార్జునగారి 'గీతాంజలి' సినిమాకు మా చిత్రం దగ్గరగా ఉంటుంది. ప్రస్తుతం కృష్ణవంశీగారి 'రంగ మార్తాండ' సినిమాకు ఫైనాన్షియల్‌గా అసోసియేట్ అయ్యాను. ఎన్టీఆర్ బామ్మర్ది నార్నె నితిన్‌తో 'శ్రీశ్రీశ్రీ రాజావారు' సినిమా చేస్తున్నా'' అన్నారు.



నిఖిల్, తలసాని శ్రీనివాస్, యష్ పూరి, స్టెఫీ పటేల్, వాకాడ అప్పారావ్, అరుణ్ భారతి

టాలీవుడ్‌కి యువత రావాలి

\- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

''తెలుగు చిత్ర పరిశ్రమకు యువత రావాల్సిన అవసరం ఉంది. బ్యాక్‌గ్రౌండ్‌తో పని లేకుండా ప్రతిభతో చరిత్ర సృష్టించే అవకాశం సినిమా పరిశ్రమలోనే ఉంటుంది'' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. యష్ పూరి, స్టెఫీ పటేల్ జంటగా అరుణ్ భారతి ఎల్.దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చెప్పాలని ఉంది'. ఆర్‌బీ చౌదరి సమర్పణలో వాకాడ అంజన్ కుమార్, యోగేష్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. అస్లాం కీ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో విడుదలకు తలసాని శ్రీనివాస్, హీరో నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''యష్ పూరి నాన్నగారు నా చిన్నప్పటి స్నేహితుడు. యువత చూడాల్సిన చిత్రం 'చెప్పాలని ఉంది'' అన్నారు తలసాని శ్రీనివాస్ యాదవ్. ''మన యూత్ సినిమా ఇది.. థియేటర్లో చూద్దాం'' అన్నారు నిఖిల్. ''అన్ని భాషల నటీనటులు, సాంకేతిక నిపుణులు పనిచేసిన ఈ చిత్రం ఒక విధంగా పాన్ ఇండియా ఫిలిం'' అన్నారు అరుణ్ భారతి. యష్ పూరి, స్టెఫీ పటేల్, సంగీత దర్శకుడు అస్లాం కీ, నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడారు.

యాక్షన్ థ్రిల్లర్



సత్యదేవ్

సత్యదేవ్, డాలీ ధనంజయ, సత్యరాజ్ ప్రధాన పాత్రల్లో ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో ఓ మూవీ తెరకెక్కుతోంది. ఎస్‌.ఎన్.రెడ్డి (పద్మజ ఫిల్మ్స్), బాల సుందరం–దినేష్ సుందరం (ఓల్డ్‌టౌన్ పిక్చర్స్) నిర్మిస్తున్న ఈ సినిమా రెండో షెడ్యూల్ జరుపుకుంటోంది. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ–''ఫైనాన్షియల్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రమిది. 2023 ఫిబ్రవరి మొదటివారంతో షూటింగ్ పూర్తవుతుంది. తెలుగు, కన్నడ, తమిళం, హిందీ, మలయాళం భాషల్లో వేసవిలో సినిమాని విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: సుమన్ ప్రసార బాగే, కెమెరా: మణికంఠన్ కృష్ణమాచారి.

సాక్షి బిజినెస్
గురువారం 1-12-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	418	140
	63,100	18,758

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తారెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,974	▽	11
డోజోన్స్	33,620	▽	233
ఎఫ్‌టీఎస్ఈ 100	7,537	▲	61
డాక్స్	14,397	▽	42
షాంఘై	3,152	▲	2
నికాయ్	27,969	▽	59

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	52,777 ▽	2
బంగారం (99.5 స్వచ్ఛత)	52,566 ▽	2
వెండి (కిలో)	61,900 ▲	215

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.89	85.56
€	యూరో	ఒకటి	83.06	86.08
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	96.21	99.50
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.54	59.81
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.58	55.90
S$	సింగపూర్ డాలర్	ఒకటి	58.57	60.49
SAR	సౌదీ రియాల్	పదింటికి	20.72	22.39
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.27	23.03
¥	చైనా యువాన్	పదింటికి	10.36	12.39

జీడీపీ వృద్ధి తగ్గింది, కానీ...

ఎకానమీ పరుగుకు ఢోకా లేదు!

- క్యూ2లో వృద్ధి రేటు 6.3 శాతం
- ఈ స్థాయి వృద్ధి సాధిస్తున్న ఏకైక దేశంగా భారత్
- 2021 సెప్టెంబర్ క్వార్టర్ కన్నా 2.1 శాతం తక్కువ
- 2022 జూన్ త్రైమాసికంలో వృద్ధితో పోల్చినా భారీ తగ్గుదల
- తయారీ, మైనింగ్ రంగాల క్షీణత



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో (2022–23, జూలై–సెప్టెంబర్) నెమ్మదించింది. 2021–22 ఇదే కాలంతో పోల్చితే జీడీపీ విలువ 6.3 శాతం పెరిగింది. తయారీ, మైనింగ్ రంగాల పేలవ పనితీరు ఇందుకు ఒక కారణం. కాగా, ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో (క్యూ1) జీడీపీ వృద్ధి రేటు 13.5 శాతం, గత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో వృద్ధి రేటు 8.4 శాతం కన్నా వృద్ధి వేగం (2.1 శాతం మేర) మందగించడం గమనార్హం. అయితే, ప్రపంచంలోనే వేగవంతమైన ఆర్థిక వ్యవస్థ హోదాను మాత్రం భారత్ కొనసాగిస్తోంది. జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో చైనా వృద్ధి రేటు 3.9 శాతం. భారత్ సాధించిన వృద్ధి రేటుకు మరే దేశమూ చేరుకోకపోవడం గమనార్హం. ఇక మొదటి, రెండు త్రైమాసికాలు కలిపి ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో జీడీపీ వృద్ధి రేటు 9.7%. రెండవ త్రైమాసికంలో 6.1–6.3 % వృద్ధి నమోదవుతుందన్న ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ అంచనాలకు అనుగుణంగానే బుధవారం విడుదల చేసిన గణాంకాలు ఉండడం గమనార్హం.

6.3 శాతం ఎలా అంటే..

2011–12 స్థిర ధరల ప్రాతిపదిక, వాస్తవిక జీడీపీ విలువ 2021–22 క్యూ2లో రూ.35.89 లక్షల కోట్లు. తాజా సమీక్షా త్రైమాసికంలో ఈ విలువ రూ.38.17 లక్షల కోట్లుగా నమోదయ్యింది. అంటే వృద్ధి 6.3 శాతమన్నమాట.

వివిధ రంగాల తీరిది..: స్థూల విలువ జోడింపు (గ్రాస్ వ్యాల్యూ యాడెడ్– జీవీఏ) ప్రాతిపదికన క్యూ2 వృద్ధి రేటు మాత్రం 5.6% పెరిగి రూ.35.05 లక్షల కోట్లుగా నమోదయ్యింది.

- **వ్యవసాయం:** ఆర్థిక వ్యవస్థలో 15% వాటా కలిగిన వ్యవసాయ రంగం వృద్ధి రేటు 4.6 శాతంగా ఉంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 3.2%.
- **తయారీ:** ఈ రంగం జీవీఏ మాత్రం 5.6 శాతం (2021 ఇదే కాలంలో) వృద్ధి నుంచి నుంచి 4.3 శాతం క్షీణతకు పడిపోయింది.
- **మైనింగ్:** ఈ విభాగం కూడా 2.8 శాతం క్షీణతను నమోదుచేసుకుంది. 2021 ఇదే కాలంలో ఈ రంగం వృద్ధి రేటు భారీగా 14.5 శాతంగా ఉంది.
- **నిర్మాణం:** వృద్ధి 8.1% నుంచి 6.6%కి తగ్గింది.
- **యుటిలిటీ సేవలు:** విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవల వృద్ధి రేటు 5.6 శాతానికి తగ్గింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ రేటు 8.5 శాతంగా నమోదైంది.
- **సేవలు:** మొత్తం జీడీపీలో మెజారిటీ వాటా కలిగిన ఈ విభాగం చూస్తే (ట్రేడ్, హోటల్, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్) వృద్ధి రేటు 9.6 శాతం నుంచి 14.7 శాతానికి చేరింది.

అక్టోబర్లో 20 నెలల కనిష్టానికి మౌలికం

అక్టోబర్‌లో ఎనిమిది పరిశ్రమలతో కూడిన మౌలిక రంగం వృద్ధి రేటు 20 నెలల కనిష్టానికి పడిపోయింది. గత ఏడాది ఇదే నెలతో పోల్చితే వృద్ధి కేవలం 0.1%గా నమోదయ్యింది. క్రూడ్ ఆయిల్, నేచురల్ గ్యాస్, రిఫైనరీ ప్రొడక్టులు, సిమెంట్ రంగాలు క్షీణతను నమోదు చేసుకున్నాయి. ఎరువుల రంగం మాత్రం 5.4% పురోగతి సాధించింది. బొగ్గు విభాగంలో 3.6%, స్టీల్ రంగంలో 4% వృద్ధి నమోదయితే, విద్యుత్ ఉత్పత్తి వృద్ధి కేవలం 0.4%గా నమోదయ్యింది.

7 శాతం వరకూ వృద్ధి



"2022–23 ఆర్థిక సంవత్సరంలో భారత్ 6.8 శాతం 7 శాతం శ్రేణి బాటలో ఉంది. పలు రంగాల్లో రికవరీ బాటన నడుస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. పండుగల సీజన్‌లో అమ్మకాలు, పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్, బ్యాంక్ రుణ వృద్ధి, ఆటో అమ్మకాల గణాంకాలు ఆశావహంగా ఉన్నాయి.

– వీ అనంత నాగేశ్వరన్, చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్

63 వేల శిఖరాన సెన్సెక్స్

18,750 పైకి నిఫ్టీ


- ఆఖరి గంటలో కొనుగోళ్ల మోత
- సూచీలకు ఏడోరోజూ లాభాలే
- ఇంట్రాడే, ముగింపులోనూ రికార్డులు

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో బుల్ పరుగు ఆగడం లేదు. జాతీయ, అంతర్జాతీయ అంశాలు కలిసి రావడంతో బుధవారం సెన్సెక్స్, నిఫ్టీలు తాజా జీవితకాల గరిష్టాలకు చేరాయి. ఉదయం సూచీలు ఫ్లాట్‌గా ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లు మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో రోజంతా స్థిరంగా ముందుకు కదిలాయి. ముఖ్యంగా చివరి గంటలో కొనుగోళ్ల మోత మోగింది. దీంతో వరుసగా ఏడో రోజూ లాభాలను ఆర్జించడమే కాకుండా ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డులను నెలకొల్పాయి. సెన్సెక్స్ ఓ దశలో 621 పాయింట్లు పెరిగి 63,303 వద్ద ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకింది. చివరకు 418 పాయింట్లు బలపడి 63,100 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 198 పాయింట్లు ఆర్జించి 18,816 వద్ద జీవిత గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 140 పాయింట్ల లాభంతో 18,758 వద్ద నిలిచింది.

ఏడురోజులు... రూ.7.59 లక్షల కోట్లు

బెంచ్‌మార్క్ సూచీలతో పాటు ఇన్వెస్టర్లు సంపద కూడా జీవితకాల గరిష్టానికి చేరుకుంది. సెన్సెక్స్ ఏడు రోజుల్లో 1,955 పాయింట్లు లాభపడంతో స్టాక్ మార్కెట్లో మొత్తం రూ.7.59 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఆల్‌టైం హై స్థాయి రూ.288 లక్షల కోట్లకు చేరింది.

- చివరిరోజు నాటికి ధర్మజ్ క్రాప్ ఐపీవోకు 35.49 రెట్ల అధిక స్పందన లభించింది.



రూపాయి.. 2 వారాల గరిష్టం

డాలర్ మారకంలో రూపాయి విలువ బుధవారం రెండు వారాల గరిష్ట స్థాయికి ఎగసింది. ఫారెక్స్ మార్కెట్‌లో 41 పైసలు లాభపడి 81.41 వద్ద ముగిసింది. దేశీయ మార్కెట్లోకి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రవాహం పెరగడం రూపాయి సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయని నిపుణులు తెలిపారు.

విక్రమ్ కిర్లోస్కర్ అకాల మరణం

- గుండెపోటుతో కన్నుమూసిన పారిశ్రామికవేత్త
- ఆటోమొబైల్ పరిశ్రమ వృద్ధిలో ముఖ్యపాత్ర



బెంగళూరు/న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త, టయోటా కిర్లోస్కర్ వైస్ చైర్మన్ విక్రమ్ ఎస్ కిర్లోస్కర్ (64) గుండెపోటుతో మంగళవారం బెంగళూరులో అకాల మరణం చెందారు. బుధవారం మధ్యాహ్నం హెబ్బల్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు ముగిశాయి. ఆయనకు భార్య గీతాంజలి కిర్లోస్కర్, కుమార్తె మానసి కిర్లోస్కర్ ఉన్నారు. విక్రమ్ కిర్లోస్కర్ మృతితో తాము తీవ్ర విషాదంలో మునిగిపోయినట్టు టయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రకటన విడుదల చేసింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలంటూ ప్రార్థించాలని కోరింది. టయోటా కారును భారత్‌కు తీసుకురావడం వెనుక విక్రమ్ పాత్ర ఎంతో ఉందని చెప్పుకోవాలి. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విక్రమ్ మెకానికల్ ఇంజనీరింగ్ చదివారు. జపాన్‌కు చెందిన టయోటాతో కలసి 'టయోటా కిర్లోస్కర్ మోటార్' జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు ఆయన వల్లే సాకారం అయింది. ఈ కంపెనీ 1997లో బిడది వద్ద 3.10 లక్షల యూనిట్ల వార్షిక ఉత్పాదక సామర్థ్యంతో కార్యకలాపాలు మొదలు పెట్టింది.

ప్రముఖుల సంతాపం..

విక్రమ్ కిర్లోస్కర్ మృతి పట్ల కర్ణాటక సీఎం బొమ్మై, కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, బయోకాన్ చైర్ పర్సన్ కిరణ్ మజుందార్‌షా సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. విక్రమ్ విషాదకర మృతి ఆటో పరిశ్రమ మొత్తాన్ని షాక్‌నకు, తీవ్ర విచారానికి గురి చేసిందని సియామ్ ప్రెసిడెంట్ వినోద్ అగర్వాల్ అన్నారు. సీఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ బజాజ్ సైతం విక్రమ్ మరణం తనకు వ్యక్తిగతంగా, పరిశ్రమకు ఎంతో నష్టమని తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

01-12-2022	
విశాఖ	540–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	531–00
విజయవాడ	531–00
రిటైల్ ధర (డజను)	78.00
30-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	541–00
వరంగల్	543–00
రిటైల్ ధర	6.00

ఆర్ఆర్‌పీఆర్‌కు ప్రణయ్, రాధికా రాయ్ రాజీనామా



న్యూఢిల్లీ: మీడియా సంస్థ ఎన్‌డీటీవీని అదానీ గ్రూప్ టేకోవర్ చేయడం దగ్గరపడుతున్న నేపథ్యంలో కొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్‌డీటీవీ ప్రమోటర్ గ్రూప్ సంస్థ ఆర్ఆర్‌పీఆర్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వ్యవస్థాపకులు ప్రణయ్ రాయ్, ఆయన భార్య రాధికా రాయ్ తప్పుకున్నారు. డైరెక్టర్ల పదవులకు రాజీనామా చేశారు. అయితే, న్యూస్ చానల్ బోర్డ్ నుండి మాత్రం తప్పుకోలేదు. వారిద్దరి రాజీనామా తర్వాత డైరెక్టర్లుగా అదానీ గ్రూప్ నామినీలైన సుదీప్తా భట్టాచార్య, సంజయ్ పుగాలియా, సెంథిల్ సినియా చెంగల్వరాయన్‌ల నియామకాలను ఆర్ఆర్‌పీఆర్ హోల్డింగ్ ఆమోదించింది. ఇవి తక్షణం అమల్లోకి వచ్చినట్లు ఎన్‌డీటీవీ తెలిపింది. అయితే, ప్రమోటర్ల హోదాలో ఎన్‌డీటీవీలో ప్రణయ్, రాధికా రాయ్‌లకు ఇప్పటికీ 32.26% వాటాలు ఉన్నాయి. ఎన్‌డీటీవీకి ప్రణయ్ రాయ్ చైర్‌పర్సన్‌గాను, రాధికా రాయ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగాను ఉన్నారు. ఆర్ఆర్‌పీఆర్‌కు రూ. 400 కోట్లు రుణాలిచ్చిన వీసీపీఎల్ (విశ్వప్రధాన్ కమర్షియల్)ను కొనుగోలు చేయడం ద్వారా అదానీ గ్రూప్.. ఎన్‌డీటీవీలో 29.18% వాటాలను దక్కించుకుంది. ఆ తర్వాత మరో 26% వాటాల కొనుగోలు కోసం ఓపెన్ ఆఫర్ ప్రకటించింది.

ఐఎంసీ అడ్వర్టైజింగ్, త్రీపర్సెంట్ కలెక్టివ్‌ల మధ్య ఒప్పందం

కోజికోడ్: ప్రకటనల విభాగంలో కలిసి పనిచేసేందుకు కేరళకు చెందిన ఐఎంసీ అడ్వర్టైజింగ్, బెంగళూరు ఆధారిత త్రీపర్సెంట్ కలెక్టివ్ సంస్థలు పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నాయి. దేశవ్యాప్తంగా వ్యాపార విస్తరణ, క్లయింట్ల బేస్‌ను పెంచుకునేందుకు ఈ అంగీకారం దోహదపడుతుందని ఇరుసంస్థలు ఆశిస్తున్నాయి. ఇందులో ఐఎంసీ అడ్వర్టైజింగ్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, మలబార్ డెవలపర్స్, ఈహామ్ డిజిటల్‌తో పాటు ఇతర కంపెనీలకు సేవలు అందిస్తుంది.

భవిత

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాల ప్రత్యేకం-2022
ప్రముఖ సబ్జెక్ట్ నిపుణులు ప్రిపేర్ చేసిన 'తెలంగాణ హిస్టరీ ప్రాక్టీస్ టెస్టులు'

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్‌పీఎస్సీ, హైదరాబాద్‌లో 25 పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. రాష్ట్రంలోని భూగర్భజల విభాగంలో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 25
» పోస్టుల వివరాలు: టెక్నికల్ అసిస్టెంట్–07, టెక్నికల్ అసిస్టెంట్–13, ల్యాబ్ అసిస్టెంట్–01, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్–04.
» అర్హత: పోస్టును అనుసరించి బీఈ/డిగ్రీ/బీఎస్సీ/మాస్టర్స్ డిగ్రీ/ఎంఎస్సీ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయో సడలింపు లభిస్తుంది.
» వేతనం: నెలకు రూ.51,320 నుంచి రూ.96,890 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 07.12.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 28.12.2022
» వెబ్‌సైట్: https://www.tspsc.gov.in

టీఎస్‌పీఎస్సీలో 32 ఉద్యోగాలు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 32
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ హైడ్రోమెట్రోలాజిస్ట్–01, అసిస్టెంట్ కెమిస్ట్–04, అసిస్టెంట్ జియోఫిజిసిస్ట్–06, అసిస్టెంట్ హైడ్రోజియాలజిస్ట్–16, అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్–05.
» అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ/ఎంఎస్సీ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
వయసు: 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయో సడలింపు లభిస్తుంది.
» వేతనం: నెలకు రూ.45,960 నుంచి రూ.1,33,630 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రిక్రూట్‌మెంట్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 06.12.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 27.12.2022
» వెబ్‌సైట్: https://www.tspsc.gov.in

యూపీఎస్సీలో 43 ఖాళీలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 43
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ మార్కెటింగ్ అడ్వైజర్, సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్, స్పెషలిస్ట్, జూనియర్ మైనింగ్ జియోలజిస్ట్, కెమిస్ట్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ/ఎంబీబీఎస్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
వయసు: 30 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» పని అనుభవం: కనీసం 1 నుంచి 3 ఏళ్లు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.12.2022
» వెబ్‌సైట్: www.upsc.gov.in

గుంటూరు జిల్లాలో 49 బ్యాక్‌లాగ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వికలాంగుల సంక్షేమ శాఖ, ఉమ్మడి గుంటూరు జిల్లా.. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి విభిన్న ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 49
» పోస్టుల వివరాలు: జూనియర్ అసిస్టెంట్, మెటర్నిటీ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ గ్రేడ్2, బోర్‌వెల్ ఆపరేటర్, వాచ్‌మెన్, కుక్, స్వీపర్, యుటెన్సిల్ క్లీనర్, బేరర్.
» అర్హత: పోస్టును అనుసరించి స్థానిక భాష చదవడం, రాయడం, ఐదో తరగతి, ఏడో తరగతి, పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, ఎంపీహెచ్‌ఏ, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 06.12.2022
» వెబ్‌సైట్: www.gunturap.in

ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్శిటీలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ (రాజేంద్రనగర్, సైఫాబాద్), జగిత్యాల, సంగారెడ్డిలోని వ్యవసాయ కళాశాలల్లో మాస్టర్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» ఎంఎస్సీ(అగ్రికల్చర్)–111 సీట్లు; ఎంబీఏ(అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్)–16 సీట్లు; ఎంటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)–06; ఎంఎస్సీ(కమ్యూనిటీ సైన్స్)–17.
» అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 40ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ఐసీఏఆర్–ఏఐఈఈఏ(పీజీ) 2022 స్కోరు, తదితరాల ఆధారంగా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 03.12.2022
» వెబ్‌సైట్: pjtsau.edu.in

పింక్ స్లిప్‌ల కాలం.. ఉద్యోగ సాధన ఇలా..

జాబ్ ట్రెండ్స్



» అంతర్జాతీయంగా ఐటీ రంగంలో లక్షన్నర మంది తొలగింపు
» ఆర్థిక మాంద్యం, పనితీరు ప్రాతిపదికగా లే ఆఫ్స్
» నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలంటున్న నిపుణులు

సాఫ్ట్‌వేర్ రంగంలో.. మరోసారి సంక్షోభం! 2008 తర్వాత.. దాదాపు ఆ స్థాయిలో.. మాంద్యం పరిస్థితులు! అగ్రరాజ్యం అమెరికా కేంద్రంగా.. కార్యకలాపాలు నిర్వహిస్తున్న దిగ్గజ ఐటీ సంస్థల ఆదాయాల్లో తిరోగమనం! పర్యవసానం.. భారీ సంఖ్యలో కొలువుల కోతలను ప్రారంభించిన సంస్థలు!! మూడు నెలలుగా సంకేతాలు ఇస్తున్న సంస్థలు.. తాజాగా దశల వారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ లే అఫ్స్ ఎక్కువగా భారతీయులపై ప్రభావం చూపుతోందన్న వార్తల నేపథ్యంలో.. ఐటీ రంగంలో ఉద్యోగుల తొలగింపు, తక్షణ కర్తవ్యం ఏమిటి, భవితకు భరోసా ఇచ్చే నైపుణ్యాలపై దృష్టి పెట్టడం ఎలా.. తదితర వివరాలతో సమగ్ర కథనం..

అమెరికాలో ఆర్థిక మాంద్యం సంకేతాల ప్రభావం జాబ్ మార్కెట్‌పై పడింది. ప్రముఖ ఐటీ కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. దీంతో హెచ్–1బీ వీసాపై యూఎస్‌లోని సంస్థల్లో పని చేస్తున్న మన దేశ ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. కారణం.. వారు ఉద్యోగం కోల్పోయిన 60 రోజుల లోపు కొత్త ఉద్యోగం దక్కించుకోకుంటే.. స్వదేశానికి తిరిగొచ్చేయాల్సి ఉంటుంది.

ఫాంగ్ మొదలు స్టార్టప్స్ వరకు

ఫాంగ్ (ఎఫ్ఏఏఎన్‌జీ) సంస్థలుగా గుర్తింపు పొందిన ఫేస్‌బుక్, అమెజాన్, యాపిల్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్ మొదలు వందల సంఖ్యలోని స్టార్టప్ సంస్థల వరకూ.. ఐటీ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ మొదలైంది. ఫేస్‌బుక్‌లో 11 వేలు, అమెజాన్‌లో పది వేలు, గూగుల్‌లో పది వేలు, నెట్‌ఫ్లిక్స్ సంస్థలో మొత్తం ఉద్యోగుల్లో 4 శాతం మేరకు కొలువుల కోతలు ప్రారంభమయ్యాయి. ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ కూడా ఇదే బాటలో నడుస్తోంది. చైనాలో కోవిడ్ ఆంక్షలు, ఐఫోన్14 ప్రో తయారీలో ఇబ్బందులు తదితర కారణాలతో రాబడులు తగ్గడంతో యాపిల్ సంస్థ లేఆఫ్స్‌కు సిద్ధమైనట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక స్పష్టం చేసింది.

మైక్రోబ్లాగింగ్ వేదిక ట్విటర్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎలాన్ మస్క్ చేతిలోకి రాగానే భారీ సంఖ్యలో ఉద్యోగాల కోత పడింది. ట్విటర్ ఇండియా ఆఫీస్‌లో 90 శాతం మంది తొలగింపునకు గురయ్యారు. వీటితోపాటు ఇంటెల్ సంస్థలో రానున్న రెండేళ్లలో దశల వారీగా 20 వేల ఉద్యోగాలు, హెచ్‌పీలో ఆరు వేల మంది, సిస్కోలో నాలుగు వేల మందికిపైగా తొలగించనున్నట్లు తెలుస్తోంది. ఐటీ రంగ సంస్థల్లోనే కాకుండా.. సర్వీసెస్ విభాగంగా పరిగణించే ఉబెర్, జొమాటో, బుకింగ్ డాట్ కామ్, బైజూస్, గ్రూప్ ఆన్ తదితర కంపెనీల్లో కూడా కోతలు మొదలయ్యాయి.

మాంద్యం.. ముందు జాగ్రత్త

ప్రస్తుతం సంస్థలు ఉద్యోగులను తొలగించడానికి రానున్న కొద్ది నెలల్లో అమెరికాలో ఆర్థిక మాంద్యం ఏర్పడుతుందనే సంకేతాలే ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఇది వాస్తవ పరిస్థితుల్లో ఇప్పటికే ఆయా సంస్థల ఆర్థిక రాబడుల్లో ప్రతిబింబించింది. దాదాపు అన్ని సంస్థల రెండో త్రైమాసిక ఫలితాల్లో నికర ఆదాయం తగ్గింది. దీంతో.. సదరు సంస్థలు వ్యయ నియంత్రణలో భాగంగా, ముందు జాగ్రత్త చర్యగా.. మానవ వనరులపై చేసే వ్యయాలను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఉద్యోగులను తొలగిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇప్పుడేం చేయాలి

ఇప్పటికే దాదాపు లక్షన్నర మంది వరకు ఉద్యోగాలు కోల్పోయారు. ఇలాంటి వారు 'ఇప్పుడేం చేయాలి?' అనే ప్రశ్న ఎదురవుతుంది. సంస్థలు.. పనితీరు, సామర్థ్యం ఆధారంగా తొలగిస్తున్నాం అని చెబుతుండటంతో.. ఉద్యోగాలు కోల్పోయిన వారు 'తమ పనితీరు బాగా లేదా' అనే ఆవేదనకు గురవుతున్నారు. అదే విధంగా.. కొత్త రిక్రూట్‌మెంట్‌లపైనా సంస్థలు కొంత కాలం నిషేధం విధించే అవకాశముంది. దీంతో తమ పరిస్థితి ఏంటి? అని చాలామంది ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగాలు కోల్పోయిన వారు ఆందోళన చెందకుండా.. ప్రత్యామ్నాయ అవకాశాలను అన్వేషించాలి. ఫ్రెషర్స్, మిడిల్ లెవెల్ ఎగ్జిక్యూటివ్స్ తమ ప్రొఫైల్‌కు అనుగుణంగా స్కిల్స్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

స్కిల్ గ్యాప్ తగ్గించుకోవడమే

ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోయిన వారు తక్షణం తమ స్కిల్ గ్యాప్‌ను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకు ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సైట్స్‌ను ఆసరగా తీసుకోవాలి. అందులోని జాబ్ లిస్టింగ్స్‌లో పేర్కొన్న డిమాండింగ్ స్కిల్స్‌ను పరిశీలించాలి. తమ అర్హతలకు అనుగుణంగా మెరుగుపరచుకోవాల్సిన నైపుణ్యాలపై స్పష్టత తెచ్చుకోవాలి. ఉదాహరణకు లింక్డ్‌ఇన్ జాబ్ పోస్టింగ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. మీరు పోస్ట్ చేసిన రెజ్యూమే ఆధారంగా మీ డొమైన్‌కు సంబంధించి కొత్త జాబ్ పోస్టింగ్‌ను తెలియజేయడంతోపాటు.. మీరు పెంచుకోవాల్సిన స్కిల్స్ ఏంటి అనే విషయాన్ని గురించి కూడా వివరించేలా ఉంటుంది. దీంతో మీరు ఇంకా పెంచుకోవాల్సిన స్కిల్స్‌ను స్పష్టంగా తెలుసుకునే వీలుంటుంది. ఇలా స్పష్టత తెచ్చుకున్నాక..సదరు నూతన నైపుణ్యాల సాధనకు కృషి చేయాలి. లింక్డ్‌ఇన్‌తో పాటు షైన్‌డాట్ కామ్, మాన్‌స్టర్ ఇండియా, నౌకరీ డాట్ కామ్ వంటి వాటి ద్వారా మీ డొమైన్, జాబ్ ప్రొఫైల్‌కు అనుగుణంగా అవసరమవుతున్న స్కిల్స్ గురించి తెలుసుకొని.. వాటిపై పట్టు సాధించాలి.

స్పెషలైజ్డ్ నైపుణ్యాలు

స్కిల్ గ్యాప్‌ను తగ్గించుకుని కొత్త ఉద్యోగాల వేటలో ముందంజలో నిలిచేందుకు వీలుగా స్పెషలైజ్డ్ నైపుణ్యాలు సొంతం చేసుకునే దిశగా అడుగులు వేయాలి. మీ అకడమిక్ డొమైన్‌కు సరితూగే ప్రత్యేక స్కిల్స్‌పై పట్టు సాధించాలి. ఉదాహరణకు మీరు ఐటీ విభాగంలో ఉంటే.. కొత్తగా ఆటోమేషన్ స్కిల్స్‌ను పెంచుకోవడానికి కృషి చేయాలి. అదే విధంగా మీరు సంప్రదాయ డిగ్రీ నేపథ్యం గల వారైతే.. ఇప్పటివరకు చేసిన ఉద్యోగానికి సంబంధించి కొత్తగా వచ్చిన నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి. డేటాసైన్స్, ఈఆర్‌పీ సొల్యూషన్స్ వంటి కోర్సులు ఎంతో ఉపయోగపడతాయి.

సర్టిఫికేషన్స్‌పై దృష్టి

ప్రస్తుత పరిస్థితుల్లో ఆయా విభాగాల్లో సర్టిఫికేషన్స్ పూర్తి చేయడం కూడా ఉద్యోగాన్వేషణలో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌గా జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఏఐ–ఎంఎల్, రోబోటిక్స్, ఐఓటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి వాటిపై ఆన్‌లైన్ సర్టిఫికేషన్స్ అందుబాటులోకి వచ్చాయి. వీటిని రెండు నెలలలోపు పూర్తి చేసుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన 5జీ టెక్నాలజీస్‌పైనా దృష్టి పెడితే అవకాశాలు మరింత విస్తృతమవుతాయి. ముఖ్యంగా కోడింగ్, ప్రోగ్రామింగ్, ఇండస్ట్రీ 4.0 వంటి ఐటీ స్కిల్స్‌పై మైక్రోసాఫ్ట్, ఐబీఎం, గూగుల్, హెచ్‌పీ, ఏడబ్ల్యూఎస్, సిస్కో, వీఎంవేర్, ఒరాకిల్ వంటి పలు సాఫ్ట్‌వేర్ సంస్థలు నేరుగా ఆన్‌లైన్ విధానంలో సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాయి.

ఖాళీగా ఉండకుండా

ఉద్యోగం కోల్పోయిన వారు ఎక్కువ రోజులు ఖాళీగా ఉండటం సరికాదు. తమ అర్హతలకు సరితూగే ఫ్రీలాన్సింగ్, ఆన్‌లైన్ జాబ్స్ అవకాశాలను అన్వేషించి.. వాటిని సొంతం చేసుకునేలా అడుగులు వేయాలి. పలు జాబ్ పోర్టల్స్, సంస్థల వెబ్‌సైట్స్‌లో ఈ అవకాశాల వివరాలు తెలుసుకోవచ్చు. సంస్థ, వేతనాల గురించి ఎక్కువగా పట్టించుకోకుండా కొలువులో చేరి.. మెరుగైన అవకాశం లభించే దాకా కొనసాగాలి. కొన్ని సందర్భాల్లో చిన్నపాటి స్టార్టప్ సంస్థల్లో పొందిన అనుభవమే భవిష్యత్తులో మంచి సంస్థల్లో అవకాశాలు అందిపుచ్చుకునేందుకు దోహదం చేస్తుందని గుర్తించాలి.

మిడ్ లెవల్ ఎగ్జిక్యూటివ్స్

12 నుంచి 15ఏళ్ల అనుభవమున్న వారిని మిడ్ లెవల్, సీనియర్ లెవల్ ఉద్యోగులుగా పరిగణిస్తారు. వారిని కూడా సంస్థలు తొలగిస్తున్నాయంటే.. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నాలెడ్జ్ అప్‌డేట్ చేసుకోకపోవడం కూడా ఒక కారణమై ఉంటుందనే వాదన వినిపిస్తోంది. ఇలాంటి సీనియర్ ఉద్యోగులు తాము ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన విభాగాలు, వాటికి సంబంధించి మార్కెట్‌లో ఆవిష్కృతమవుతున్న కొత్త నైపుణ్యాలను తెలుసుకుని.. వాటిని సొంతం చేసుకునే దిశగా అడుగులు వేయాలి.

సోషల్ నెట్‌వర్కింగ్

ఉద్యోగాలు కోల్పోయిన వారు.. నూతన ఉద్యోగ సాధనలో భాగంగా..సోషల్ నెట్‌వర్కింగ్‌ను విస్తృతంగా వినియోగించుకోవాలి. సదరు నెట్‌వర్కింగ్ ద్వారా ఆయా రంగాల్లోని నిపుణులతో సంప్రదింపులు చేయాలి. ఇప్పటి వరకు తమ ఉద్యోగ జీవితంలో సాధించిన విజయాలు, అవి సంస్థ అభివృద్ధికి తోడ్పడిన తీరు వంటి వాటిని వారిని మెప్పించే రీతిలో వివరించాలి. కొత్త ఉద్యోగాలకు తమను సిఫార్సు చేసే విధంగా ఆయా రంగాల్లోని నిపుణులను ఒప్పించాలి.

సాఫ్ట్ స్కిల్స్

ప్రస్తుతం పనితీరు ఆధారంగా తొలగింపులు అని ప్రకటిస్తున్న సంస్థలు.. ఉద్యోగుల్లోని సాఫ్ట్‌స్కిల్స్‌ను కూడా మదింపు చేస్తున్నాయి. కాబట్టి సాఫ్ట్ స్కిల్స్‌లో కీలకంగా భావించే కమ్యూనికేషన్ స్కిల్స్, బిహేవియరల్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ వంటి నైపుణ్యాలు పెంచుకునే దిశగా అడుగులు వేయాలి. అదే విధంగా వీలైతే తమను తొలగించడానికి గల నిర్దిష్ట కారణాన్ని తమ టీమ్ హెడ్ లేదా ప్రాజెక్ట్ హెడ్ ద్వారా తెలుసుకుని లోపాలను అధిగమించే ప్రయత్నం చేయాలి.

ఆత్మ విశ్వాసం

ఉద్యోగ తొలగింపునకు గురైనవారు ఆత్మ విశ్వాసాన్ని కోల్పోకుండా ధైర్యంగా ఉండాలి. ఆందోళన నుంచి బయటపడాలి. సాధించగలమనే మనోధైర్యంతో కొత్త అవకాశాలను దక్కించుకోవాలి.

క్లుప్తంగా

నర్సింగ్ డిగ్రీకి వెబ్ ఆప్షన్ల స్వీకరణ ప్రారంభం

సాక్షి, అమరావతి: బీఎస్సీ (నర్సింగ్) రెండేళ్ల డిగ్రీ కోర్సులో 2022–23 విద్యా సంవత్సరానికి కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లలో ప్రవేశాల కోసం మూడో విడత కౌన్సెలింగ్‌కు వెబ్‌ఆప్షన్లను ఆహ్వానిస్తూ డా.వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆప్షన్ల నమోదు ప్రక్రియ బుధవారం ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైంది. ఈ నెల 4న సాయంత్రం 6 గంటల వరకు https://ugpostbasic.ntruhsadmissions. com లో విద్యార్థులు ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు.

డిపార్టుమెంటల్ టెస్టు సమయాల్లో మార్పు

సాక్షి, అమరావతి: వివిధ శాఖల ఉద్యోగులకు నిర్వహించే డిపార్టుమెంటల్ టెస్టు(నవంబర్) పరీక్షలకు సంబంధించిన సమయాల్లో మార్పులు చేసినట్లు ఏపీపీఎస్సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ 9 నుంచి 14 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఆబ్జెక్టివ్ పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 వరకు మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు నిర్వహిస్తారు. డిస్క్రిప్టివ్ పరీక్షలు రోజూ ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామని ఏపీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

డిసెంబర్ 3 నుంచి లా సెట్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: లా కాలేజీల్లోని యూజీ, పీజీ లా కోర్సుల్లో ప్రవేశాలకు తొలివిడత కౌన్సెలింగ్‌ను డిసెంబర్ 3 నుంచి 10 వరకు నిర్వహించనున్నట్లు లా సెట్ కన్వీనర్ వై.నజీర్ అహ్మద్ బుధవారం తెలిపారు. 19న సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. అలాగే, ఏపీ పీజీసెట్ రెండో విడత కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభమై డిసెంబర్ 2 వరకు జరుగుతుందని, అభ్యర్థులకు డిసెంబర్ 8న సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

జడ్జీల బదిలీపై సమీక్షించండి

సీజేఐకి ఏపీ అడ్వొకేట్స్ జాయింట్ కమిటీ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్(మద్రాస్ హైకోర్టుకు), జస్టిస్ డి.రమేశ్(అలహాబాద్ హైకోర్టుకు) బదిలీలపై సమీక్షించాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు ఆంధ్రప్రదేశ్ అడ్వొకేట్స్ జాయింట్ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీజేఐకి బుధవారం లేఖ రాసింది. పారదర్శకతకు వ్యతిరేకంగా కొలీజియం ఏకపక్షంగా వ్యవహరించినట్లుగా ఉందని ఆరోపించింది. ఏపీ హైకోర్టులో ఈ ఇద్దరు న్యాయమూర్తులు రాజ్యాంగ విలువలు, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుతున్నారని పేర్కొంది.

'ఉపాధ్యాయులను' జాబితా నుంచి తొలగిస్తున్నారు

సీఈసీకి ఎమ్మెల్సీ అభ్యర్థి ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా నమోదులో అర్హులైన వారిని తిరస్కరిస్తున్నారని అభ్యర్థి మదన్‌మోహన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ)కి ఫిర్యాదు చేశారు. మూడేళ్ల అనుభవం ఉన్న వారినే ఓటర్లుగా నమోదు చేయాలని నిబంధనలు ఉన్నాయన్న కారణంతో ఉపాధ్యాయులను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఈసీకి వివరించారు. నిబంధనల ప్రకారం వేరు వేరు ప్రాంతాల్లో మూడేళ్ల పాటు పనిచేసినప్పటికీ ఆ సీనియారిటీని అర్హతగా పరిగణించేలా కమిషన్ నిబంధనల్లో ఉందని గుర్తుచేశారు.

4న 'శాప్ చెస్ లీగ్' పోటీలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), ఏపీ చెస్ అసోసియేషన్ సంయుక్తంగా రాష్ట్రస్థాయి చదరంగం పోటీలను నిర్వహిస్తున్నట్లు శాప్ ఎండీ ప్రభాకరరెడ్డి చెప్పారు. బుధవారం శాప్ కార్యాలయంలో 'శాప్ చెస్ లీగ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎండీ మాట్లాడుతూ 4న విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో పోటీలు ఉంటాయన్నారు. వయో పరిమితితో సంబంధం లేకుండా ఆసక్తి కలిగిన పాఠశాల, కాలేజీ స్థాయి క్రీడాకారులు (బాలబాలికలు) పాల్గొనవచ్చని తెలిపారు. www.apchess.org, www.sports.-ap.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 90303 08811 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'టిడ్కో లబ్ధిదారులకు వేగంగా బ్యాంకు రుణాలివ్వాలి'

సాక్షి, అమరావతి: ప్రజల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంలో టిడ్కో ఉద్యోగులు సమష్టిగా పనిచేయాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. బుధవారం టిడ్కో రాష్ట్ర కార్యాలయంలో ఎస్ఎల్‌టీసీ, సీఎల్‌టీసీ ఉద్యోగులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ఇప్పించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మెప్మా, జిల్లా ఆర్డినేటర్ (బ్యాంక్ లింకేజ్)తో సమన్వయం చేసుకోవాలన్నారు. అసోసియేషన్ సభ్యులు చైర్మన్‌ను సత్కరించారు. ఎండీ శ్రీధర్, చీఫ్ ఇంజనీర్ గోపాలకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అందాల వంతెనపై అద్దాల నడవా

తెలుగు రాష్ట్రాల మధ్య ముచ్చటగొలిపే వంతెన

- సోమశిల - సిద్దేశ్వరం మధ్య కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన నిర్మాణానికి ఆమోదం
- రూ.1,082.65 కోట్లతో ప్రణాళిక.. రూ.436 కోట్లు విడుదల
- అద్దాల నడకదారితోపాటు పర్యాటకులను ఆకర్షించేలా నిర్మాణం
- తెలుగు రాష్ట్రాల మధ్య తగ్గనున్న 80 కిలోమీటర్ల దూరం

ఐకానిక్ వంతెన ఇలా..

ఇక్కడ సాధారణ వంతెన కాకుండా పర్యాటక ఆకర్షణగా ఐకానిక్ వంతెన నిర్మించాలని నిర్ణయించారు. నంద్యాల జిల్లా సిద్ధేశ్వరం – తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల మధ్య దాదాపు 2 కిలోమీటర్ల మేర ఈ వంతెన నిర్మిస్తారు. కేబుల్ ఆధారిత సస్పెన్షన్ వంతెనగా నిర్మించేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఆమోదించారు. నల్లమల ప్రాంతంలో, శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌లో విహరించే సందర్శకులకు ఈ వంతెన పెద్ద ఆకర్షణగా నిలవనుంది. దీనిపై ప్రత్యేకంగా అద్దాల నడక దారిని ఏర్పాటు చేయనున్నారు. ఆలయ శిఖరం రూపంలో పైలాన్, ఎల్‌ఈడీ లైట్ల కాంతులతో ఇది పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుందని ఎన్‌హెచ్ఏఐ వర్గాలు చెబుతున్నాయి. వంతెన నిర్మాణాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని భావిస్తున్నారు.

సాక్షి, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానిస్తూ కృష్ణా నదిపై ముచ్చటగొలిపే ఐకానిక్ వంతెన నిర్మాణం కానుంది. దీని నిర్మాణంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య 80 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. పర్యాటకానికి ఊతమిచ్చేలా ఈ వంతెన నిర్మించనున్నారు. రూ.1,082.65 కోట్లతో రూపొందించిన ఈ వంతెన నిర్మాణ ప్రణాళికను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ ఆమోదించింది. మొదటి విడతగా రూ.436 కోట్లు కూడా మంజూరు చేసింది. దాంతో నంద్యాల జిల్లాలో వరద ముంపు బాధిత గ్రామాల ప్రజల సౌకర్యార్థం కృష్ణా నదిపై కొత్త వంతెన నిర్మించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపాదన కార్యరూపం దాల్చనుంది.

కృష్ణా నదిపై కొత్త వంతెన నిర్మాణ ప్రతిపాదన 2008 నుంచి పెండింగులో ఉంది. 2007లో నాటు పడవలో కృష్ణా నదిని దాటుతూ ప్రమాదానికి గురై 61 మంది మరణించారు. దీంతో సిద్ధేశ్వరం – సోమశిల మధ్య వంతెన నిర్మించాలని అనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్ణయించారు. 2008లో శంకుస్థాపన కూడా చేశారు. ఆయన హఠాన్మరణంతో దాని నిర్మాణం నిలిచిపోయింది. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు దీనిని పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానిస్తూ ఎన్‌హెచ్–167 కె గా ప్రకటించి కృష్ణా నదిపై వంతెనతో సహా ఆరులేన్ల రహదారి నిర్మాణానికి నిర్ణయించారు. తెలంగాణలోని నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల బైపాస్ రోడ్డు వరకు 174 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల జాతీయ రహదారి (ఎన్‌హెచ్–167కె)ని రూ.1,200 కోట్లతో నిర్మించేందుకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ సమ్మతించింది. దాంతోపాటు కృష్ణా నదిపై వంతెన కూడా నిర్మించాలని నిర్ణయించారు.

తగ్గనున్న దూరం

ఈ వంతెన నిర్మాణంతో నంద్యాల జిల్లాలోని ముంపు గ్రామాల ప్రజలు నదిలో ప్రయాణించాల్సిన అవసరం లేకుండా రోడ్ కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఆత్మకూరు, నందికొట్కూరు, పడిగ్యాల, కొత్తపల్లి మండలాల్లోని దాదాపు 35 గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. ఏపీ, తెలంగాణ మధ్య దూరమూ 80 కిలోమీటర్లు తగ్గుతుంది. ప్రస్తుతం నంద్యాల నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే కర్నూలు, వనపర్తి మీదుగా వెళ్లాలి. ఈ వంతెన నిర్మిస్తే నంద్యాల నుంచి నేరుగా నాగర్‌కర్నూలు మీదుగా హైదరాబాద్ వెళ్లిపోవచ్చు. తెలంగాణ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు కూడా వ్యయ ప్రయాసలు తగ్గుతాయి.

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీకి బీఓఎం ఏర్పాటు

- అనకాపల్లి ఎంపీ, పాడేరు, సింగనమల, చింతలపూడి ఎమ్మెల్యేలు
- శాస్త్రవేత్తలు, ఉద్యాన రైతులు, వర్సిటీ ఉన్నతాధికారులకు చోటు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, పాడేరు, చింతలపూడి, సింగనమల ఎమ్మెల్యేలు కే భాగ్యలక్ష్మి, వీ ఎలీజా, జే పద్మావతికి సభ్యత్వం కల్పించారు. వర్సిటీ డీన్ డాక్టర్ ఏఎస్ పద్మావతితో పాటు శాస్త్రవేత్తల కేటగిరిలో రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ వైఎస్ రెడ్డి, అకడమిక్ కౌన్సిల్ సభ్యులుగా ఉద్యాన వర్సిటీ అసోసియేట్ డీన్స్ డాక్టర్ ఎం.మాధవి, డాక్టర్ ఎస్ఎస్ విజయపద్మ, డాక్టర్ పీ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆదర్శ రైతుల కేటగిరీలో జున్నూరి వెంకటేశ్వరరావు (నంగవరం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా), బత్తిన లక్ష్మీనారాయణ (మందస, శ్రీకాకుళం జిల్లా), దువ్వూరి చంద్రశేఖర రెడ్డి (దువ్వూరివారిపాలెం, నెల్లూరు జిల్లా),శివప్రసాద్‌రెడ్డి (సింహాద్రి పురం) ఆగ్రో–ఇండస్ట్రీస్ ఎంటర్‌ప్రెన్యూర్ కేటగిరీలో కేశవరెడ్డి (రాప్తాడు), జి.సుమిత్రరాజేష్, పంచాయతీరాజ్ విభాగం నుంచి స్టేట్ ఛాంబర్ ఆఫ్ పంచాయతీరాజ్ స్పెషల్ ఆఫీసర్‌కు అవకాశం కల్పించారు.

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణపై కసరత్తు

త్వరలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధుల కమిటీ పర్యటన

సాక్షి, అమరావతి: అసైన్డ్ భూములను సంబంధిత వ్యక్తులు విక్రయించుకునే హక్కు కల్పించే (క్రమబద్ధీకరించే) అంశంపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన ప్రజాప్రతినిధుల కమిటీ కసరత్తు చేస్తోంది. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధ్యక్షతన నలుగురు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలతో ఏర్పాటైన కమిటీ ఇప్పటికే సమావేశమై ఈ అంశంపై చర్చించింది. 1954 నుంచి 1977 వరకు, ఆ తర్వాత ప్రభుత్వం పేదలు, ఇతరులకు కేటాయించిన వ్యవసాయ భూములను వారి అవసరాల రీత్యా అమ్ముకునేందుకు అవకాశం లేదు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో గతంలోనే అసైన్డ్ భూములను అమ్ముకునే హక్కు కల్పించారు. ఆ రాష్ట్రాల తరహాలోనే మన రాష్ట్రంలోనూ అసైన్డ్ భూములను అమ్ముకునే హక్కు కల్పించేందుకు ప్రజాప్రతినిధుల కమిటీ ఆ రాష్ట్రాల్లో పర్యటించనుంది. అక్కడ ఈ నిర్ణయం ఎలా తీసుకున్నారు, ఎలా అమలు చేస్తున్నారు, దానివల్ల ఎదురయ్యే పరిస్థితులు వంటి అన్ని అంశాలపై అధ్యయనం చేయనుంది.

ఇళ్ల లబ్ధిదారులకు రూ.2,332.11 కోట్ల రుణం

- 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం
- పావలా వడ్డీకి రూ.35 వేల బ్యాంకు రుణం
- ఇప్పటివరకు 6.61 లక్షలమందికి రుణసాయం

సాక్షి, అమరావతి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయం చేస్తోంది. పావలా వడ్డీకి రూ.35 వేల రుణాన్ని బ్యాంకుల ద్వారా సమకూరుస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 6.61 లక్షల మంది రూ.2,332.11 కోట్ల రుణాన్ని అందుకున్నారు. అత్యధికంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 23,935 మంది లబ్ధిదారులు ఉండగా 70 శాతం మందికి.. అంటే 16,839 మందికి ఇప్పటికే రుణాలు తీసుకున్నారు. అనంతరం సత్యసాయి జిల్లాలో 43,070 మందికి గాను 69 శాతం మందికి రుణాలిచ్చారు. పథకం కింద తొలిదశలో ఇళ్లు మంజూరైన 14.82 లక్షల మందిలో 45 శాతం మంది.. అంటే 6.61 లక్షల మంది ఇప్పటికే రుణాలు పొందారు. లబ్ధిదారులకు బ్యాంకుల రుణాలు మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. బ్యాంకులు, సెర్ప్/మెప్మాలను సమన్వయపరుచుకుంటూ లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా చూసే బాధ్యతలను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు అప్పగించారు.

అనేక రకాలుగా అండ

ఇళ్లులేని పేదలకు గృహయోగంకల్పించడం కోసం ప్రభుత్వం అనేక రకాలుగా అండగా నిలుస్తోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద 30 లక్షల మందికిపైగా పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అదే విధంగా ఒక్కో యూనిట్‌కు రూ.1.80 లక్షల చొప్పున అందిస్తున్నారు. మరోవైపు ఉచితంగా 20 టన్నుల ఇసుక, మార్కెట్ ధరల కన్నా తక్కువకు 420 కిలోల ఐరన్, 100 బస్తాల సిమెంట్‌తో కలిపి కొంత ఇతర నిర్మాణ సామగ్రి సరఫరా చేస్తున్నారు. మరోవైపు బ్యాంకుల రుణం రూపంలో కూడా అండగా నిలుస్తుండటం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఇనాం' రైతులకు పట్టాలిచ్చేలా..

- కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు సర్క్యులర్ జారీ చేసిన ప్రభుత్వం
- ఇనాం గ్రామాల సర్వే, సెటిల్మెంట్‌కు మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: ఇనాం గ్రామాల్లో సర్వే, సెటిల్మెంట్‌కి ప్రభుత్వం మార్గదర్శకాలు (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) జారీ చేసింది. సర్వే, రెవెన్యూ అధికారులు 1956 ఇనాం రద్దు చట్టానికి అనుగుణంగా.. ప్రస్తుత మార్గదర్శకాలతో ఇనాం గ్రామాల్లో సర్వే చేసి అర్హత గల రైతులకు రైత్వారీ పట్టాలు జారీ చేయొచ్చని సూచించింది. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు బుధవారం ఒక సర్క్యులర్ జారీ చేశారు.

12 జిల్లాలు.. 55 గ్రామాలు

ప్రస్తుతం రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 33 సెటిల్‌కాని ఇనాం గ్రామాలు, 22 సర్వే చేయని ఇనాం గ్రామాలున్నట్టు రెవెన్యూ శాఖ గుర్తించింది. ఆ గ్రామాల్లో గతంలో సర్వే చేసినా క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియక సెటిల్మెంట్ జరగలేదు. అలాంటి గ్రామాల్లోనూ తాజాగా మళ్లీ సర్వే చేయనున్నారు. ఇందుకోసం సంబంధిత తహసీల్దార్లు సర్వే కోసం నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఆ తర్వాత వివిధ దశల్లో సర్వే కొనసాగిస్తారు. ఈ సమయంలో రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులు, సంబంధిత భూముల్లో ఉన్న వారు చూపిస్తున్న రికార్డులన్నింటినీ పరిశీలిస్తారు. సర్వే పూర్తయ్యాక తహసీల్దార్ సెటిల్మెంట్ ప్రక్రియ చేపడతారు. ఇందులో భాగంగా గ్రామ మ్యాప్, రీసర్వే ల్యాండ్ రిజిస్టర్, ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) వంటి రిజిస్టర్లు రూపొందిస్తారు. దాన్నిబట్టి అర్హులైన వారికి ఆ గ్రామాల్లో రైత్వారీ పట్టాలు జారీ చేస్తారు. దీనిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ కోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. జిల్లా కలెక్టర్లు తాజా మార్గదర్శకాల ప్రకారం ఇనాం గ్రామాల్లో సర్వే, సెటిల్మెంట్‌కి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శరవేగంగా జగనన్న కాలనీల నిర్మాణాలు

- త్వరగా గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి
- గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- లింగాలవలస వద్ద అర్బన్ జగనన్న లే అవుట్‌ను పరిశీలించిన మంత్రి



శ్రీకాకుళం జిల్లా గార మండలం జగనన్న కాలనీలో నిర్మాణం జరుగుతున్న ఇంటిని పరిశీలిస్తున్న మంత్రులు రమేష్, ధర్మాన ప్రసాదరావు

గార: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. ఆయన బుధవారం శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని అంపోలు పంచాయతీ లింగాలవలస వద్ద అర్బన్ జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను పరిశీలించి నాణ్యత, సామగ్రి, సిమెంట్, ఇనుము తదితర అంశాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులను ప్రోత్సహించి ఇళ్ల నిర్మాణాలు చేయిస్తున్న వార్డు సచివాలయ సిబ్బందిని అభినందించారు. నిర్మాణాలు వేగంగా పూర్తిచేసి గృహప్రవేశం చేయాలని ఆకాంక్షించారు. డిసెంబర్ నుంచి జూలై వరకు నిర్మాణాలకు అనుకూలమని, రాత్రివేళల్లో కూడా పనులు జరిగేలా చూడాలని చెప్పారు. రెండు మూడునెలల్లో ఈ కాలనీ పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో లబ్ధిదారులు నిత్యం పరిశీలించాలని ఆయన సూచించారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఇల్లు ఉండటం ఓ గౌరవంగా సమాజం భావిస్తుందని చెప్పారు. లబ్ధిదారులు ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని సూచించారు. రూ.12 వేల కోట్లతో భూమి కొనుగోలు చేసినట్లు తెలిపారు. 30 లక్షల మందికి పట్టాలిచ్చామన్నారు. చంద్రబాబు లాంటి వారు చిన్నచిన్న లోపాలను ఎత్తి చూపిస్తారని, వాటిని నమ్మవద్దని కోరారు. జిల్లాలో చంద్రబాబు హయాంలో ప్రజల కోసం ఒక్క ఇంటి స్థలమైనా కొన్నాడా అని ప్రశ్నించారు. జిల్లాలోనే అత్యంత సుందరమైన కాలనీగా లింగాలవలస లే అవుట్ తయారవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఆర్డీవో బి.శాంతి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మార్పు ధర్మారావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, సర్పంచ్ గొండు జయరామ్, ఎంపీటీసీ ముద్దాడ గోవిందరావు, పీసశ్రీహరిరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆశ్రయమిచ్చాడు..



శ్రీకాకుళంలో మాకు ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక సొంత స్థలంతో పాటు ఇల్లు కూడా కట్టిస్తున్నారు. మా కుటుంబసభ్యులు కాదన్నా జగనన్న ఆశ్రయంతో నాకు సొంతిల్లు తయారవుతోంది. జీవితాంతం మర్చిపోలేని కానుక ఇచ్చిన అన్నకు మేం రుణపడి ఉంటాం.

– ఎల్లేటి శారద, తురాయిచెట్టు వీధి, శ్రీకాకుళం

మా పాపకు ఇల్లు మంజూరైంది



మా పాప పేరున ఇల్లు మంజూరవడంతో కష్టం అంతా గట్టెక్కింది. అద్దె ఇంట్లో ఆర్థికంగా కష్టాలు పడేవాళ్లం. ఈ సమయంలో మంచి స్థలంతోపాటు ఇంటి నిర్మాణం చాలా బాగా జరుగుతోంది. ఎప్పుడు ఈ ఇంట్లో దిగుతామా అని ఎదురుచూస్తున్నాం.

– భవానిస్వామి, శ్రీకాకుళం

'శ్రీ ప్రకాష్' ఆక్రమణలో ప్రభుత్వ భూమి!

- అనకాపల్లి జిల్లా పీఎల్‌పురంలో 17 ఎకరాలు కబ్జా
- 2012లోనే ఆక్రమణ.. తాజా విచారణలో వెలుగులోకి..
- వివరాలు వెల్లడించిన వీఆర్‌వో
- ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్న తహసీల్దార్



వీఆర్‌వో భాస్కర నాయుడు


పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పీఎల్‌పురంలో 17 ఎకరాల ప్రభుత్వ భూమిని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థ ఆక్రమించుకుందని గ్రామ వీఆర్‌వో భాస్కర నాయుడు తెలిపారు. బుధవారం ఆయన పీఎల్‌పురంలో మీడియాతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా.. వాటి స్థితిగతులు పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు గ్రామంలో ప్రభుత్వ భూములను పరిశీలించామని తెలిపారు. ఈ క్రమంలో సర్వేనంబర్ 122లో 19.28 ఎకరాల భూమి ఎస్ఎఫ్ఏలో జోడి చెరువుగా నమోదైందన్నారు. ఈ భూమిలో 5 ఎకరాలు 22ఏ రిజిస్టర్‌లో నమోదయ్యాయని చెప్పారు. మిగిలిన 14 ఎకరాలను శ్రీ ప్రకాష్ విద్యాసంస్థ ఆక్రమించుకుందన్నారు. 2012లో అప్పటి తహసీల్దార్, వీఆర్‌వోలు ఈ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా జారీ చేశారని తెలిపారు. రెవెన్యూ నిబంధనల ప్రకారం.. ఎవరైనా చెరువు గర్భాలు ఆక్రమిస్తే రెగ్యులర్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయడానికి వీల్లేదన్నారు. ఈ భూములకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చే అధికారం కలెక్టర్‌కు మాత్రమే ఉందని తెలిపారు. అటువంటి చెరువు ఆక్రమించుకుంటే పాస్ పుస్తకాలు ఎలా జారీ చేశారో తెలియాల్సి ఉందన్నారు.

కబ్జా వివరాలు

సర్వే నంబర్ 122/బిలో ఖాతా నంబర్ 258తో 3.15 ఎకరాలు సీహెచ్‌వీకే నర్సింహారావు పేరిట, 272తో 4.15 ఎకరాలు సీహెచ్ విజయ్‌ప్రకాష్ పేరిట, ఖాతా నంబర్ 371తో 1.73 ఎకరాలు సీహెచ్‌వీకే నర్సింహారావు పేరిట, ఖాతా నంబర్ 259తో 5.20 ఎకరాలు సీహెచ్ రామసీత పేరున పాస్ పుస్తకాలు మంజూరయ్యాయని వీఆర్‌వో భాస్కర నాయుడు తెలిపారు. సుమారు 14 ఎకరాలకు పాస్ పుస్తకాలు పొందగా.. మరో 3 ఎకరాల భూమి కూడా కళాశాల కబ్జాలో ఉందన్నారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థ ఆక్రమించిన భూముల వివరాలపై నివేదికను, ఫిర్యాదును తహసీల్దార్‌కు అందజేస్తున్నానన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తహసీల్దార్ జయప్రకాష్ తెలిపారు.

లాస్ట్ చాన్స్.. ప్లీజ్!

- ఆఖరి అవకాశం నాకు కాదు.. రాష్ట్రానికి
- 40 ఏళ్లుగా రాజకీయాల్లోనే.. ఎమ్మెల్యే పదవితో పనిలేదు
- నన్ను, లోకేశ్‌ను కూడా చంపేస్తారట
- టీడీపీ హయాంలోనే పోలవరం 72 శాతం పూర్తి
- ఏలూరు జిల్లా పర్యటనలో చంద్రబాబు వ్యాఖ్యలు



సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'ప్రజలు ఇప్పుడు కూడా నామాట వినకపోతే రాష్ట్రానికి ఇదే చివరి అవకాశం. నాకే మీ కొత్త చరిత్ర అవసరం లేదు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశా. ఈ రికార్డును ఎవరూ మార్చలేరు. నాకు ఎమ్మెల్యే పదవితో పనిలేదు. నా ఆలోచన అంతా రాష్ట్రం కోసమే. ప్రజల్లో చైతన్యం రావాలి' అంటూ బుధవారం ఏలూరు జిల్లా పర్యటన సందర్భంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పదేపదే మొర పెట్టుకున్నారు. దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో పర్యటించారు. పెదవేగి మండలం విజయరాయిలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ప్రారంభించారు. లింగపాలెం, ధర్మాజీగూడెం, చింతలపూడి రోడ్‌షోల్లో మాట్లాడారు. మేనిఫెస్టోలోని 96 శాతం హామీలను సీఎం జగన్ నెరవేర్చితే ప్రజ లు ఇంత ఇబ్బంది పడతా రా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ క్లీన్ స్వీప్ చేస్తుందన్నారు.

పోలవరాన్ని గోదాట్లో కలిపారు!


మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణను హైదరాబాద్ సీబీఐ కోర్టుకు అప్పగించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించినా సీఎం నోరు విప్పడం లేదని చంద్రబాబు విమర్శించారు. కొత్తగా వచ్చిన మంత్రికి పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ ఎక్కడ ఉంటుందో కూడా తెలియదని, ఆయన ఆకాశంలో ఉంటుందని అనుకుంటున్నారని, తాను సీఎంగా ఉన్నప్పుడే 72 శాతం పనులు పూర్తి చేశానని చెప్పారు. రివర్స్ టెండర్ల పేరుతో ప్రాజెక్టును గోదాట్లో కలిపేశారని, నిర్వాసితులకు న్యాయం చేయలేదని విమర్శించారు.పోలవరంలో తాము డయాఫ్రం వాల్, కాఫర్ డ్యామ్ పూర్తి చేస్తే నేడు దాని పరిస్థితి ఏమైందో ఎవరికి తెలియదన్నారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు తాను రూ.3,100 కోట్లు ఖర్చు చేస్తే జగన్ వచ్చి నాశనం చేశారని ధ్వజమెత్తారు. మూడేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ కాలేదని, వలంటీర్ ఉద్యోగం, మటన్, ఫిష్ మార్కెట్ ఉద్యోగాలే ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఒకాయన తాను తలుచుకుంటే మొద్దు శ్రీనుతో లేపేసేవాడినని అంటున్నారని చెప్పారు. ఇప్పుడు లోకేశ్ టార్గెట్ అంటున్నారని, తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదన్నారు.

శాశ్వతంగా లండన్ పంపిస్తాం..

అందరికీ ఐటీ ఉద్యోగాలిస్తానని చెప్పిన స్థానిక ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి తన తండ్రితో కలిసి ఇసుక, మట్టి అమ్ముకుంటున్నారని, ఆయన్ను శాశ్వతంగా లండన్ పంపుతానని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే అమరావతి రాజధానిగా ఉండదని, పోలవరం కూడా ఉండదని తాను గతంలోనే చెప్పానన్నారు. విద్యాదీవెన అంటూ జగన్ హడావుడి చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. తాను 16 లక్షల మందిని చదివిస్తే దాన్ని కోతలు విధించి 10 లక్షల మందికి ఇస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి పేరుతో ఆడబిడ్డలకు డబ్బులు వేసి జే బ్రాండ్ మద్యం ద్వారా తిరిగి తన ఖాతాకే తెప్పించుకునే తెలివైన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, ఆక్వా కల్చర్ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఒక్కొక్కరిపై రూ.2.70 లక్షలు తలసరి అప్పు ఉందన్నారు. ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, టీడీపీ నేతలు చింతమనేని ప్రభాకర్, నిమ్మకాయల చినరాజప్ప, గన్ని వీరాంజనేయులు, బూరుగుపల్లి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

భస్మాసురుడు చంద్రబాబే

దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



- దెందులూరులో రూ.1,700 కోట్లతో అభివృద్ధి చేశాం
- టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి ఏమిటి?
- మా ప్రగతి యాత్రకు 25 వేల మంది సైనికుల్లా వచ్చారు
- టీడీపీ డబ్బులు, మందు, బిర్యానీ ఇచ్చినా 3 వేల మంది రాలేదు
- రౌడీషీటర్‌ను పక్కన పెట్టుకొని శాంతిభద్రతలపై మాట్లాడడం సిగ్గుచేటు

ఏలూరు టౌన్: టీడీపీ అధినేత చంద్రబాబుదే భస్మాసుర హస్తమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ధ్వజమెత్తారు. పిలనిచ్చిన మామ ఎన్టీ రామారావు నుంచి పార్టీని లాక్కొని, ఆయన నెత్తిన చెయ్యి పెట్టిన పెద్ద భస్మాసురుడు బాబు అని అన్నారు. ఎమ్మెల్యే బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో మూడున్నరేళ్లలో రూ.1,700 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశామని, దానిని ప్రజలకు వివరిస్తూ ప్రగతి యాత్ర చేశామని చెప్పారు. టీడీప హయాంలో జరిగిన అభివృద్ధి ఏమిటో చెప్పగలరా అని నిలదీశారు. జాబ్ మేళాలు నిర్వహించి 3 వేల మందికి ఉద్యోగాలు ఇప్పించామని, టీడీపీ హయాంలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో చెప్పాలని అన్నారు. తాను లండన్ బాబునే అని, పేద ప్రజలను అక్కున చేర్చుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అడుగుజాడల్లో నడవాలనే ఆకాంక్షతో లండన్ నుంచి వచ్చానని అన్నారు. తమ ప్రగతి యాత్రకు 25 వేల మంది సైనికుల్లా వచ్చారని తెలిపారు. చంద్రబాబు ఒక్కొక్కరికి రూ.700, లిక్కర్, బిర్యానీ ఇచ్చి రెండు జిల్లాల నుంచి జనాన్ని తరలించారని, అయినా 3 వేల మంది కూడా రాలేదని చెప్పారు. అందుకే బాబు ఫ్రస్ట్రేషన్‌లో ఊగిపోయారన్నారు. చంద్రబాబు పక్కన నిలబడిన వ్యక్తి రాష్ట్రంలో ఇసుక, గ్రావెల్, మట్టి ఏ విధంగా దోపిడీ చేశారో ప్రజలందరికీ తెలుసని అన్నారు. రౌడీషీటర్‌ను పక్కన పెట్టుకొని శాంతిభద్రతల గురించి చంద్రబాబు మాట్లాడడం సిగ్గుచేటని, చింతమనేనిపై రౌడీషీట్ ఓపెన్ చేసింది చంద్రబాబే కదా అని అన్నారు. పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని, డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారకులు టీడీపీ వారేనని విమర్శించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.